


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 111 | ఆదివారం | 22-03-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఇరాన్ అణు కేంద్రంపై
# వైమానిక దాడి

● ఎలాంటి రేడియేషన్ లీక్ కాలేదని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ వెల్లడి ● పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రతీకార దాడులు చేస్తామని హెచ్చరిక ● అంతర్జాతీయ స్థాయిలో భద్రతపై పెరిగిన ఆందోళనలు ● భారీగా నౌకాదళాన్ని మోహరిస్తున్న అమెరికా



**బీరుట్/దుబాయ్ :** ఇరాన్‌లోని ప్రముఖ అణు కేంద్రం నటాంజ్ న్యూక్లియర్ ఫెసిలిటీపై తాజాగా వైమానిక దాడి జరిగింది. ఇది ఇరాన్‌లోని ప్రధాన యురేనియం శుద్ధి కేంద్రం కావడంతో ఈ ఘటన అంతర్జాతీయంగా ప్రాధాన్యత పొందింది. ఈ దాడిని ఇరాన్ ధ్రువీకరించింది. అయితే, ఈ దాడి వల్ల ఎలాంటి రేడియేషన్ లీకేజీ జరగలేదని ఇరాన్ అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది. నటాంజ్ కేంద్రం ఇప్పటికే గతంలో కూడా దాడులకు గురైంది. ముఖ్యంగా గత ఏడాది ఇజ్రాయెల్ ఈ కేంద్రంపై దాడులు చేసింది. ఇప్పుడు ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు కొన సాగిస్తున్న విషయం తెలిసిందే. ఉపగ్రహ చిత్రాల ప్రకారం అప్పట్లో కొన్ని భవనాలు దెబ్బతిన్నాయి. అంతర్జాతీయ అణు పర్యవేక్షణ సంస్థ (ఐఎఇఎ) కూడా గత దాడుల సమయంలో పెద్దగా రేడియేషన్ ప్రమాదం లేదని తెలిపింది. ప్రస్తుతం జరిగిన తాజా దాడి ప్రభావంపై పూర్తి సమాచారం ఇంకా వెలువడలేదు. ఈ కేంద్రం టెహ్రాన్‌కు దక్షిణఆగ్నేయ దిశలో సుమారు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇరాన్ తరువాయి 2లో

## ఫొటోలు అప్‌లోడ్ ధోరణిపై
# ‘సుప్రీం’ ఆందోళన

ఈ కార్యకలాపాలు నిష్పక్షపాత విచారణకు ముప్పు కలిగిస్తాయని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** పోలీసులు మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించిన వీడియోలను ప్రజలు తక్షణమే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసే ధోరణిపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి కార్యకలాపాలు నిష్పక్షపాత విచారణకు తీవ్రమైన ముప్పును కలిగిస్తాయని తెలియజేసింది. ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, విపుల్ ఎం పంచోలి శుక్రవారం ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పోలీసులు నిందితుల వీడియోలు, ఫోటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి ప్రజల్లో పక్షపాత వైఖరిని సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై ధర్మాసనం విచారణ జరుపుతోంది. పోలీసులు మీడియా బ్రీఫింగ్‌ల కోసం మార్గదర్శకాలను రూపొందించాలని, అందులో సోషల్ మీడియా పోస్టులను కూడా చేర్చాలని కోర్టు మరో కేసులో ఇప్పటికే రాష్ట్రాలను కోరిందని ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వాదించింది. అయితే ఆ మార్గదర్శకాల ఫలితాల కోసం వేచిఉండాలని పిటిషనర్ హేమేంద్ర పటేల్‌కు ధర్మాసనం సూచించింది. అలాగే ఈ రోజుల్లో మొబైల్ ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరూ మీడియాగా అవతారమెత్తారని పిటిషనర్ హేమేంద్ర పటేల్ తరపున హాజరైన న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. నిందితులకు బేడీలు వేయడం, తాళ్లతో బంధించడం, ఊరేగించడం, మోకాళ్లపై కూర్చోబెట్టడం వంటి చిత్రాలను పోలీసులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అనేది వ్యక్తిగత గౌరవానికి అవమానం కలిగించడమే కాకుండా ప్రజల పక్షపాతాన్ని కూడా పెంచుతుందని సీనియర్ న్యాయవాది తరువాయి 2లో



## రైతు భరోసా
# నేడు విడుదల

● సిద్ధిపేట జిల్లా_నర్మెట్టలో ఆయిల్ పామ్ కంపెనీ ప్రారంభ వేదికనుంచి నిధులు విడుదల చేయనున్న సిఎం రేవంత్ రెడ్డి
● ఒక ఎకరం వరకు ఉన్న 70 లక్షల మంది రైతు ఖాతాల్లోకి రూ.3,590 కోట్లు జమ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎట్టకేలకు రైతు భరోసా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం మూడు విడుతల్లో రూ.9 వేల కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. ఈ నెల 22వ తేదీన సిద్ధిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్ పామ్ కంపెనీ ప్రారంభించనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇదే వేదికగా రైతు భరోసాను లాంఛనంగా విడుదల చేయనున్నారు. ఒక ఎకరం వరకు ఉన్న మొత్తం 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,590 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండున్నర ఏళ్ల కాలంలో ఇప్పటివరకు ఒక దఫా మాత్రమే రైతు భరోసా నిధులను విడుదల చేసింది. దీంతో ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సహాయం తరువాయి 2లో

## హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం

● మాజీ డిజిపి మనవరాలికి రూ.1.20 కోట్ల టోకరా

03

## నౌకాయాన స్వేచ్ఛను
# పరిరక్షించాలి

ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌కు ప్రధాని మోదీ ఫోన్ కాల్



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధానికి సంబంధించిన ఉద్రిక్త పరిస్థితులు తీవ్రతరమవుతున్న వేళ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌కు ఫోన్ కాల్ చేశారు. పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ (పర్షియన్ సంవత్సరం) శుభాకాంక్షలు తరువాయి 2లో

## హోర్ముజ్‌ను తెరవండి!

ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి

**యుఎఇ :** హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై ఇరాన్ చేస్తోన్న దాడులను ఖండించాయి. ఈ చర్యల వల్ల అన్ని దేశాలపైనా దుష్ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు యుఎఇ, యుకె, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. “గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధి మూసివేత చర్యలను ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస తరువాయి 2లో

# జీవన్ రెడ్డికి బుజ్జగింపులు

● మాజీ మంత్రితో మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్ చర్చలు ● పార్టీ మార్పు అంశాన్ని అధిష్టానం, సిఎం దృష్టికి తీసుకువెళ్తామని వెల్లడి ● ఎవరు చెప్పినా తగ్గబోనన్న జీవన్‌రెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల



మాజీ మంత్రి జీవన్ రెడ్డికి అండగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ ఆలోచన చేస్తుందని ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు శనివారం తరువాయి 2లో



ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
ఆదివారం
22-03-2026
www.prajapaksham.in


# హెజ్బొల్లాకు సాయం చేస్తున్న సంస్థలపై అమెరికా ఆంక్షలు



**వాషింగ్టన్:** హెజ్బొల్లాకు సంబంధించిన గ్లోబల్ ఆర్థిక నెట్‌వర్క్‌పై అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. అమెరికా దృష్టిలో హెజ్బొల్లా ఒక విదేశీ ఉగ్రవాద సంస్థ. ఈ చర్య ప్రధానంగా ఆ సంస్థకు నిధులు సమకూర్చే మార్గాలను అడ్డుకోవడంపై దృష్టి సారించింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రకటన ప్రకారం, మధ్యప్రాచ్యం, యూరప్, ఉత్తర అమెరికా ప్రాంతాల్లో పనిచేస్తున్న వ్యక్తులు, కంపెనీలు కలిసి హెజ్బొల్లాకు డబ్బు సమకూర్చుతున్నాయి. ఇవి, అక్రమ డబ్బును చట్టబద్ధంగా చూపించే మనీలాండరింగ్ తోపాటు వివిధ వ్యాపార ప్రాజెక్టుల ద్వారా నిధులు సేకరించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నాయి. ఈ ఆర్థిక మార్గాలను నిలిపివేస్తే, హెజ్బొల్లా ఉగ్ర కార్యకలాపాలకు అవసరమైన నిధులను సమకూర్చడం కష్టమవుతుందని అమెరికా భావిస్తోంది. ప్రత్యేకంగా, హెజ్బొల్లా ఫైనాన్షియర్ అలా హసన్ హమీద్ నేతృత్వంలో ఉన్న నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకున్నారు. ఈ నెట్‌వర్క్‌లో 16 మంది వ్యక్తులు, సంస్థలు ఉన్నాయని యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది ట్రెజరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. లెబనాన్, సిరియా, పోలాండ్, స్లోవేనియా, ఖతా ర్, కెనడా వంటి దేశాల్లో ఈ నెట్‌వర్క్ పనిచేస్తూ, 2020 నుంచి సుమారు 100 మిలియన్ డాలర్లకు పైగా నిధులను మళ్లించిందని అంచనా. ఈ ఆంక్షల ప్రకారం, ఆ వ్యక్తులు లేదా సంస్థలకు చెందిన అమెరికాలో ఉన్న ఆస్తులు పూర్తిగా ఫ్రీజ్ అవుతాయి. అలాగే, అమెరికా పౌరులు లేదా సంస్థలు వారితో ఎలాంటి లావాదేవీలు చేయడానికి వీలు ఉండదు. వారి యాజమాన్యంలో 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ భాగస్వామ్యం ఉన్న ఇతర సంస్థలపైనా ఇదే నిబంధనలు వర్తిస్తాయి. అమెరికా అభిప్రాయం ప్రకారం, ఇరాన్ మద్దతుతో హెజ్బొల్లా ప్రపంచవ్యాప్తంగా అస్థిరత సృష్టించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, ఆర్థిక నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఉగ్రవాదాన్ని అరికట్టడం ముఖ్యమైన వ్యూహంగా అమెరికా భావిస్తోంది. మొత్తంగా, ఈ చర్య హెజ్బొల్లా కార్యకలాపాలపై ఆర్థిక ఒత్తిడి పెంచి, దాని ప్రభావాన్ని తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న కీలక నిర్ణయంగా చూడవచ్చు.

## ఇరాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘన!



**బీరుట్:** ఇరాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘన నిరాటంకంగా కొనసాగుతున్నదని ఐదేళ్ల అమలు చేసిన ఉరి శిక్షలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయంపై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ వారం 19 ఏళ్ల యువ రెజ్లర్ సలే మహమ్మదీతోపాటు మరో ఇద్దరు యువకులను అధికారులు ఉరితీశారు. ఈ ఏడాది జనవరిలో దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల సమయంలో అరెస్టైన వారికి విధిస్తున్న శిక్షల అమలు ప్రారంభమైనట్లు ఈ చర్యను పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వం దీనిపై 'దేవునికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం' అనే తీవ్ర ఆరోపణలు మోపింది. నిరసనల సమయంలో ఇద్దరు పోలీసులను హత్య చేశారని ఆరోపించారు. అయితే ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు ఈ కేసులను తీవ్రంగా విమర్శిస్తున్నాయి. వీరిపై విచారణలు న్యాయబద్ధంగా సరిగ్గా లేవని, బలవంతంగా అంగీకరింపచేసిన, ఆ వాంగ్మూలాల ఆధారంగా తీర్పులు ఇచ్చారని పేర్కొన్నాయి. మానవ హక్కుల సంస్థ అంచనాల ప్రకారం, నిరసనల సమయంలో అరెస్టైన వేలాది మందిలో కనీసం 27 మందికి మరణశిక్షలు విధించారు. మరో 100 మందికి పైగా ఇలాంటి శిక్షకు గురయ్యే అవకాశం ఉంది. ఈ పరిణామాలు ప్రభుత్వం ప్రజల్లో భయాన్ని సృష్టించి, భవిష్యత్తులో నిరసనలను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నదనే అనుమానాలను పెంచుతున్నాయి. అమెరికా–ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నప్పటికీ, ఇరాన్‌లో అంతర్గత నిర్బంధం తగ్గలేదని మానవ హక్కుల సంఘాలు విమర్శిస్తున్నాయి. అయితే, ఇంటర్నెట్‌పై ప్రభుత్వం పరిమితులు విధించడం వల్ల వాస్తవ పరిస్థితులపై పూర్తి సమాచారం బయటకు రావడం లేదని అంటున్నాయి. కాగా, నిరసనల సమయంలో వేల మంది మరణించారని, లక్షలాది మంది అరెస్టయ్యారని వేర్వేరు నివేదికలు సూచిస్తున్నాయి.



## దక్షిణ కొరియా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

10 మంది మృతి.. పలువురికి గాయాలు

**సియోల్:** దక్షిణ కొరియాలోని డేజోన్ నగరంలో జరిగిన భారీ అగ్నిప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. ఒక ఆటో పార్ట్స్ ఫ్యాక్టరీలో పేలుడు కారణంగా అగ్ని చెలరేగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో కనీసం 10 మంది మృతిచెందగా, 59 మందికి పైగా గాయపడ్డారు. మరో నలుగురు గల్లంతైనట్లు సమాచారం. భారీగా పొగ వ్యాపించడంతో కొంతమంది కార్మికులు ప్రాణాలు కాపాడుకోవడానికి భవనం నుంచి దూకాల్సి వచ్చింది. కొందరు పొగ శ్వాసించడం వల్ల తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. గాయపడిన వారిలో 25 మంది పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదాన్ని అదుపులోకి తీసుకురావడానికి 500 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, అత్యవసర సిబ్బంది పనిచేశారు. భవనం కూలిపోతుందనే భయంతో మొదట్లో లోపలికి వెళ్లడం కష్టమైంది. అనంతరం ప్రత్యేక రోబోలు, యంత్రాలను ఉపయోగించి అగ్నిని చల్లార్చి, శోధన చర్యలు ప్రారంభించారు. మృతదేహాల్లో ఒకటి రెండో అంతస్తులో, మిగతా తొమ్మిది మూడో అంతస్తులో ఉన్న జిమ్ ప్రాంతంలో కనుగొన్నారు. ఇంకా మిగిలిన నలుగురు కూలిపోయిన శిథిలాల కింద చిక్కుకుపోయి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాద స్థలంలో 100 కిలోలకుపైగా ప్రమాదకర రసాయనాలు కూడా గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది. కాగా, ఈ ప్రమాదం పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై మళ్లీ ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# ఇరాన్ చమురుపై ఆంక్షల సడలింపు



**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న చమురు ధరలను నియంత్రించేందుకు అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురును అమ్మడానికి వీలుగా ఒక నెలపాటు ఆంక్షలను సడలించింది. ఈ నిర్ణయం ప్రకారం ఇప్పటికే నౌకల్లో ఉన్న చమురును మాత్రమే విక్రయించేందుకు అనుమతి ఉంది. కొత్తగా ఉత్పత్తి చేయడం లేదా కొనుగోలు చేయడానికి ఈ సడలింపు వర్తించదు. అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ ప్రకటన ప్రకారం, ఈ చర్యతో సుమారు 140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లోకి వస్తుంది. దీంతో సరఫరా పెరిగి, ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. యుద్ధం ప్రారంభానికి ముందు బ్యారెల్ ధర 70 డాలర్ల వద్ద ఉండగా, ఇటీవల అది 100 డాలర్లకు పైగా పెరిగింది. ఈ చర్య వెనుక వ్యూహాత్మక ఉద్దేశం కూడా ఉంది. ఇరాన్ హోర్ముజ్ జలసంధి వద్ద చమురు రవాణాను ప్రభావితం చేస్తుండగా, మార్కెట్లో అదనపు సరఫరా అందించడం ద్వారా ధరలపై ఒత్తిడిని తగ్గించాలనేది అమెరికా లక్ష్యంగా కనిపిస్తున్నది. అయితే, ఈ విక్రయాల ద్వారా వచ్చే డబ్బును ఇరాన్ సులభంగా వినియోగించుకోలేని విధంగా ఆర్థిక పరిమితులు కొనసాగుతాయి. మొత్తంగా, ఇది తాత్కాలికంగా చమురు ధరలను నియంత్రించే ప్రయత్నమే కానీ, ఇరాన్‌పై అమెరికా ఆర్థిక ఒత్తిడి మాత్రం కొనసాగుతూనే ఉంటుంది.

## పడవపై అమెరికా దాడి..



అమెరికా సైన్యం తూర్పు పసిఫిక్ సముద్రంలో డ్రగ్ స్మగ్లింగ్ అనుమానంతో ఒక పడవపై దాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, ఒకరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. ఈ దాడి తర్వాత బాధితులను గుర్తించిన అమెరికా కోస్ట్ గార్డ్, వారిని కోస్టారికా తీరరక్షక దళానికి అప్పగించింది. అమెరికా ప్రభుత్వం లాటిన్ అమెరికా డ్రగ్ కార్టెల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనిని సాయుధ పోరాటంగా పేర్కొన్నారు. అయితే, ఈ దాడులు చట్టబద్ధతపై, వాస్తవ ప్రభావంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### మావోయిజం క్లోజింగ్ కార్డ్ పది రోజులే గడువు..

# గణపతి అడుగు ఎటువైపు?



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో దశాబ్దాల కాలం గా సాగుతున్న సాయుధ పోరాటం కీలక మలుపు తిరగబోతోందా? అడవి బాట పట్టిన అగ్రనేతలు ఒక్కొక్కరుగా జనజీవన స్రవంతిలో కలుస్తుండటంతో మావోయిస్ట్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందా? ఇప్పుడు ఇదే అంశం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా సంచలనంగా మారిం ది. కేంద్ర ప్రభుత్వం విధించిన ఈ నెల 31 గడువు ముగియడానికి మరో పది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన 'నక్సల్స్ రహిత భారత్' లక్ష్యానికి గడువు సమీపిస్తోంది. గత కొద్ది నెలలుగా సాగుతున్న 'ఆపరేషన్ కాగర్' మావోయిస్టుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. అగ్ర నాయకత్వం అంతా ఛిన్నాభిన్నం కావడం, కీలక కమిటీలు కుప్పకూలడంతో అడవిలో తుపాకీ గొట్టం మూగబోయే పరిస్థితి కనిపిస్తోంది.మావోయిస్ట్ పార్టీలో అత్యంత కీలక వ్యూహకర్త, నంబాల కేశవరావు తర్వాత జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టినట్లు భావిస్తున్న తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ఇటీవలే లొంగుబాటు ప్రకటించడం పార్టీకి కోలుకోలేని దెబ్బ. ఆయనతో పాటు మల్లా రాజిరెడ్డి వంటి అగ్రనేతలు కూడా బయటకు రావడంతో అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారి ఆలోచనల్లో మార్పు మొదలైంది. యుద్ధ ప్రాతిపదికన సాగుతున్న పోలీసుల గాలింపు చర్యల మధ్య, ప్రాణాలు కాపాడుకోవడానికి లొంగుబాటే మేలనే అభిప్రాయం కేడర్‌లో వ్యక్తమవుతోంది.

**అందరి కళ్లు గణపతిపైనే..!**

మావోయిస్టు ఉద్యమానికి సుమారు మూడు దశాబ్దాల పాటు దిశానిర్దేశం చేసిన ముప్పాల లక్ష్మ ణరావు అలియాస్ గణపతి(77) ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? ఆయన లొంగుబాటు ఎప్పుడు? అనే ప్రశ్నలు మిన్నంటుతున్నాయి. గత కొంతకాలంగా గణపతి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు, ప్రస్తుతం ఆయన నేపాల్ సరిహద్దుల్లో లేదా ఢిల్లీ పరిసరాల్లో ఇంటెలిజెన్స్ నిఘాలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. లొంగుబాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి కొన్ని హామీలు (కేసుల ఎత్తివేత, పునరావాసం) ఆశిస్తున్నట్లు సమాచారం. ఆయన సోదరుడు కూడా ఇప్పటికే బహిరంగంగా విజ్ఞప్తి చేయడంతో గణపతి రాక దాదాపు ఖాయమని తెలుస్తోంది.

**చివరి అంకం.. ఎండ్ కార్డ్ పడినట్లేనా?**

గణపతి వంటి అత్యున్నత స్థాయి నేత లొంగిపోతే, అది మావోయిస్ట్ చరిత్రలో అతిపెద్ద మలుపు అవుతుంది. ఆయన లొంగుబాటుతోనే ఈ సాయుధ పోరాటానికి 'ఎండ్ కార్డ్ పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అజ్ఞాతంలో మిగిలి ఉన్న అతికొద్ది మంది నాయకులు కూడా గడువు లోపు బయటకు వస్తారా లేక ఆఖరి వరకు పోరాడతారా అన్నది తేలాల్సి ఉంది.యుద్ధం లాంటి పరిస్థితుల్లో గడువు పెంచడం కంటే, నేతలను జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించి శాంతియుత పరిష్కారం చూపడమే మేలని పౌర సమాజం కోరుకుంటోంది. మరో పది రోజుల్లో ఏం జరగబోతోంది? గణపతి లొంగుబాటు ప్రకటన ఢిల్లీ నుంచి వస్తుందా లేక హైదరాబాద్ నుంచా? వేచి చూడాలి.




## ముస్లిం సోదరులందరూ ప్రశాంతంగా ఉండాలి : సిపి సజ్జనర్ ఆకాంక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముస్లిం సోదరులందరూ సుఖసంతోషాలతో, ప్రశాంతంగా ఉండాలని హైదరాబాద్ సిపి విసి.సజ్జనర్ ఆకాంక్షించారు. ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద ముస్లింలు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనర్ అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ప్రార్థనల అనంతరం ఆయన చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసమంతా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల షాపింగ్ అవసరాలకు, ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని, అందరి సహకారంతో వేడుకలు విజయవంతంగా సాగాయని వివరించారు. పండుగ ఏర్పాట్లలో సహకరించిన మత పెద్దలకు, ఇతర ప్రభుత్వ విభాగాలకు సిపి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి ట్రాఫిక్ డి.జోయల్ డెవిస్, జాయింట్ సిపి ఎన్.శ్వేత, డిసిపిలు ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాస్, అవినాశ్ కుమార్‌తో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ద్రవ్యోల్బణం తరముకొస్తున్నా మోదీ సర్కార్ డొల్ల మాటలు

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో రూపాయి విలువ పడిపోవడం, పారిశ్రామిక ఇంధన ధరలు పెరగడంపై లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో భారత్‌లో ద్రవ్యోల్బణం ఖాయమని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం స్పష్టమైన ఆర్థిక వ్యూహానికి బదులుగా డొల్ల మాటలు చెబుతోందని విమర్శించారు. శుక్రవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 93 మార్కు కంటే దిగువకు పడిపోయిన నేపథ్యంలో రాహుల్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడి 100 వైపు పయనించడం, పారిశ్రామిక ఇంధన ధరలు విపరీతంగా పెరగడం ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు. రాబోయే ద్రవ్యోల్బణానికి స్పష్టమైన సంకేతాలు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత స్టాక్ మార్కెట్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంటారు. మోదీ ప్రభుత్వం దీనిని సాధారణం (నార్మల్) అని పిలవొచ్చు. కానీ వాస్తవం ఏంటంటే ఉత్పత్తి, రవాణా మరింత ఖరీదైనవిగా మారుతాయి. ఎంఎస్ఎంఈలు అత్యంత తీవ్రంగా దెబ్బతింటాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. ఎఫ్ఐఐల డబ్బు మరింత వేగంగా బయటకు తరలిపోతుంది. ఇది స్టాక్ మార్కెట్‌పై మరింత ఒత్తిడిని పెంచుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఇది ప్రతి కుటుంబంలోని ఉన్న వ్యక్తి జేబుపై ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావం చూపడం ఖాయం. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు కూడా పెరుగుతాయి' అని అన్నారు.

## జీవన్ రెడ్డికి బుజ్జగింపులు



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నుంచి జగిత్యాలకు విచ్చేశారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌తో కలిసి ఆయన నివాసానికి చేరుకుని జీవన్‌రెడ్డితో రెండు గంటలకు పైగా చర్చలు జరిపారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగాలని జీవన్ రెడ్డిని మంత్రులు కోరారు. అనంతరం జీవన్ రెడ్డి నివాసంలోనే మంత్రి శ్రీధర్ బాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కోసమే 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. జీవన్ రెడ్డి పార్టీ మారే అంశంపై చర్చించేందుకు ఇక్కడికి వచ్చామని, చర్చల విషయాలను అధిష్టానం దృష్టికి, సీఎం రేవంత్ రెడ్డికి తీసుకువెళ్తామన్నారు. ఏ నిర్ణయం తీసుకోవ్దని కాంగ్రెస పార్టీలోనే కొనసాగాలని జీవన్ రెడ్డిని కోరామన్నారు. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో జీవన్‌రెడ్డి ప్రజల గొంతుకగా ఉన్నారన్నారు. ఆయన బాధపడితే తాము బాధపడుతామన్నారు. తెలంగాణలో జీవన్ రెడ్డి అంటే తెలియని వారు ఉండరని , సీనియర్ నాయకులు కూడా జీవన్ రెడ్డితో మాట్లాడి పార్టీలో ఉండాలని కోరినట్లు వివరించారు. నాలుగు దశాబ్దాల పాటు పద్దతి గల నాయకుడిగా కాంగ్రెస్ పార్టీ సంక్షేమం కోసం పనిచేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని, పదవుల కోసం ఏనాడు ఆరాటపడలేదని వివరించారు. ఈ సమావేశంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు మేడిపెల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం జీవన్ రెడ్డి కార్యకర్తలతో మంత్రులతో జరిపిన మంతనాలను వివరించి మాట్లాడారు. ఎవరొచ్చి మాట్లాడినా తగ్గేది లేదని దేవుడు ఎలా శాసిస్తే మానవుడు అలా అనుసరిస్తాడన్నారు.

**తెలంగాణ బడ్జెట్ సంక్షేమానికి పెద్దపీట**

అనంతరం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమానికి పెద్ద పీత వేసేలా రూపొందించామన్నారు. రాష్ట్ర జనాభాలో ఉన్న కోటి 15 లక్షల మందికి ప్రమాధ భీమా అనే నూతన సంక్షమ పథకాన్ని అమలులోకి తీసుకరావడం గొప్ప విషయమన్నారు. ఉద్యోగస్థులకు సంబంధించిన విషయంలో ప్రత్యేక దృష్టి పెడుతూ ఆరోగ్య కార్డులు అందించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ప్రభుత్వ విధ్యను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## పరిరక్షించాలి (మొదటి పేజీ తరువాయి)

తెలియజేశారు. ఈ పండుగ దినాలు పశ్చిమాసియాకు స్థిరత్వం, శాంతి, శ్రేయస్సును తీసుకువస్తుందన్న ఆశాభావాన్ని భారత ప్రధాని వ్యక్తంచేశారు. నరేంద్రమోదీ ఇరాన్ అధ్యక్షుడితో జరిపిన టెలిఫోన్ సంభాషణలో ఈ ప్రాంతంలోని కీలక సదుపాయాలపై జరుగుతోన్న దాడులను ఖండించారు. యుద్ధ ఉద్రిక్త పరిస్థితులపై ఆరాతీశారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తున్నాయని, ప్రపంచ సప్లయ్ గొలుసుకు అంతరాయం కలిగిస్తున్నాయని మోదీఅన్నారు.అలాగే నౌకాయన మార్గాలుతెరిచి, సురక్షితంగాఉండేలా చూసుకుంటూ నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఇరాన్‌లో భారత పౌరుల భద్రతకు ఇరాన్ అందిస్తున్న నిరంతర మద్దతును ప్రధానమంత్రి ప్రశంసించారు. ఫిబ్రవరి 28న ప్రస్తుత సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి ప్రధానమంత్రి మోదీ, ఇరాన్ అధ్యక్షుడి మధ్య జరిగిన రెండవ టెలిఫోన్ సంభాషణ ఇది మార్చి 12న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ఇరాన్‌లోని ప్రస్తుత పరిస్థితిపై మోదీకి వివరించారు. ఈ ప్రాంతంలోని పరిణామాలపై ఆయన తన ఇటీవలి కాలపు ఆలోచన దృక్పథాన్ని పంచుకున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న భద్రతా పరిస్థితిపై ప్రధానమంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని, అన్ని సమస్యలు,చర్చలు దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలన్న భారతదేశపు స్థిరమైన వైఖరిని పునరుద్ఘాటించారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఫిబ్రవరి 28న అమెరికా,ఇ జ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడి చేయగా దానికి బదులుగా ఇరాన్ తన పొరుగుదేశాలను, ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంది. కీలక నౌకా రవాణ మార్గమైన హోర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ నియంత్రిస్తోంది. ఈ హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచ ఇంధనంలో 20శాతం రవాణా జరుగుతోంది. సంఘర్షణలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ కొద్ది షిప్‌లను మాత్రమే ఇరాన్ అనుమతిస్తున్నది. ఈ వివాదం ప్రారంభమైన నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ సౌదీ అరేబియా, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా వంటి ప్రపంచస్థాయి నాయకులతో కూడా మాట్లాడారు.

## నేడు విడుదల (మొదటి పేజీ తరువాయి)

కోసం ఎంతో కాలంగా రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం మూడు విడుతల్లో రూ.9 వేల కోట్లను రైతు ఖాతాల్లో జమ చేసే విధంగా ప్రభుత్వం షెడ్యూల్ రూపొందించింది. రెండో విడత మరో 20 రోజుల తర్వాత ఏప్రిల్ రెండవ వారంలో రూ.2,650 కోట్ల నిధులను విడుదల చేయనుంది. ఏప్రిల్ నెలాఖరు లోపు మూడో విడతగా మిగిలిన రైతుల ఖాతాల్లో రైతు భరోసాను జమ చేయనుంది. ఇందుకు సంబంధించిన ఆర్థిక పరమైన అంశాలపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులతో చర్చించి కసరత్తును పూర్తి చేసినట్లు అధికారవర్గాలె తెలిపాయి.

## హోర్ముజ్‌ను తెరవండి!

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి'' అని యుఎఇ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి.

# 'సుప్రీం' ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

గోపాల్ శంకర్ నారాయణన్ ఎత్తిచూపారు. పోలీసుల మీడియా సమావేశాలపై ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించుకోవడానికి మూడు నెలల గడువు ఇచ్చినప్పటికీ పోలీసులతో మాట్లాడటానికి బదులుగా పోలీస్, సాంప్రదాయ, సామాజిక మాధ్యమాల కోసం ఒక సమగ్ర యంత్రాంగాన్ని కోరాలని జస్టిస్ ఎం.బాగ్జి శంకర్‌నారాయణ్‌కు సూచించారు. విస్తృత దృక్పథంతో చూస్తే పోలీసులు బ్రీఫింగ్‌ల ద్వారా నిందితులపై పక్షపాతం సృష్టించకూడదని కోర్టు భావిస్తున్నదని జడ్జి చెప్పారు. ఎస్ఓపి ద్వారా పోలీసులను నియంత్రించవచ్చు. కానీ, 'మీడియా ముఖ్యంగా సోషల్ మీడియా, ప్రజల సంగతేమిటి? మనం వారిని నియంత్రించగలమా? ఒకవేళ పోల్చిచూస్తే టీవీ ఛానెళ్లు చాలా వరకు నియంత్రణలోనే ఉన్నాయి. అయినప్పటికీ వారి అభిప్రాయాలతో విభేదించవచ్చు' అని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి వ్యాఖ్యానించారు. పిటిషన్ లేవనెత్తిన తక్షణ ప్రశ్నకు మించి ప్రస్తుత సమస్యకు విస్తృతమైన పరిశీలన అవసరం కావచ్చని ఆయన అన్నారు. న్యాయమూర్తి జోయ్‌మాల్యా బాగ్చి మాట్లాడుతూ 'పోలీసులు మీడియాకు ఇచ్చే బ్రీఫింగ్‌లు బాధ్యతాయుతంగా, సహేతుకంగా ఉండాలని, పక్షపాతానికి లోనుకాకూడదని మేం అర్థం చేసుకున్నాం. ఎందుకుంటే క్రిమినల్ న్యాయవ్యవస్థలో దర్యాప్తు సంస్థ బాధితులకుగానీ, నిందితులకు గానీ అనుకూలంగా ఉండకూడదన్నారు. మీడియా సమావేశాల సమయంలో పోలీసు అధికారులు ఉద్రేకానికి లోనవడం, పెండింగ్‌లలో ఉన్న క్రిమినల్ కేసులలో తలెత్తుతున్న ప్రమాదాలే ఆందోళన కలిగిస్తున్నాయి' అని జోయ్‌మాల్యా బాగ్చి అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ మీడియా సంస్థలు బ్లాక్‌మెయిలర్ల'లా వ్యవహరిస్తున్నాయని ధర్మాసనానికి తెలిపారు. కేవలం వర్చువల్ బ్లాక్‌మెయిలర్ల కోసమే పనిచేసే కొన్ని ప్లాట్‌ఫారమ్‌లు ఉన్నాయని, వాటిని బ్లాక్‌మెయిలింగ్ అనడం కూడా చాలా తక్కువ మాట అని సొలిసిటర్ జనరల్ అన్నారు. న్యాయమైన విచారణ అనే అంశానికి సమగ్రమైన విధానం అవసరం కాబట్టి పోలీసుల కోసం మార్గదర్శకాలు లేదా ప్రామాణిక కార్యాచరణ విధానాలు (ఎస్ఓపి) అమలులోకి ఏప్రిల్ తర్వాత వచ్చే అవకాశం ఉందని, ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకుని, విస్తృత పరిధితో తిరిగి పిటిషన్ దాఖలు చేయడం మంచిదని ధర్మాసనం సూచించింది.

## వైమానిక దాడి (మొదటి పేజీ తరువాయి)

అణు కార్యక్రమంలో కీలకమైన ఈ కేంద్రంపై దాడులు జరగడం వల్ల ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కాగా మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం మరింత విస్తరిస్తున్న నేపథ్యంలో, తన ప్రతీకార చర్యలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలకూ విస్తరించవచ్చని ఇరాన్ హెచ్చరించింది. ఈ ప్రకటనతో అంతర్జాతీయ స్థాయిలో భద్రతపై ఆందోళనలు పెరిగాయి. ముఖ్యంగా పార్కులు, వినోద కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు కూడా లక్ష్యాలుగా మారవచ్చని ఇరాన్ సైనిక ప్రతినిధులు పేర్కొనడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఇక మరోవైపు, అమెరికా మధ్యప్రాచ్యానికి అదనంగా నౌకాదళాన్ని పంపుతున్నది. సుమారు 2,500 మంది మెరైన్స్‌ను మోహరింపచేస్తున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే అక్కడ 50,000కు పైగా అమెరికా సైనికులు ఉన్న నేపథ్యంలో, ఈ నిర్ణయం యుద్ధం మరింత తీవ్రమవుతుందనే సంకేతం ఇస్తోంది. అయితే అదే సమయంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యల్లో యుద్ధ చర్యలను తగ్గించే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. ఈ రెండు విభిన్న సంకేతాలు అమెరికా వ్యూహంపై అనిశ్చితికి నిదర్శనం. కాగా, టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతుండగా, ఇరాన్ కూడా ప్రతిదాడులు చేస్తోంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల ఇంధన సదుపాయాలపై డ్రోన్ దాడులు చేసి చమురు సరఫరాను ప్రభావితం చేస్తోంది. కువైట్‌లోని ఒక పెద్ద ఆయిల్ రిఫైనరీపై దాడి జరగడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ దాడులు గ్లోబల్ ఆయిల్ మార్కెట్‌పై ప్రభావం చూపించి, ధరలను గణనీయంగా పెంచాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర యుద్ధం ప్రారంభానికి ముందు 70 డాలర్ల వద్ద ఉండగా, ఇప్పుడు 100 డాలర్లకు పైగా చేరింది. ఇక నాటో కూటమి కూడా భద్రతా కారణాల వల్ల ఇరాక్‌లోని తన సిబ్బందిని యూరప్‌కు తరలించింది. ఇది యుద్ధ ప్రభావం ప్రాంతీయంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయికి వ్యాపిస్తున్నదని సూచిస్తోంది. ఇటీవల జరుగుతున్న దాడులను ప్రభుత్వాన్ని కూల్చే కుట్రగా భావిస్తున్న ఇరాన్, తమ ప్రతిఘటన కొనసాగుతుందని ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు తమ సంకల్పాన్ని దెబ్బతీయలేవని ఇరాన్ నాయకత్వం తెలిపింది. మొత్తం మీద, ఈ సంఘర్షణ సైనిక పరంగా మాత్రమే కాకుండా ఆర్థిక, భద్రతా రంగాల్లో కూడా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది. చమురు సరఫరా అంతరాయం, పర్యాటక రంగంపై ముప్పు, అంతర్జాతీయ సైనిక కదలికలు వంటి అంశాలు ప్రపంచ సంక్షోభానికి ఇసూచికలుగా పరిశీలకులు పేర్కొంటున్నారు.

# డిండి ప్రాజెక్టు నిర్మాణంలో వివక్ష ఆపాలి

- ఏదుల రిజర్వాయర్ నుంచి సమాన ఎత్తుతో నీరు ఇవ్వాలి : సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్
- ప్రాజెక్టులో జరుగుతున్న అన్యాయంపై ఏప్రిల్ 1,2 తేదీలలో ఎస్‌ఎల్‌బిసి టన్నెల్, ఏదుల రిజర్వాయర్ సందర్శన, 5న నల్లగొండ జిల్లా కేంద్రంలో సదస్సు
- పంట పొలాలు ఎండిపోతున్న రైతులను ఆదుకోవాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి




**ప్రజాపక్షం/నల్లగొండ :** ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులకు ఎలాంటి వివక్ష లేకుండా ఒకే లెవెల్‌తో నీటిని సరఫరా చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లోని ఫ్లోరైడ్, కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి (వట్టెం) ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 436 మీటర్ల ఎత్తు నుంచే నీటిని తరలించే అవకాశం కల్పిస్తుండగా డిండి కాలువకు మాత్రం 440 మీటర్ల ఎత్తు నుంచి మాత్రమే నీటిని తీసుకునేలా నిబంధనలు విధించడం వలన నల్లగొండ జిల్లాపై జరుగుతున్న అన్యాయమని పేర్కొన్నారు. డిండి ప్రాజెక్టు విషయంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సి, కొంతమంది ఇంజనీర్లు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం 440 మీటర్ల నుంచి 436.70 మీటర్లకు తగ్గిన తర్వాత 1,500 క్యూసెక్కుల నీరు కూడా కేవలం 56 రోజులపాటు మాత్రమే డిండి కాలువకు అందే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. దీనివల్ల ప్రభుత్వం నిర్ణయించిన 30 టీఎంసీల నీటికి బదులుగా కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే నల్లగొండ జిల్లాకు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి కొనసాగితే మునుగోడు, దేవరకొండ ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశముందని పేర్కొన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 1,2 తేదీలలో ఎస్‌ఎల్‌బిసి టన్నెల్, ఏదుల రిజర్వాయర్ ప్రాజెక్టులను సిపిఐ బృందం సందర్శించి, ఏప్రిల్ 5న నల్లగొండ జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు,ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెండు పంటల రైతు భరోసాను ఒకేసారి విడుదల చేయాలని కోరారు. వ్యవసాయం చివరి దశలో ఉన్న రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానంలో పారదర్శకంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి బొల్లు రవీందర్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లొడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉజ్జిని యాదగిరి రావు, పబ్బు వీరస్వామి, ఆర్.అంజాచారి, బంటు వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, నలపరాజు రామలింగయ్య, టి.వెంకటేశ్వర్లు, తుమ్మ బుచ్చి రెడ్డి పాల్గొన్నారు.

# నేడు నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

- సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రూ.300 కోట్ల ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని, రూ.78 కోట్లతో నిర్మించిన జిల్లా జైలును ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి
- బహిరంగవేదిక నుండి రైతుభరోసా నిధులు విడుదల చేయనున్న సిఎం



**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెట్టలో రూ.300 కోట్లతో నిర్మించిన అయిల్‌పామ్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిచే ఆయిల్‌పామ్‌ను ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా అధికార యంత్రాంగం ఇప్పటికే అవసరమగు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికార యంత్రాంగం, అయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్ అధికారులు నర్మెట్టలో గత రెండు రోజులుగా పర్యటిస్తూ సిఎం రేవంత్‌రెడ్డి పర్యనకు అవసరమగు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 19న ఉగాది పర్వదినం రోజున నర్మెట్టలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు మేళా నిర్వహించి 150 స్టాళ్లను ఏర్పాటు, రైతులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. రైతుమేళాలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, శ్రీహరి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి స్పీకర్ సుఖేందర్‌రెడ్డిలు సందర్శించి, అయిల్‌పామ్ రైతులతో ముచ్చటించారు. 22న ఆదివారం సిఎం పర్యటను పురస్కరించుకొని నంగునూర్ మండలం నర్మెట్టలో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. నర్మెట్ట ఫ్యాక్టరీ ఆవరణలో జిల్లా అధికార యంత్రాంగం హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. హైదరాబాద్ నుండి సిఎం సాయంత్రం 4.30 గంటలకు నర్మెట్టకు చేరుకుంటారు. నర్మెట్టలో 62 ఎకరాల్లో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించి పైలాన్‌ను ఆవిష్కరిస్తారన్నారు. అలాగే ఎన్సాన్‌పల్లిలో శివారులో 30 ఎకరాల్లో రూ.78 కోట్లతో నిర్మించిన ఆధునాతన జిల్లా జైలు, సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ, ఆయుష్ ఆసుపత్రి, అర్బన్ ఆసుపత్రిని నర్మెట్ట నుండి సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అలాగే నర్మెట్ట ఆయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో రూ.80 కోట్లతో నిర్మించతలపెట్టిన తెలంగాణలోనే మొట్టమొదటి ఆయిల్ రిఫైనరీ నిర్మాణానికి సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఆయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో గత మూడు రోజులు రైతు మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 150 స్టాళ్లను ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం రేవంత్‌రెడ్డి సందర్శించనున్నారు. అనంతరం నర్మెట్టలో ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఇదే వేదిక నుండి రైతుభరోసా నిధులను సైతం సిఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారు. సిఎం పర్యటన సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. సిద్దిపేట సిపి రశ్మీ పేరుమాల్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. వాహనాల పార్కింగ్. విద్యుత్, ఫైర్ స్టేషన్, అంబులెన్స్, ఇతర ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ హైమావతిలు పర్యవేక్షిస్తున్నారు.

**బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్**

సిద్దిపేట జిల్లా నర్మెట్ట అయిల్ ఫామ్ ప్యాక్టరీ ప్రారంభోత్సవం... బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌లు పర్యవేక్షించారు. సిఎం సందర్శించే రైతు మహోత్సవం స్టాళ్లనుసైతం పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. సిఎం పర్యటనను విజయవంతం చేయాలని మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌లు పిలుపునిచ్చారు.



# సర్పంచ్‌ల ఫీడ్‌బ్యాక్‌కు ప్రాముఖ్యత

- మంత్రి అనసూయ సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యతని, ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో సర్పంచ్‌లు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌కు అత్యంత ప్రాముఖ్యత నిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయం సేకరించిన సర్పంచుల అభిప్రాయాలపై శనివారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

**12,457 మంది సర్పంచులతో ముఖాముఖి..**

గత పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,728 గ్రామ పంచాయతీలలో మిషన్ భగీరథ అధికారులు ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపారు. ఇందులో 12,457 మంది సర్పంచులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రధానంగా 16 కీలక అంశాలపై ఈ సేకరణ జరిగింది. నీటి నాణ్యత, సరఫరా క్రమబద్ధత, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, పైపులైన్ లీకేజీల మరమ్మతులు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్‌ల లభ్యత, టోల్ ఫ్రీ నెంబర్ 1916పై అవగాహన, 99 రోజుల ప్రగతి ప్రణాళికలో పరిష్కారం, అభిప్రాయ సేకరణలో అధిక శాతం సర్పంచులు నీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అయితే సర్పంచులు గుర్తించిన చిన్నపాటి లోపాలను, సమస్యలను '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 2026 వచ్చెనెల 1 నుండి 15 లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



**మంత్రి సీతక్క కీలక ఆదేశాలు..**

'గ్రామస్థాయిలో సర్పంచుల అభిప్రాయమే ప్రభుత్వానికి అసలైన మార్గదర్శకం. వారి సూచనల ఆధారంగా సేవలను మరింత మెరుగుపరుస్తాం' అని మంత్రి సీతక్క అన్నారు. మిషన్ భగీరథ సౌకర్యం లేని మారుమూల గ్రామాల్లో ఓపెన్ వెల్స్ తవ్వించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద వర్షాకాలం లోపే చెక్ డ్యాంలు నిర్మించాలని సూచించారు. ఆదివాసీ గూడాలు, లంబాడీ తాండాలు, అటవీ ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలన్నారు. ప్రజలు తాగు నీటి సమస్యల కోసం ఎప్పుడైనా 1916 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి సూచించారు.

# ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెడతాం

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం శాసనసభలో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొచ్చేందుకే ఈ బిల్లును ప్రవేశపెట్టబోతున్నామని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపైన కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ ప్రవేట్ మెంబర్ బిల్లును సభలో అనుమతించాలన్నారు. 'ఆరు గ్యారంటీల అమలుకు' శాసనసభలో ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టే అంశంపైన బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, న్యాయ నిపుణుల బృందం, బిఆర్‌ఎస్ లీగల్ సెల్‌తో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ శనివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ మాజీ ఎంపి, న్యాయవాది బోయినపల్లి వినోద్ కుమార్, ఎంఎల్‌సి ప్రొఫెసర్ శ్రవణ్, బిఆర్‌ఎస్ నాయకులు సోమ భరత్, రావులచంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రావు, మాజీ అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్ హాజరయ్యారు. సమావేశం అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొలి రోజే ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీల అమలు ఫైలు పైన సంతకం చేశారని, ఆ వారం రోజుల తర్వాత జరిగిన ఉభయ సమావేశాల్లో అప్పటి గవర్నర్ ప్రసంగంలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారని కెటిఆర్ గుర్తు చేశారు. 800 రోజులైనప్పటికీ ఆరు గ్యారంటీల అమలకు అతిగతీ లేదన్నారు. ప్రజల నుంచి ఒక్క ఓటు రాబట్టడానికి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను, 11 డిక్లరేషన్లను, 420 హామీలను ఇచ్చి, వల వేసి ఓట్లు పట్టిందని అన్నారు. ఓట్లు కొల్లగొట్టి, గెలిచి, టోకున మొత్తం నాలుగు కోట్ల మందికి టోపీ పెట్టారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1986లో హయాంలో బిజెపి ఫ్లోర్ లీడర్ విద్యాసాగర్ రావు శాసనసభలో ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రవేశపెడితే అప్పటి సిఎం నందమూరి తారకరామారావు ఆహ్వానించి, చట్టాన్ని చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ప్రజల పట్ల ప్రేమ ఉంటే ప్రైవేటు బిల్లును ఆహ్వానించాలని సూచించారు. మహిళలకు రూ.2,500లు, పెన్షన్ రూ.4వేల హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత అన్ని పార్టీల నాయకులను కలిసి మద్దతు కోరనున్నట్టు కెటిఆర్ తెలిపారు.

# అర్చకుల సంక్షేమానికి పెద్దపీట



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో దేవాదాయ శాఖకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తూ రూ.1,200.99 కోట్లను కేటాయించింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆలయాల అభివృద్ధి, పండుగల నిర్వహణ, అర్చకుల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడం గమనార్హం. బడ్జెట్ వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బోనాలు పండుగకు రూ.20 కోట్లు కేటాయించగా, చిన్న దేవాలయాల అభివృద్ధి, మరమ్మత్తుల కోసం కామన్ గుడ్ ఫండ్‌కు సుమారు రూ.4.68 కోట్లు మంజూరు చేశారు. అర్చకులు, దేవాలయ సిబ్బంది జీతభత్యాలు, సంక్షేమం కోసం రూ.476.34 కోట్ల భారీ కేటాయింపు చేశారు. అదనంగా ధార్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, ఉత్సవాల నిర్వహణకు సుమారు రూ.50 లక్షలు కేటాయించారు. అలాగే గోదావరి పుష్కరాలు వంటి ప్రధాన ధార్మిక కార్యక్రమాలకు అవసరానుసారం ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులు ఆలయాల నిర్వహణ, అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, చిన్న దేవాలయాలకు ఆర్థిక సహాయం, ధార్మిక కార్యకలాపాల ప్రోత్సాహానికి వినియోగించబడనున్నాయి. దేవాదాయ శాఖకు ఈ స్థాయిలో కేటాయింపులు చేయడం ద్వారా రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణ, అర్చకుల సంక్షేమాన్ని బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం స్పష్టమవుతోంది.

# అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అకాల వర్షాలు, వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో పలు జిల్లాలలో అకాల వర్షాలకు వడగండ్ల వానకు మొక్కజొన్న, వరి, పత్తి ,మిరప కూరగాయలు ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. కొత్తగూడెం, వికారాబాద్ ,మంచిర్యాల, కొమురంభీం అసిఫాబాద్, వనపర్తి ఇతర జిల్లాలలో పంటలు నష్టం వాట్లిల్లడంతో పాటు వనపర్తి జిల్లాలో పిడుగు పాటుతో ఓ వ్యక్తి, వికారాబాద్ జిల్లాలో 217 మేకలు చనిపోయాయ్యానన్నారు. అకాల వర్షాల కారణంగా చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఏర్పడిందని, యుద్ధ ప్రాతిపదికన పంటల నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం

- మాజీ డిజిపి మనవరాలికి రూ.1.20 కోట్ల టోకరా

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో సైబర్ నేరగాళ్లు మరోసారి పంజా విసిరారు. మాజీ డిజిపి కుటుంబానికి చెందిన యువతిని లక్ష్యంగా చేసుకుని మోసగాళ్లు దాదాపు రూ.1.20 కోట్ల మేరకు దోచుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన నగరంలో కలకలం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు తమను నమ్మదగిన వ్యక్తులుగా పరిచయం చేసుకుంటూ ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా బాధితురాలిని సంప్రదించారు. ప్రారంభంలో చిన్న మొత్తాలతో పెట్టుబడులు పెట్టిస్తామని నమ్మబలికిన వారు, అధిక లాభాలు వస్తాయని చెప్పి ఆమెను మోసం చేసినట్లు తెలుస్తోంది. తదుపరి దశలో నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని చూపించి, దశలవారీగా పెద్ద మొత్తాలను వివిధ బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. చివరికి డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు బాధితురాలు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. ఇటీవల హైదరాబాద్‌లో ఇలాంటి సైబర్ మోసాలు పెరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. పెట్టుబడుల పేరుతో, 'డిజిటల్ అరెస్ట్' బెదిరింపులతో, లేదా నకిలీ అధికారుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డబ్బు వెళ్లిన ఖాతాల వివరాలు సేకరిస్తూ, అంతర్రాష్ట్ర ముఠా పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. తెలియని వ్యక్తుల మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో డబ్బులు పెట్టకూడదని, ఎలాంటి అనుమానాస్పద కాల్స్ వచ్చినా 1930 హెల్ప్‌లైన్, సైబర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

# విద్య, వైద్య రంగాలను విస్మరించిన ప్రభుత్వం

- రాష్ట్రాల హక్కులను కేంద్రం లాక్కోవడం దారుణం
- సిపిఐ(ఎం) రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను విస్మరించిందని, అధిక నిధులను కేటాయించి, ఆ రెండు రంగాలను ప్రభుత్వ వ్యవస్థలో బలోపేతం చేయాలని పలువురు మేధావులు, డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ, సంక్షేమం లాంటి ప్రాధాన్యతా రంగాలకు నిధుల కేటాయింపును పెంచాలని, లేనట్లయితే వాటిని సాధించుకోవడానికి ఉద్యమాలు తప్పవని వారు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిజెఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఆర్థిక విశ్లేషకులు డి.పాపారావు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డి.జి.నర్సింహారావు (సిపిఐ(ఎం), సారంపల్లి మల్లారెడ్డి, టి.సాగర్ (రైతు సంఘం), భూపాల్ (సిఐటియు), వెంకట్రాములు (వ్యవసాయ కార్మిక సంఘం), శ్రీరాంనాయక్ (గిరిజన సంఘం), రమణ, ఆశయ్య (వృత్తిదారుల సంఘం సమన్వయ కమిటీ), అబ్బాస్ (ఆవాజ్), అరుణజ్యోతి (ఐద్వా), ఎ.వెంకటేశ్ (డివైఎఫ్ఐ), కిరణ్ (ఎస్‌ఎఫ్‌ఐ) తదితరులు మాట్లాడారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఓ వైపు రాష్ట్రాల ఆదాయ వనరులు, కేంద్రం నుంచి వచ్చే వాటాలు తగ్గుతున్నాయని, మరోవైపు ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్రానికి పంపే వాటాలో రాష్ట్రాలకు 42 శాతమే తిరిగి వస్తున్నదని, ఆ కేటాయింపుల్లోనూ బిజెపి పాలిత రాష్ట్రాలకు ఒక విధంగా, ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలకు మరో విధంగా ఉంటున్నదని ఎత్తిచూపారు.

**విద్య, వైద్యం, రవాణ సేవలను ఉచితంగా అందించాలి**

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ స్వీడన్‌లో ధనికులపై 60 శాతం పన్నులు వేస్తారని, ఆ దేశంలో విద్య, వైద్యం, రవాణా రంగాల సేవలను ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తున్నదని వివరించారు. ఆ మూడు రకాల సేవలను భారతదేశంలో కూడా ప్రజలకు ఉచితంగా ఇస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని చెప్పారు. భారతదేశంలోని సంపన్నులపై అదనంగా రెండు శాతం పన్ను వేస్తే పేదలకు సంక్షేమం సాధ్యమని ప్రభాత్ పట్నాయక్ చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు.

**బిఆర్‌ఎస్ సర్కార్‌ను మించి కాంగ్రెస్ సర్కార్ అప్పులు**

పాపారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్‌ఎస్ సర్కార్‌ను మించి అప్పులు చేస్తున్నదన్నారు. కెసిఆర్ పదేళ్లలో రూ.6 లక్షల కోట్లకు పైగా అప్పు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లోనే రూ.3.49 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈసారి బడ్జెట్‌లో మరో రూ.82 వేల కోట్ల అప్పు చేయనున్నట్లు పొందుపర్చారని వివరించారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా రుణాలు, వడ్డీలు, జీతభత్యాలకే పోతే సంక్షేమం, అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ, వైద్య రంగాలకు అరకొర నిధులు కేటాయించడం తగదన్నారు.

# నేడు ''సోషల్ మీడియా- ఇంపాక్ట్- పాజిటివ్ అండ్ నెగెటివ్'' అంశంపై జాతీయ సదస్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''సోషల్ మీడియా ఇంపాక్ట్ పాజిటివ్ అండ్ నెగెటివ్'' అనే అంశంపై జాతీయ సదస్సును తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియూడబ్ల్యూజె), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఇండియా (మెఫి) ఆదివారం హైదరాబాద్‌లో ఒక జాతీయ సదస్సును నిర్వహించనున్నాయి. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో గల సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు సదస్సు జరగనుంది. న్యూఢిల్లీకి చెందిన ప్రముఖ వెబ్‌సైట్ 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకులు ఎంకె.వేణు కీలకోపన్యాసం చేస్తారు. సీనియర్ జర్నలిస్ట్ ములుగు సోమశేఖర్ అధ్యక్షత వహిస్తారు. ఈనెల 27–29 తేదీలలో విజయవాడలో జరుగనున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) 11వ ప్లీనరీ సందర్భంగా ఈ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు టియూడబ్ల్యూజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, మెఫి మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియా తీరు, దాని ప్రభావంపై భిన్నమైన భావాలు వ్యక్తం అవుతున్న ప్రస్తుత సమయంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.


# 29న ట్రైనీ సూపర్‌వైజర్ల రాత పరీక్షలు

- టిఎస్‌ఎల్‌పిఆర్‌బి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో 198 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ ల పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 29న రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబరు 25న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఈ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను ఈ నెల 23వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 28వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు బోర్డు అధికారిక వెబ్‌సైట్ www.tgprb.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఒకవేళ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తితే support@ tslprb.in కు ఈమెయిల్ చేయాలని లేదా పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య 9391005006 నంబర్‌ను సంప్రదించాలని వివరించారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు

- ముస్లిం సోదరులతో కిక్కిరిసిన ఈద్‌గాలు, మసీదులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పవిత్ర రంజాన్ నెల ముగిసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈద్‌ఉల్‌ఫితర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మసీదులు, ఈద్గాలు ముస్లింల ప్రార్థనలతో కళకళలాడాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లోని కవాడిగూడ, అంబర్‌పేట్, ఎన్‌టిఆర్ స్టేడియం, కుతుబ్ షాహీ టుంబ్స్, మక్కా మసీదు, బహదూర్‌పుర, సైదాబాద్ ఈద్గాలకు ముస్లిం సోదరులు తమ కుటుంబాలతో పెద్ద ఎత్తున తరలి వచ్చి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమృద్ధి నెలకొనాలని ప్రార్థించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా రంజాన్ పండుగను అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు మసీదుల వద్ద ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించగా, పేదలకు జకాత్, ఫిత్రా రూపంలో దానం చేయడం విశేషంగా కనిపించింది. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాల్లో సంప్రదాయ వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా శీర్ ఖుర్మా, బిర్యానీ వంటి వంటకాలను తయారుచేసి బంధుమిత్రులతో పంచుకున్నారు. పండుగ ఆనందాన్ని అందరితో పంచుకోవాలనే ఉద్దేశంతో వివిధ వర్గాల ప్రజలను తమ ఇళ్లకు ఆహ్వానించడం గమనార్హం. రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రార్థనల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు కీలక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ముస్లిం సోదరులకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావం, ఐక్యతకు రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మొత్తంగా తెలంగాణ వ్యాప్తంగా రంజాన్ పండుగ ఆనందం, ఆధ్యాత్మికత, సామాజిక సమానత్వం సందేశాలతో ఘనంగా జరుపుకోవడం ప్రత్యేకంగా నిలిచింది.






## భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

'స్టాప్ డ్రగ్స్ - స్టార్ట్ స్పోర్ట్స్' పేరిట ఎఐవైఎఫ్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, అమర వీరుడు భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ఘనంగా ప్రారంభించారు. క్రీడలతోనే శారీరక దృఢత్వం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగత్ సింగ్ యువతకు ధైర్యం, త్యాగం మరియు దేశభక్తికి ప్రతీక అని కొనియాడారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యతను పెంచుతాయని అన్నారు. నిరుద్యోగం, అవినీతి, మాదకద్రవ్యాల వంటి సామాజిక రుగ్మతలపై పోరాడే శక్తిగా యువత ఎదగాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కల్లూరు ధర్మేంద్ర, ఇతర సీపీఐ నేతలు.ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి వచ్చిన 16 వాలీబాల్ జట్లు.ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ నేతృత్వంలో ఈ పోటీలు మార్చి 23 వరకు కొనసాగుతాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, కళ్లేపల్లి మహేందర్, కౌన్సిలర్లు బబ్బూరి శ్రీధర్, పెళ్లిమల్లి లావణ్య శ్రీధర్ ,ఏఐవైఎఫ్ నాయకులు కంబాల వెంకటేష్, ఎర్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ హుండీల్లో డబ్బు దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడు అరెస్ట్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణంలోని ఈనెల 19న రాత్రి సమయంలో పలు ప్రాంతాల్లో దేవాలయ హుండీలు పగలగొట్టి,ఆటో, స్కూటీ,సెల్ ఫోన్లు దొంగతనాలు చేసిన నేరస్థున్ని టుటౌన్ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని రామగిరికి చెందిన మాతంగి సాయి నాథ్ అయ్యప్ప గుడిలో హుండీ ధొంగతనము తన స్కూటీ రెండు సెల్ ఫోన్లు ధొంగిలించినారని నల్లగొండ టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయబడింది.అదే రోజు రాత్రి వైకుంట నగర్‌లో ఒక ఆటో ఆర్‌టిసి కాలనీలో ఉన్న శ్రీ కృష్ణ టెంపుల్‌లో హుండీ దొంగతనము చేయగా, మరో రెండు కేసులు నమోదు చేశారని తెలిపారు.అలాగే పట్టణంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్,ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో సాంకేతిక ఆధారాల సమాచారంతో నల్లగొండ పట్టణంలో గత కొంత కాలంగా నివాసం ఉంటున్న మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కు చెందిన పోలిశెట్టి కార్తీక్ కుమార స్వామి అనే నిందితుడిని నల్లగొండ పట్టణ పరిధిలోని సావర్కర్ నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు నిందితుని వద్ద నుండి ఒక స్కూటీ,ఒక ఆటో రిక్షా,(2) సెల్ ఫోన్లు, మరియు రూ.3వేలు నగదు దొంగతనానికి ఉపయోగించిన రెండు ఐరన్ రాడ్స్ కట్టింగ్ ప్లేయర్ కూడ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.ఈ కేసు ఛేదించిన టుటౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. రాఘవరావు ఆధ్వర్యంలో, ఎస్ఐ వై.సైదులు,అహ్మద్ షరీఫ్,సిబ్బంది సా గర్ల శంకర్,బాలకోటి,ఫరూక్,సతీష్,ప్రదీప్ వెంకటేశ్వర్లుని అభినందించారు.

## నాణ్యమైన సేవలు అందించాలి

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** వినియోగదారులకు నాణ్యమైన సేవలందరించాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సంజీవని కాలేజి ఎదురుగా పెద్దబావి శోభ ఆనంద్‌రెడ్డిలు నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ పంపును ఆయన సర్పంచ్ పందుల వెంకటయ్య గౌడ్, ప్రజా ప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డిజిల్‌లను అందించాలని సూచించారు. కొండమల్లేపల్లి మండల వ్యాపార పరంగా ఎంతో అభివృద్ధి చెందడం శుభసూచకం అని అన్నారు. అనంతరం పెట్రోల్ పంపు యాజమాన్యం ఆనంద్‌రెడ్డి ఎంఎల్‌ఏ, ప్రజా ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించి, మెమోంటోలు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పందుల వెంకటయ్యగౌడ్, ఆలంపల్లి నర్సింహా, మాజీ పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మండల అభివృద్ధి ప్రధాత దూదిపాల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

# నల్లగొండను సస్యశ్యామలం చేస్తా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో ప్రతీ ఎకరాకూ సాగునీరు



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.శనివారం నల్లగొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో మంత్రి ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రాజెక్టు కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామంలోని రైతులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొండపాక గూడెం నుంచి అప్పాజీపేట వరకు నిర్మించనున్న నూతన పిల్ల కాలువ పనులకు అప్పాజీపేటలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా సమర్థవంతమైన కాలువల నిర్మాణంతో నియోజకవర్గంలోని చెరువులన్నింటిని నింపి ప్రతి ఎకరానికి సాగునీరు అందించనున్నట్లు తెలిపారు.దీంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగు విస్తీర్ణం మరింతగా పెరుగుతుందని అన్నారు.నల్లగొండ నియోజకవర్గం తనకు గుండెకాయలాంటిదని,అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ ప్రాజెక్టు ప్రజలకు వరం లాంటిదని, కాలువ నీటితో రైతులందరిలో ఆనందం వెల్లివిరుస్తుందని తెలిపారు.రైతు సంక్షేమం కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు.అప్పాజీపేట గ్రామంలో చేపట్టిన పిల్లకాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్,ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గంగుల అండాలు సైదులు,ఇరిగేషన్ ఈఈ సతీష్ చంద్ర,డిఈ పిచ్చయ్య,ఏఈ నవీన్ కుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ బూరి శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జడ్‌పిటిసిలు పాశం రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్,డీసీసీబీ మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, అప్పాజీపేట మాజీ సర్పంచ్ గంగుల సైదులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టిన కాలువలు కాంగ్రెస్ హయాంలోనే పూర్తి


ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జలయజ్ఞంలో భాగంగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టినటువంటి కాలువలు మళ్ళీ కాంగ్రెస్ హయంలోనే పూర్తయ్యాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి వద్ద వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారి కింది నుంచి వెళ్లే బస్వాపురం ప్రాజెక్ట్ కాలువను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి మాత్రమే మన ప్రాంతానికి నీరు వస్తుందని, కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి కాదని స్పష్టం చేశారు. బస్వాపురం ప్రాజెక్టు నుంచి కాలువల నిర్మాణం ద్వారా వైయస్ రాజశేఖర్ రెడ్డి హయంలోనే ప్రారంభమయ్యాయని, ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్యే విమర్శించారు. భువనగిరి వద్ద వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారి కిందనుంచి వెళ్ళే ఈ కాల్వను గత ప్రభుత్వం పట్టించుకోకు పోవడం వల్ల కాలువల ద్వారా చెరువులకు నీరు అందలేదని అన్నారు. ప్రస్తుతం ఈ కాలువ పూర్తి కావటం తో భువనగిరి, వలిగొండ మండలాలలో చెరువులు నింపి పంట పొలాలకు నీరు అందించే కార్యక్రమం మొదలైందని అన్నారు. ఏడున్నర కోట్ల ఖర్చుతో కల్వర్టు నిర్మానం పూర్తిచేసి నీరు అందిస్తున్నట్టు తెలిపారు. బసవపురం ప్రాజెక్టులో ఇంకా పూర్తిస్థాయి లో నీళ్లు నింపలేదనీ ముంపు గ్రామం బి ఎన్ తిమ్మాపురంలో ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇంకా కొంత మంది కి పరిహారం అందలే దని, మరో 50 కోట్లు నిధులు విడుదల చేస్తే బిఎన్ తిమ్మాపూర్ గ్రామం ఖాళీ అయ్యి నీళ్లు నింపడానికి అనువుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బస్వాపురం ప్రాజెక్టు 0.7 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యం ఉందన్నారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి వద్ద కూడా రోడ్డును కటింగ్ చేసి కాల్వ ద్వారా నీరు వెళ్లేలా చేసే కార్యక్రమం చేయబోతున్నట్లు తెలిపారు. మరో పైపు హైలెవల్ కాలువ నిర్మాణం ద్వారా వడపర్తి కత్వా కు నీరు వచ్చేలా భూసేకరణ మొదలైందని, మరో 6 నుంచి 7 కోట్ల విలువ చేసే భూ సేకరణ పూర్తి అయితే హైలెవల్ కాలువ పూర్తి అయి వడపర్తి నుంచి బీబీ నగర్ చెరువుకు నీరు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## యాదాద్రి కోటపై 'బీర్ల' మార్క్ వ్యూహం!

నేడు జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజకీయ యవనికపై కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా, డిసిసి అధ్యక్షులు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సరికొత్త వ్యూహానికి తెరలేపారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, పార్టీని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేసేందుకు ఆయన సిద్ధం చేసిన 'సరికొత్త సైన్యం' నేడు కొలువుదీరనుంది. జిల్లా కేంద్రం సమీపంలోని రాయగిరి వివేరా హోటల్ వేదికగా నిర్వహించనున్న డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర కాంగ్రెస్ సారథి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతుండటంతో జిల్లా రాజకీయాల్లో వేడి పెరిగింది.

**సమన్వయమే ఆయుధంగా..** జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు , ఎంపీ మధ్య అద్భుతమైన సమన్వయకర్తగా ఐలయ్య తనదైన ముద్ర వేశారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామ్యేల్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలతో కలిసి గ్రూపు తగాదాలకు తావులేకుండా ఒకే తాటిపైకి తీసుకురావడంలో ఆయన సఫలీకృతమయ్యారు. అందరి అభిప్రాయాలను గౌరవిస్తూనే, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ఈ నూతన కార్యవర్గంలో పెద్దపీట వేశారు. ఆరుగురు ఉపాధ్యక్షులు 11 మంది ప్రధాన కార్యదర్శులు, ఒకరు కోశాధికారి, ఒకరు అధికార ప్రతినిధి, 17 మంది కార్యవర్గ సభ్యులతో ఏర్పడిన జిల్లా కమిటీకి పిసిసి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నేడు వారు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

**గులాబీ దళాన్ని 'మట్టి' కరిపించిన మంత్రాంగం..**
బీర్ల ఐలయ్య డీసీసీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాలో కాంగ్రెస్ గ్రాఫ్ అమాంతం పెరిగింది. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆయన పక్కా ప్లానింగ్‌తో బిఆర్ఎస్ (టిఆర్ఎస్)కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. జిల్లాలోని 6 మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేసి, గులాబీ కోటలను బద్దలు కొట్టారు. అదే విధంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రత్యర్థులను మట్టికరిపించి, పల్లెల్లో హస్తం పార్టీకి తిరుగులేని పట్టు సాధించి పెట్టారు.

## నజీర్ నివాసంలో రంజాన్ వేడుకలు

: హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) వేడుకలు భువనగిరి పట్టణంలో ఘనంగా జరిగాయి. శనివారం పట్టణంలోని రేవంత్ టీం సభ్యుడు, ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.డి నజీర్ నివాసంలో ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నజీర్ నివాసానికి చేరుకున్న బీర్ల ఐలయ్యకు కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐలయ్య నజీర్ కుటుంబ సభ్యులందరినీ ఆప్యాయంగా పలకరించి, వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నజీర్‌ను ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పారు. వారి ఆతిథ్యాన్ని స్వీకరించి, ఏర్పాటు చేసిన ప్రత్యేక విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కౌన్సిలర్లు జగన్, బెండలాల్ రాజ్, చల్లగురుగుల రఘుబాబు, డిసిసి ప్రధాన కార్యదర్శి కానుగు బాలరాజ, మాజీ ఎంపీపీ చీర్ల శ్రీశైలం, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ హాజరయ్యారు.బ

## జ్యోతిరావుపూలే విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణను శనివారం ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ మహాత్మ జీవితం విద్య, సమాజ సేవ, విద్యావంతులపై మానవత్వం పెంపొందించేందుకు కృషిని ప్రత్యేకంగా గుర్తించారు. జ్యోతిరావు పూలే జీవితం ద్వారా సమానత్వ కోసం పోరాటం మనందరికి ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, సర్పంచ్ చిలుకల మంజుల, వెంకన్న, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తానని భారీ మోసం

60 మంది వద్ద రూ.1కోటి 85 లక్షలు వసూళ్లు

బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** స్టాఫ్‌నర్స్ ఉద్యోగాలను ఇప్పిస్తానని 60 మంది నుండి రూ.1కోటి 85 లక్షలు వసూలు చేసిన ఓ వ్యక్తిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు అరెస్టు చేసిన సంఘటన సూర్యాపేట పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ ఇన్స్‌పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వాసుపత్రులలో స్టాప్‌నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తానని జిల్లాతో పాటు పలు జిల్లాలకు చెందిన 60 మంది నుండి రూ.1కోటి 85 లక్షలు వసూలు చేసి మోసం చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి సూర్యాపేట పట్టణంలో నివాసం ఉంటున్న మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నిందితుడు దుగ్యాల రఘురామ్ క్రీడల ఈవెంట్స్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకు పెద్ద పెద్ద నాయకులతో పరిచయం ఉందని, హైద్రాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో ఉద్యోగం చేస్తున్న వాణితో కలిసి 60 మంది వద్ద రూ.1కోటి 85 లక్షలు వసూలు చేశారు. వారిని నమ్మించి డబ్బులు తీసుకున్న వారు నకిలీ నియామక పత్రాలు ఇవ్వడంతో వారు అది పసిగట్టి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రఘురామ్‌ను అరెస్టు చేసిన పోలీసులు నకిలీ జాబ్ సర్టిఫికెట్లు, సెల్‌ఫోన్‌ను స్వాదీనం చేసుకున్నారు. మోసం చేసి తీసుకున్న డబ్బులతో జల్సాలు చేస్తూ రూ.30 లక్షల విలువైన ప్లాట్, మరో 35 లక్షల విలువైన కారును కొనుగోలు చేసినట్లు తాము గుర్తించామని సిఐ తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు





**ప్రజాపక్షం/సూర్యాపేట:** రంజాన్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లీం సోదరులు శనివారం అంత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద పెద్ద ఎత్తున తరలివచ్చారు. మౌలానా అత్తార్ సాహెద్ ప్రవచనాలు విని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపేందుకు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ రాజ్య సభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యతో పాటు పలువురు నాయకులు హాజరై అలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పారు. అనంతరం ఆయా పార్టీల నాయకులు తమ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు ఇంటికి వెళ్లి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ వేడుకలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు జిల్లా పోలీస్ అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది, మున్సిపల వైస్ చైర్మన్ షఫి ఉల్లా, కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

పవిత్ర పర్వదినం రంజాన్‌ను ఐక్యతతో జరుపుకోవాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





**ప్రజాపక్షం/నల్లగొండ :** రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మత కలహాలు లేకుండా సోదరభావంతో,ఐక్యతతో పండుగలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం పట్టణంలోని మునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద మంత్రి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడారు.రంజాన్ మాసంలో గత 30 రోజుల పాటు ముస్లింలు కఠోర ఉపవాసాలు, ప్రార్థనలు నిర్వహించడం వారి క్రమశిక్షణ,భక్తి, దాతృత్వానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.ఈ పవిత్ర పర్వదినం అందరి జీవితాల్లో ఆనందం, శాంతి నింపాలని, అల్లా ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3,500 కోట్లను కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ రిజర్వేషన్ల వల్ల ముస్లింలు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్,అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, వై.అశోక్ రెడ్డి,ఏఎస్‌పి రమేష్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్, తహసీల్దార్ పరుశురాములు,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్‌పిటిసి పాశం రామ్ రెడ్డి,కార్పొరేటర్లు,ఇతర అధికారులు, మైనార్టీ నాయకులు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.





## సాహిత్యం, కవిత్వానికి సమాజాన్ని మేల్కొలిపే శక్తి




**ప్రజాపక్షం/నకిరేకల్ :** సాహిత్యం,కవిత్వం సమాజాన్ని మేల్కొలిపే శక్తిగా నిలుస్తాయని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.శనివారం నకిరేకల్‌లోని సత్య సాయి ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ కవి తుల శ్రీనివాస్ రచించిన పచ్చబొట్టు కవిత్వ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కవిత్వం భావవ్యక్తీకరణకు అద్భుతమైన సాధనమని, కవులురచయితలు ముందుకు వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు.యువ రచయితలు సమాజ సమస్యలను ప్రతిబింబించేలా రచనలు చేయాలని ఆకాంక్షించారు.అనంతరం కవి తుల శ్రీనివాస్‌ను అభినందించి,భవిష్యత్తులో మరిన్ని రచనలు చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ప్రజావాగ్గేయకారుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ సుప్తచేతనమైన ధ్యానస్థితిలో రాసిన కవిత్వమే చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు.జీవితం నుంచే నిజమైన కవిత్వం పుడుతుందని,సూక్ష్మ పరిశీలనతో కవిత్వం రాసే తత్వం తుల శ్రీనివాస్‌దని పేర్కొన్నారు. ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ప్రొఫసర్ బెల్లి యాదయ్య,ప్రొఫసర్ కోయి కోటేశ్వరరావు,పూజర్ల షంబయ్య,మునాస్ వెంకట్,డాక్టర్ పగడాల నాగేందర్,డాక్టర్ సాగర్ల సత్తయ్య,పెరుమాళ్ళ ఆనంద్,బండారు శంకర్,టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు చామల శ్రీనివాస్,సిఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఓటింగ్ హక్కును లాక్కోనివ్వం

- చివరి వరకూ పోరాడుతాం : మమతా బెనర్జీ




**కోల్‌కతా :** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ద్వారా ప్రజల ఓటు హక్కులను లాక్కోవడానికి బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రయత్నిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో ఈద్ ప్రార్థనల అనంతరం వేలాది మంది ముస్లిం సోదరులనుద్దేశించి ఆమె మాట్లాడారు. పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించాలని అధికార పార్టీ ఆరోపిస్తున్న ఈ సర్ ప్రక్రియ, రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు జరుగుతున్న 'విస్తృత ప్రయత్నంలో' భాగమని టిఎంసి అధినేత్రి ఆరోపించారు. '(ప్రధానమంత్రి నరేంద్ర) మోదీజీ మీ ఓటు హక్కులను లాక్కోనివ్వడానికి మేము అనుమతించము. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి పౌరుడి హక్కులను కాపాడటానికి మేము చివరి వరకు పోరాడతాము' అని బెనర్జీ అన్నారు. ఎన్నికలకు ముందు, ముఖ్యంగా మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాల నుండి నిజమైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నంగా టిఎంసి పదేపదే అభివర్ణిస్తున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తీవ్రమవుతున్న రాజకీయ వివాదం మధ్య ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితాల సవరణ లేదా ధృవీకరణ పేరుతో ఓటర్ల ఓటు హక్కును రద్దు చేసే ఏ ప్రయత్నాన్నైనా తమ పార్టీ ప్రతిఘటిస్తుందని బెనర్జీ హెచ్చరించారు. 'బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకుని, ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తున్న వారు నరకానికి పోవాలి' అని ఆమె పేర్కొన్నారు, సభికుల నుండి పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వినిపించాయి. బెంగాల్‌కు ఉన్న సుదీర్ఘ మత సామరస్య సంప్రదాయాన్ని ప్రస్తావిస్తూ, సమాజాన్ని ధ్రువీకరించడానికి ప్రయత్నించే శక్తులను రాష్ట్రం విజయం సాధించనివ్వదని ముఖ్యమంత్రి అన్నారు. 'బెంగాల్ ఐక్యతను విశ్వసిస్తుంది. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు... ఇక్కడ అందరూ కలిసి జీవిస్తారు. ఈ సామాజిక బంధాన్ని విచ్ఛిన్నం చేయడానికి మేము ఎవరినీ అనుమతించము' అని ఆమె అన్నారు. తూర్పు భారతదేశంలోని అతిపెద్ద నమాజ్ సమావేశాలలో ఒకటైన రెడ్ రోడ్‌లోని వార్షిక ఈద్ సమావేశం, ఎన్నికల సంవత్సరాలలో తరచుగా రాజకీయ వేదికగా కూడా ఉపయోగపడుతుంది. ఈ సభలో ప్రసంగించిన టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, సమాజాన్ని విభజించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ముఖ్యమంత్రి చేసిన విమర్శలను పునరుద్ఘాటించారు. బెంగాల్ మత సామరస్య సంప్రదాయాన్ని పరిరక్షిస్తామని ఆయన నొక్కి చెప్పారు. 'బెంగాల్ మత సామరస్యం పరిరక్షించబడుతుంది. వర్గాలను విభజించే ప్రయత్నాలు ఎలాంటి ఫలితాలనివ్వవు' అని ఆయన అన్నారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా టిఎంసి ప్రతిఘటిస్తుందని డైమండ్ హార్బర్ ఎంపి ధిక్కార స్వరంతో ప్రకటించారు. 'నా తల నరకవచ్చు కానీ నేను తలవంచను' అని అభిషేక్ బెనర్జీ అన్నారు.

## ఇరాన్‌పై దాడులను ఖండించడంలో

# మోదీ ప్రభుత్వం విఫలం

- ఇది పిరికితనం...
- రాజకీయ ద్రోహం : జైరామ్ రమేష్



**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ వైమానిక దాడిని ఖండించడంలో అక్కడ క్రూరమైన పాలన మార్పును తీసుకురావడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ మండిపడింది. భారతదేశ నాగరిక విలువలకు చేసిన నైతిక పిరికితనం, రాజకీయ ద్రోహం అని విమర్శించింది. అమెరికా అధ్యక్షుడు (డొనాల్డ్ ట్రంప్), ఇజ్రాయెల్ ప్రధాని (బెంజమిన్ నెతన్యాహు)లతో తనకు మిత్రుత్వం ఉందని చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోదీ.. దానిని కాల్పుల విరమణకు ఉపయోగించుకోలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడి ప్రారంభమై సరిగ్గా 21 రోజులు లేదా మూడు వారాలు అయ్యిందని శనివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధాని ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన తన ఇజ్రాయెల్ పర్యటన నుంచి తిరిగి వచ్చి 23 రోజులు అయ్యింది కూడా ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై జరిపిన భారీ వైమానిక దాడులను, దేశ నాయకులు భారతదేశంతో సహా అన్నిచోట్లా తీవ్రమైన ఆర్థిక అవకాశలకు దారితీసిన దాన్ని మోదీ ప్రభుత్వం ఖండించిందా, విమర్శించిందా లేదా విచారం వ్యక్తం చేసిందా? సమాధానం లేదన్నారు. ఇరాన్‌లో అంతర్యుద్ధానికి దారితీసే విధంగా పాలన మార్పును, దేశ పతనాన్ని బలవంతంగా రుద్దడానికి అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు చేస్తున్న క్రూరమైన ప్రయత్నాలను మోదీ ప్రభుత్వం ఖండించిందా, విమర్శించిందా లేదా విచారం వ్యక్తం చేసిందా? సమాధానం లేదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఇరాన్‌పై బాంబు దాడులను, గల్ఫ్ దేశాల్లోని ఇంధన, ఇతర కీలక మౌలిక సదుపాయాలపై ఇరాన్ జరుపుతున్న దాడులను తక్షణమే నిలిపివేయడానికి మోదీ ప్రభుత్వం తీవ్రమైన దౌత్యపరమైన ప్రయత్నాలు, చొరవలు చేపట్టిందా? కాల్పుల విరమణ కోసం ప్రధాని, అమెరికా అధ్యక్షుడు, ఇజ్రాయెల్ ప్రధానితో తనకు ఉందని చెప్పుకుంటున్న స్నేహాన్ని ఉపయోగించుకున్నారా? సమాధానం లేదని మండిపడ్డారు. 'ఈ 4 తిరస్కరణలు భారత దేశ నాగరిక విలువలకు చేసిన నైతిక పిరికితనాన్ని, రాజకీయ ద్రోహాన్ని ప్రతిబింబిస్తాయి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. కాగా, మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ యుద్ధం సద్దుమణిగే సూచనలు కనిపించడం లేదు. శనివారం తెల్లవారుజామున కూడా ఇరాన్ తమపై క్షిపణులను ప్రయోగించడం కొనసాగించిందని ఇజ్రాయెల్ పేర్కొన్నారు, ప్రధాన చమురు కేంద్రాలున్న తూర్పు ప్రాంతంలో కేవలం రెండు గంటల వ్యవధిలోనే 20 డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా తెలిపింది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై కూడా కాల్పులు జరిపింది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినోద, పర్యాటక ప్రదేశాలను బెదిరించింది. ఈ యుద్ధంలో ఇరాన్‌లో మృతుల సంఖ్య 1,300 దాటింది, లెబనాన్‌లో 1,000 మందికి పైగా, ఇజ్రాయెల్‌లో 15 మంది, ఈ ప్రాంతంలో 13 మంది అమెరికా సైనికులు మరణించారు. లెబనాన్, ఇరాన్‌లలో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు.

# 23న 'ప్రపంచ నీటి దినోత్సవ సదస్సు

- *700 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారని జలశక్తి మంత్రిత్వశాఖ అంచనా*




**న్యూఢిల్లీ :** జలశక్తి మంత్రిత్వ శాఖ, ఈనెల 23న దేశ రాజధానిలో 'ప్రపంచ నీటి దినోత్సవ సదస్సు 2026'ను నిర్వహించనుంది. ఈ సమావేశంలో 700 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మార్చి 22న జరుపుకునే ప్రపంచ నీటి దినోత్సవం, మంచినీటి ప్రాముఖ్యతను, సుస్థిర నీటి నిర్వహణ ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. ఈ ఏడాది ఈ సదస్సు 'నీరు, లింగ సమానత్వం' ఇతివృత్తంగా కొనసాగనుంది. ఈ సదస్సు సుస్థిర నీటి నిర్వహణ కోసం చర్చలు, ఆవిష్కరణలు, సహకారానికి ఒక జాతీయ వేదికగా ఉపయోగపడుతుందని మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందులో విధాన రూపకర్తలు, పారిశ్రామిక నాయకులు, విద్యావేత్తలు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఇలు, యువ ఆవిష్కర్తలు పాల్గొంటారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, రీసైక్లింగ్, పునర్వినియోగంలో పరిశ్రమల పాత్రను ఈ సదస్సు నొక్కి చెబుతుందని, తద్వారా సుస్థిర పద్ధతులను అవలంబించే నీటి వినియోగదారుల నుండి నీటి సంరక్షకులుగా మారడానికి ఇది నాంది పలుకుతుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. జల్ శక్తి హ్యాకథాన్ విజేతలను సన్మానించడం, అలాగే '7వ చిన్న నీటిపారుదల గణన', '2వ జలాశయాల గణన', '1వ ఊటల గణన', '1వ ప్రధాన, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టుల గణన' వంటి ప్రధాన జాతీయ నివేదికలు, సాంకేతిక, నేపథ్య ప్రచురణలు, జాతీయ నీటి డేటా విధానాన్ని విడుదల చేయడం వంటివి ఈ కార్యక్రమంలోని ముఖ్యాంశాలలో ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. నాలుగు నేపథ్య సమావేశాలు బురద నిర్వహణ, ఎఐ, ఐఒటి ఉపయోగించి పరిశ్రమల నేతృత్వంలోని నీటి సామర్థ్యం, హిమానీనద వ్యవస్థలు, వాతావరణ స్థితిస్థాపకత, ప్రణాళిక కోసం నీటి గణన డేటా వినియోగంపై దృష్టి సారిస్తాయి. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంపొందిస్తూ, నీటి రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమాలను కూడా మంత్రిత్వ శాఖ ప్రముఖంగా ప్రస్తావిస్తుంది. ప్రపంచ నీటి దినోత్సవం అనే భావనను తొలిసారిగా 1992లో రియో డి జనీరోలో జరిగిన ఐక్యరాజ్యసమితి పర్యావరణ మరియు అభివృద్ధి సదస్సు (యుఎన్‌సిఇడి)లో ప్రతిపాదించారు. ఆ తర్వాత, సురక్షితమైన నీటి సదుపాయం లేకుండా జీవిస్తున్న 210 కోట్ల మంది ప్రజల గురించి అవగాహన కల్పించేందుకు, ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం మార్చి 22వ తేదీని ప్రపంచ నీటి దినోత్సవంగా ప్రకటించింది. 1993 నుండి దీనిని ఏటా పాటిస్తున్నారు. 2030 నాటికి అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలనే సుస్థిర అభివృద్ధి లక్ష్యం 6 సాధనకు మద్దతు ఇవ్వడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరగనున్న ఈ సదస్సు, సుస్థిర నీటి నిర్వహణ పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ఒక ఉమ్మడి పారిశ్రామిక ప్రకటనతో ముగుస్తుందని ఆ ప్రకటన తెలిపింది.

# కాంగ్రెస్, రాహుల్‌గాంధీ బిజెపికి 'బిటీమ్'

'పిటిఐ' ఇంటర్వ్యూలో కేరళ సిఎం పినరయ్ విజయన్



**తిరువనంతపురం:** కేరళలో అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్‌పై ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బిజెపికి బిటీమ్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పిటిఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో విజయన్ ఈ ఆరోపణ చేశారు. కేరళ ముఖ్యమంత్రి మినహా దేశంలోని ఇతర ప్రతిపక్ష నాయకులను కేంద్ర ఏజెన్సీలు అరెస్టు చేశాయని లేదా విచారణకు పిలిచాయని రాహుల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా, కాంగ్రెస్ నాయకుడు, ఆయన పార్టీ బిజెపికి బిటీమ్‌గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది ఏదైనా చూసినా లేదా అనుభవించినా నేర్చుకోరని, వారు సాధారణ వ్యక్తులు కాదన్నారు. వారు ఒక అరుదైన దృగ్విషయమని, సాధారణంగా విషయాలను గ్రహించలేని వారికి అలా జరుగుతుందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఆ కోవకే చెందుతారన్నారు. రాహుల్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారని, అయితే కోర్టు ఆ ఆరోపణలన్నింటినీ తిరస్కరించి, ఆప్ నాయకుడికి క్లీన్ చిట్ ఇచ్చిందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ నాయకత్వానికి ఇది గట్టి దెబ్బ అని అన్నారు. అయినప్పటికీ, ఆయన అదే విషయాన్ని పునరావృతం చేయడం దయనీయమన్నారు. అందుకే వారు చూసిన, అనుభవించిన వాటి నుండి పాఠాలు నేర్చుకోరని తాను వ్యాఖ్యానించానని విజయన్ చెప్పారు. జాతీయ స్థాయి వ్యవహారాలను పరిశీలిస్తే మనకు కనిపించేది ఏమిటంటే, రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ వాస్తవానికి బిజెపికి బిటీమ్‌గా మారిపోయిందన్నారు. గతంలో కేరళలో కాంగ్రెస్–బిజెపి పొత్తు చాలాసార్లు కనిపించిందని, అయితే రాబోయే ఎన్నికల్లో పరిస్థితులు ఎలా మారుతాయో ఇంకా స్పష్టంగా తెలియలేదని ఆయన పేర్కొన్నారు. రెండు పార్టీలు ఎల్‌డిఎఫ్‌ను ఒకే విధంగా వ్యతిరేకిస్తున్నాయని, అవి చాలా బాగా కలిసిపోతున్నట్లు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి ఏమాత్రం వెనుకాడని వర్గంగా కాంగ్రెస్, యుడిఎఫ్ మారాయని విజయన్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌పై ఆయన బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని, మెజారిటీ, మైనారిటీ మతతత్వంలో నిమగ్నమైన వర్గాల మద్దతు కోరుతున్నారని ఆరోపించారు. సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ మతతత్వానికి వ్యతిరేకమని, మత కార్యకలాపాలలో నిమగ్నమైన ఏ వర్గం మద్దతును కోరదని ముఖ్యమంత్రి అన్నారు. 'ఎలాంటి మతతత్వాన్నైనా దూరంగా ఉంచగలగాలి. ఓట్లకు ప్రాధాన్యత ఇచ్చేవారు అలా చేయలేరు, ఇప్పుడు యుడిఎఫ్‌కు అదే జరిగింది. మతతత్వం ఏ రూపంలో ఉన్నా అది దేశానికి ప్రమాదకరం, దానితో యుడిఎఫ్ రాజీ పడటానికి సిద్ధమవుతోంది.దానిపై గట్టి వైఖరి తీసుకోగలగాలి. మేము తీసుకునే వైఖరిలోని ప్రత్యేకత అదే. మేము ఏ మత తత్వ శక్తితోనూ రాజీ పడము. మేము అన్ని రకాల మతతత్వానికి వ్యతిరేకం' అని ఆయన అన్నారు. శబరిమల బంగారం నష్టం విషయంపై విజయన్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ చేస్తున్న వ్యతిరేక వాదనలను పక్కనపెట్టి, ఈ కేసు దర్యాప్తును కేరళ హైకోర్టు పర్యవేక్షిస్తోందని, విచారణలో ఎలాంటి తప్పునూ హైకోర్టు కనుగొనలేదని అన్నారు. ఈ విషయంలో ప్రమేయం ఉన్న ఎవరినీ వదిలిపెట్టబోమనేది ప్రభుత్వ వైఖరిలో స్పష్టంగా ఉందని, అందువల్ల ఈ అంశంపై సిపిఐ(ఎం)పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు ఏప్రిల్ 9న జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపవని ఆయన అన్నారు. ప్రభుత్వంపై దాడి చేయడానికి యుడిఎఫ్‌కు వేరే వాస్తవ ఆధారాలు లేనందున, కేవలం దాని ద్వారా ఓటర్లను ప్రభావితం చేయగలరేమోనని చూసేందుకే ఈ విషయాన్ని పదేపదే లేవనెత్తుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగే శాసనసభ సమావేశాలు ప్రభుత్వంపై, దాని మంత్రులపై దాడి చేయడానికి యుడిఎఫ్‌కు మంచి అవకాశమని, కానీ ఆ అవకాశం చేజారడంతో, అది పలు రోజుల పాటు సభా కార్యకలాపాలను బహిష్కరించిందని ముఖ్యమంత్రి అన్నారు. జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ పాలనలో నాజీ పార్టీకి ప్రచారకర్తగా పనిచేసిన జోసెఫ్ గోబెల్స్‌ను మించి ప్రతిపక్షాలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని కూడా ఆయన ఆరోపించారు. వయనాడ్ పునరావాసానికి ఆర్థిక సహాయం సహా పలు అంశాలపై కేరళ పట్ల కేంద్రం శత్రు వైఖరి అవలంబిస్తోందని ఆరోపిస్తూ విజయన్ కేంద్రంపై కూడా కేంద్రంలోని బిజెపి సర్కార్‌పై కూడా గుప్పించారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎంతో సహాయం చేసిందన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ వ్యాఖ్యలను ఆయన అసంబద్ధమని కొట్టిపారేశారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి పెంచేందుకు, కేరళలోని ఉన్నత విద్యా రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని కూడా ఆయన ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

# యుఎన్ఐ న్యూస్ ఏజెన్సీ ఆఫీసు సీజ్



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ ఆఫీసు (యుఎన్ఐ కార్యాలయం)ను శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యుఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యుఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యుఎన్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యుఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యుఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యుఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యుఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది.1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యుఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

## 'సీజ్'పై ఐజెయు ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యుఎన్ఐ) కార్యాలయాన్ని బలవంతంగా సీజ్ చేసి స్వాధీనం చేసుకోవడంపై ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్య దేశంలో పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనని, ప్రజాస్వామ్యంలో నాలుగవ మూల స్తంభంగా భావించే మీడియాకు అవమానకరమని పేర్కొంది. మార్చి 20వ తేదీ సాయంత్రం న్యూఢిల్లీలోని రఫీ మార్గ్‌లో ఉన్న యుఎన్ఐ కార్యాలయాన్ని హైకోర్టు ఆదేశాల పేరుతో స్వాధీనం చేసుకున్న తీరు దిగ్భ్రాంతిని కలిగించిందని ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్ము శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు, ల్యాండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ అధికారులు వ్యవహరించిన తీరు దేశంలోని జర్నలిస్టులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని అన్నారు. సిబ్బందికి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, వారి వ్యక్తిగత వస్తువులు తీసుకునే అవకాశం ఇవ్వకుండా కార్యాలయాన్ని సీజ్ చేసే చర్యను అమలు చేయడం బాధాకరమన్నారు. సాధారణ పరిపాలనా ప్రక్రియ మాదిరిగా కాకుండా, ఇది పోలీసు దాడి మాదిరిగా సాగిందని విమర్శించారు. ఈ చర్య సందర్భంగా మహిళా జర్నలిస్టులను తోసివేసినట్లు వచ్చిన సమాచారం, దృశ్యాలు తీవ్రంగా కలవరపరుస్తున్నాయని వారు పేర్కొన్నారు. పోలీసుల ప్రవర్తనపై సమగ్ర దర్యాప్తు జరిపి, జర్నలిస్టుల గౌరవం, భద్రతకు భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన విశ్వసనీయ వార్తా సంస్థలలో యుఎన్ఐ ఒకటని, దశాబ్దాలుగా ఢిల్లీలోని ఈ కార్యాలయం సజీవ వార్తా కేంద్రంగా పనిచేస్తోందని గుర్తు చేశారు. అర్ధరాత్రి సమయంలో కార్యాలయాన్ని మూసివేసి, వార్తా సేకరణ, ప్రసారాన్ని అడ్డుకోవడం మొత్తం జర్నలిస్టు లోకాన్ని భయపెట్టడమేనని వారు పేర్కొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థిగా నటుడు సుధీర్ కరమనను బరిలో దింపిన ఎల్‌డిఎఫ్



**తిరువనంతపురం :** కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ నటుడు సుధీర్ కరమనతో పాటు మరో ముగ్గురిని తమ స్వతంత్ర అభ్యర్థులుగా ఎల్‌డిఎఫ్ శనివారం ప్రకటించింది. లెఫ్ట్ పార్టీ సహచరుడైన కరమన, ఎల్‌డిఎఫ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. కమ్యూనిస్ట్ మార్క్సిస్ట్ పార్టీ (సిఎంపి), యుడిఎఫ్ నాయకుడు సి.పి. జాన్, బిజెపి అభ్యర్థి కరమన జయన్‌లను ఎదుర్కోనున్నారు. ఏప్రిల్ 9న జరగనున్న ఎన్నికల కోసం సిపిఐ(ఎం)తో సహా ఎల్‌డిఎఫ్ మిత్రపక్షాలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. అయితే, తిరువనంతపురం నియోజకవర్గాన్ని మిత్రపక్షమైన జనధిపత్య కేరళ కాంగ్రెస్ (జెకెసి)కి కేటాయించడంతో, ఆ స్థానంపై నిర్ణయం పెండింగ్‌లో ఉంది. సాక్ష్యాలను తారుమారు చేసిన కేసులో జెకెసి నాయకుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆంటోనీ రాజును ఇక్కడి మేజిస్ట్రేట్ కోర్టు దోషిగా నిర్ధారించి, శిక్ష విధించడంతో ఆయన అనర్హుడిగా ప్రకటించబడ్డారు. జెకెసి ఆ నియోజకవర్గంలో మరో అభ్యర్థిని నిలబెట్టడంలో విఫలమవడంతో, ఎల్‌డిఎఫ్ ఆ నటుడిని బరిలోకి దింపింది. కాగా, కరమన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేయడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటానని అన్నారు. స్థానికుడిగా తనకు తిరువనంతపురంలోని ప్రతి మూలమూ తెలుసని, అలాగే ప్రజల మనోభావాలు, సమస్యలు కూడా తెలుసని ఆయన అన్నారు. ఎన్నికల కోసం అన్ని వర్గాల ప్రజల మద్దతును కూడా ఆయన కోరారు. 'సవాళ్ల విషయానికొస్తే, నేను బలమైన వామపక్ష కూటమితో ఉన్నాను. మేము కొనసాగింపు నినాదంతో ముందుకు వెళ్తాము, అది తప్పక జరుగుతుంది' అని ఆయన అన్నారు. ఎన్నికల బరిలోకి ఎక్కువ మంది నటులు రావడంపై ఆయన మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాజకీయాల్లో సినీ పరిశ్రమ నుంచి వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. 'నేను సినిమాను, రాజకీయాలను భిన్నంగా చూస్తాను. నేను ఉపాధ్యాయుడిని, సినీ నటుడిని. దీనిని నేను సామాజిక సేవలో భాగంగా చూస్తాను. సమాజం కోసం జీవించడం, పనిచేయడమే అంతిమ లక్ష్యం. ప్రజా జీవితంలోకి ప్రవేశించడానికి దీనిని ఒక అవకాశంగా నేను భావిస్తున్నాను' అని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, కాసరగోడ్ నుంచి షానవాస్ పధూర్, వల్లికున్ను నుంచి సి.పి. ముస్తఫా, తానూర్ నుంచి మహమ్మద్ సమీర్‌లను కూడా ఎల్‌డిఎఫ్ ప్రకటించింది. ఎల్‌డిఎఫ్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి వి. అబ్దురహిమాన్‌ను తానూర్ నుంచి తిరూర్‌కు బదిలీ చేయగా, ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సమీర్‌ను ఎంపిక చేశారు.

## పంజాబ్‌లో అధికారి ఆత్మహత్య..

# మంత్రి రాజీనామా



**చండీగఢ్ :** పంజాబ్‌లో ఓ మంత్రి రాజీనామా చేశారు. అమృత్‌సర్‌లోని రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ అధికారి ఆత్మహత్యకు మంత్రి ప్రేరేపించారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ రాజీనామా కోరడంతో పంజాబ్ క్యాబినెట్ మంత్రి లాల్‌జిత్ సింగ్ భుల్లర్ శనివారం రాష్ట్ర క్యాబినెట్‌కు రాజీనామా చేశారు. టర్న్ తరణ్‌లోని పట్టి నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన భుల్లర్, ఈ ఆరోపణలు నిరాధారమైనవని తోసిపుచ్చారు. ఈ విషయంపై విచారణ జరపాలని తాను ప్రధాన కార్యదర్శిని ఆదేశించినట్లు మాన్ తెలిపారు. నిష్పక్షపాత విచారణ కోసమే మంత్రిని రాజీనామా చేయమని కోరినట్లు ఆయన చెప్పారు. భుల్లర్ రాజీనామాపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, 'దీని వెనుక కారణాలు ఏమిటి? ఇది విచారణకు సంబంధించిన విషయం. విచారణ జరపక ముందే, దానిపై ఎవరూ ప్రభావం చూపకుండా లేదా ఎలాంటి ఒత్తిడి తీసుకురాకుండా ఉండేందుకు మా క్యాబినెట్ మంత్రి రాజీనామా తీసుకున్నారు' అని మాన్ అన్నారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, భుల్లర్ చేపట్టిన రవాణా, జైళ్ల శాఖలను మరో మంత్రికి కేటాయిస్తామని మాన్ తెలిపారు. శనివారం, సోషల్ మీడియాలో ఒక వీడియో వెలుగులోకి వచ్చింది. అందులో మృతుడైన మేనేజర్ గగన్‌దీప్ సింగ్ రంధావా, తాను ఏదో విషపదార్థం సేవించానని చెబుతూ, లాల్‌జిత్ సింగ్ భుల్లర్ తనను వేధించారని ఆరోపించారు. భుల్లర్ ఒక ఫేస్‌బుక్ పోస్ట్‌లో, తమ పార్టీ ఎల్లప్పుడూ సత్యం పక్షాన నిలుస్తుందని, అందుకే తనపై వచ్చిన ఆరోపణలపై సరైన విచారణ జరపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'ఈ విచారణ పూర్తయ్యే వరకు, మంత్రి పదవికి నా రాజీనామాను ఆమోదించాలని పార్టీని, మా ముఖ్యమంత్రిని నేను అభ్యర్థిస్తున్నాను. ఈ విషయంపై సరైన విచారణ జరిపేందుకు వీలుగా నా రాజీనామాను ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు పంపుతున్నాను' అని ఆయన అన్నారు. అంతకు ముందు, శిరోమణి అకాలీ దళ్ నాయకుడు విక్రమ్ సింగ్ మజీతియా, రంధావా సెల్ఫాస్ సేవించడం వల్ల మరణించారని ఆరోపించారు. మరణానికి ముందు రంధావా, భుల్లర్ పేరు చెప్పారని, రూ.10 లక్షల లంచం తీసుకున్నట్లు ఒప్పుకోవాలని తనపై ఒత్తిడి తెచ్చారని కూడా మజీతియా ఆరోపించారు. భుల్లర్ సహాయకుడికి టెండర్ ఇవ్వాలని రంధావాపై ఒత్తిడి తెచ్చారని, అయితే ఆయన దానికి బదులుగా సరైన బిడ్డర్‌ను ఎంచుకున్నారని అకాలీ నాయకుడు ఆరోపించారు. రంధావాను భుల్లర్ ఇంటికి పిలిపించి, ఆయనపై దాడి చేశారని, వీడియో తీసేందుకు ప్రయత్నాలు జరిగాయని ఎస్ఎడి నాయకుడు ఆరోపించారు. భుల్లర్‌పై వచ్చిన ఆరోపణలు తీవ్రమైనవని కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్ సింగ్ బాజ్వా అభివర్ణించారు. అమృత్‌సర్‌లోని వేర్‌హౌస్ కార్పొరేషన్ డిఎం గగన్‌దీప్ సింగ్ రంధావా ఆత్మహత్య చేసుకుని మరణించారు. మరణానికి ముందు, రూ. 10 లక్షల లంచం, టెండర్ల అవకతవకలు, దాడి, బెదిరింపులను అంగీకరించమని మంత్రిపై ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ ఆయన మంత్రి పేరును వెల్లడించారు. 'పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ కేసును సుమోటోగా స్వీకరించి, న్యాయం జరిగేలా చూడాలని నేను కోరుతున్నాను' అని ఆయన అన్నారు.

## నదుల అనుసంధానం పథకం కింద 2025-26లో

# తక్కువ నిధుల వినియోగం ఎందుకు ?

పార్లమెంటరీ ప్యానెల్ అసహనం

**న్యూఢిల్లీ:** నదుల అనుసంధానం పథకం కింద 202526 కాలంలో నిధుల వినియోగం తక్కువగా ఉండటంపై ఒక పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయ్యేలా అమలును వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. జలవనరులపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఒక నివేదికలో 1980లో రూపొందించిన జాతీయ దృక్పథ ప్రణాళిక (ఎన్‌పిపి) కింద నదుల అనుసంధాన బాధ్యతను జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యుడిఎ)కు అప్పగించినట్లు పేర్కొంది.ఈ ప్రణాళిక ప్రకారం మిగులు ప్రాంతాల నుంచి లోటు ప్రాంతాలకు బేసిన్ల మధ్య నీటి బదిలీని సులభతరం చేయడానికి, కరువు పీడిత, వర్షాధార ప్రాంతాలలో నీటి లభ్యతను మెరుగుపర్చడానికి ద్వీపకల్పభాగంలో 16, హిమాలయ భాగంలో 14చొప్పున 30 అనుసంధాన ప్రాజెక్టులను గుర్తించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో నిధుల వినియోగం తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. బడ్జెట్ ఎస్టిమేట్స్ (బిఇ) దశలో నిధుల కేటాయింపు రూ.2,4 00కోట్లు ఉండగా, రివైజ్డ్ ఎస్టిమేట్స్ (ఆర్ఇ) దశలో రూ.1,808.29 కోట్లకు సవరించారు. వ్యయం రూ.453.16 కోట్లుగా ఉంది.

**LOST PASSPORT**

I, **BINGI TIRUPATHI S/o BINGI RAJA NARSAIAH**, R/o. H.No. 8-87, Polasa Village, Jagtial Rural Mandal, Jagtial Dist., Telangana State - 505327. lost my original **Passport No. N7972975** while I was travelling from Jagtial to Polasa Village by Motor cycle. If anybody found please return the same to me. **Contact No. 7396713002.**

**CHANGE OF NAME**

I, **YENDA GOVIND RAO S/o YENDA CHANDER RAO,** H.No. 7-76/1, Plot No. 302, Subash Nagar, Quthbullapur Mandal, Rangareddy Dist, Telangana State - 500055, My daughter name was wrongly occurred in Aadhaar Card as **YENDA SHANVIKA** (Old Name), Age: 03 Years, Shall henceforth be known as **YENDA SHANVIKA IRA** (New Name) for all purposes.




## వృక్షాల శిల్పి!





శిల్పులు శిలలను అద్భుత శిల్పాలుగా చెక్కుతారు. ఎక్సెల్ ఎర్లాండ్సన్ అనే అమెరికన్ రైతు కూడా గొప్ప శిల్పే. అయితే, అతను శిలలను కాకుండా చెట్లను చెక్కుతాడు. వివిధ ఆకృతలతో కనువిందు చేసే చెట్లను చూస్తే, అతని పట్టుదల, దీక్ష, ఆసక్తి స్పష్టమవుతాయి. చెట్ల పెరుగుదలను నియంత్రిస్తూ వాటిని కళాత్మక రూపాల్లోకి మలచిన శిల్పిగా గుర్తింపు పొందిన ఎక్సెల్ కాలిఫోర్నియాలో ఒక ఉద్యానవనాన్ని స్థాపించాడు. అక్కడ చెట్లను సహజంగా పెంచడమే కాకుండా, వాటిని వంకరలుగా, పలకలుగా, తెరలుగా, వృత్తాలుగా మలిచే ప్రయోగాలు చేశాడు. ఈ ప్రక్రియలో ఆయన ప్రధానంగా ప్రూనింగ్ (కొమ్మలను కత్తిరించడం), గ్రాఫ్టింగ్ (రెండు మొక్కలను కలిపి పెంచడం) వంటి ఉద్యాన పద్ధతులను వినియోగించాడు. ఈ పద్ధతులు శాస్త్రీయంగా తెలిసినవే అయినప్పటికీ, వాటిని కళాత్మకంగా ఉపయోగించడం ఆయన ప్రత్యేకత. ఆయన రూపొందించిన చెట్లలో ఒకటి 'బాస్కెట్ ట్రీ'గా ప్రసిద్ధి చెందింది, ఇది చెట్ల కొమ్మలను పరస్పరం ముడివేసి బుట్టలా రూపొందించిన ఆకృతి. ఈ ఉద్యానవనం తరువాత సందర్శకులను ఆకర్షించే ప్రదేశంగా మారి 'ది ట్రీ సర్కస్' అనే పేరుతో ప్రాచుర్యం పొందింది. 1963లో ఎర్లాండ్సన్ ఈ ప్రదేశాన్ని ల్యారీ, పెగ్గీ థాంసన్‌కు విక్రయించారు. తరువాత ఇది పలువురు యజమానుల చేతులు మారుతూ, చివరకు మిచెల్ బోన్‌ఫాన్టే దీనిని తన నర్సరీలోకి తరలించాడు. 'బోన్‌ఫాన్టే గార్డెన్స్'గా అభివృద్ధి చేశాడు. ప్రస్తుతం ఈ ప్రదేశం 'గిల్‌రాయ్ గార్డెన్స్'గా ప్రసిద్ధి చెందింది. ప్రకృతి, మానవ సృజనాత్మకత కలిసినప్పుడు ఎలా అసాధారణ రూపాలు సృష్టించవచ్చో ఇక్కడి చెట్లు నిరూపిస్తాయి. చెట్లు సహజంగా పెరిగేవే అయినప్పటికీ, వాటి ఎదుగుదలను శాస్త్రీయ పద్ధతులతో మార్గనిర్దేశం చేస్తే కళాత్మక రూపాల్లోకి మారవచ్చని ఎర్లాండ్సన్ నిరూపించాడు.

## ఆకట్టుకునే మంచు గుహలు..



రాతి గుహలు, మంచు కొండలు గురించి చాలా మందికి పరిచయం ఉంటుంది. కానీ మంచుగుహలు అనే ప్రకృతి అద్భుతం గురించి వినడం మాత్రం కొంత అరుదు. భూమిపై ఎన్నో మంచుగుహలు ఉన్నప్పటికీ, వాటిలో చాలా కొద్ది మాత్రమే మనుషులకు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ప్రసిద్ధి చెందినది ఈస్రిసెన్‌వెల్ట్. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మంచుగుహల సముదాయం. ఈ గుహలు ఆస్ట్రియాలోని, సాల్జ్‌బర్గ్ సమీపంలో ఉన్న టెన్నెన్‌గెబిర్గే పర్వత శ్రేణుల్లో, సుమారు 40 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి. ఇవి ప్రకృతి సృష్టించిన అద్భుత కళాఖండంలా కనిపిస్తాయి. అయితే భద్రతా కారణాల వల్ల మొత్తం గుహను పర్యాటకులకు అనుమతించరు. కేవలం కొంత భాగాన్ని మాత్రమే సందర్శించేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఆ చిన్న భాగమే చూసినా, మంచుతో ఏర్పడిన శిల్పాలు, స్ఫటికంలా మెరుస్తున్న గోడలు, గడ్డకట్టిన ప్రవాహాల ఆకృతులతో పర్యాటకులను ఆకట్టుకుంటాయి. వారిని ఒక కలల లోకంలోకి తీసుకెళ్తాయి. ఈ గుహల్లో ఏర్పడే మంచు నిర్మాణాలు సంవత్సరాల పాటు నిలిచి ఉంటాయి. వెలుతురు పడినప్పుడు అవి వెండి మెరుపులా కాంతులు విరజిమ్ముతాయి. అందుకే ఇక్కడికి వెళ్లిన పర్యాటకులు, ఇది ఒక సహజ శిల్పాల గ్యాలరీ అని వర్ణిస్తారు. ప్రకృతి తన సృజనాత్మకతను చూపించడానికి మానవ కళాకారుడి అవసరం లేదని ఇవి నిరూపిస్తాయి. సరదాగా మనం కూడా, కనీసం ఊహలోనైనా ఈ మంచుగుహల్లోకి అడుగుపెడితే, చల్లని గాలితో పాటు ప్రకృతి అందాల్ని ఆస్వాదించే అనుభూతి కలుగుతుంది. ఇది కేవలం ఒక పర్యాటక ప్రదేశం కాదు. ప్రకృతి మహిమను మనకు గుర్తుచేసే ఒక విశేష ప్రపంచం.


## దృష్టి భ్రమ.. ఎండమావి



ఎండమావి (మిరాజ్) అనే పదం ఒక సాధారణ ప్రకృతి ఘటనను సూచించినప్పటికీ, దాని అర్థం శాస్త్రం, సాహిత్యం, జీవన అనుభవం అనే మూడు స్థాయిల్లో విస్తరించింది. సాధారణంగా ఎండమావి అంటే దూరంలో నీరు ఉన్నట్టుగా కనిపించే దృశ్యం. కా నీ అది వాస్తవంలో ఉండదు. ఇది ఒక దృష్టి భ్రమ మాత్రమే. శాస్త్రీయంగా చూస్తే, ఇది కాంతి వక్రీభవనంతో ఏర్పడే పరిణామం. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు భూమి ఉపరితలం చాలా వేడిగా మారుతుంది. దాని పైన ఉన్న గాలి పొరలు కూడా వేడి కారణంగా సాంద్రతలో మార్పు పొందుతాయి. ఈ పరిస్థితిలో కాంతి కిరణాలు సూటిగా ప్రయాణించకుం డా వక్రీభవిస్తాయి. ఫలితంగా, ఆకాశం లేదా చుట్టుపక్కల ఉన్న వస్తువుల ప్రతిబింబం నేలపై నీరు ఉన్నట్టుగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఎడారులు, పొడిబారిన రహదారులపై ఇది స్పష్టంగా గమనించవచ్చు. ఎండమావి కేవలం శాస్త్రీయ అంశం మాత్రమే కాదు. తెలుగు సాహిత్యంలో ఇది ఒక శక్తివంతమైన రూపకం. సాధ్యంకాని ఆశలు, మాయమాటలు, నెరవేరని కలలు వంటి ఎన్నో విషయాలను వ్యక్తీకరించడానికి ఈ పదాన్ని ఉపయోగిస్తారు. దూరం నుంచి ఆకర్షణీయంగా కనిపించినా, దగ్గరికి వెళ్లినప్పుడు మాయమైపోయే భావాన్ని ఇది సూచిస్తుంది. అందుకే ప్రేమ, మోసం, నిరాశ వంటి భావోద్వేగాలకు కూడా ఇది చిహ్నంగా నిలుస్తుంది. గ్రామీణ జీవనంలో, ముఖ్యంగా ఎడారులలో ప్రయాణించే వారికి ఎండమావి ఒక ప్రమాదకర భ్రమ. నీరు ఉందని నమ్మి ముందుకు సాగితే, అది కేవలం మోసపూరిత దృశ్యమే అని తెలుసుకునే సమయానికి శక్తి వృథా అవుతుంది. ఇదే భావం మన జీవితానికి వర్తిస్తుంది. మొత్తానికి, ఎండమావి ఒక ప్రకృతి శాస్త్రీయ అద్భుతంగానేగాక, మనిషి ఆలోచనల్లో, భావోద్వేగాల్లో, జీవన అనుభవాల్లో ప్రతిబింబించే ఒక గాఢమైన ప్రతీకగా కూడా చూడాలి.

— బిఎస్ఎస్ మైత్రేయి

# భగత్‌సింగ్ స్ఫూర్తి



దేశమాత దాస్య శృంఖలాలు తెంచేందుకు భగత్‌సింగ్ యువక ప్రాయంలోనే ప్రాణార్పణగావించిన రోజు (1931 మార్చి 23 ) 95 సంవత్సరాల అనంతరం కూడా యువతరానికి స్ఫూర్తిమంతంగా వర్ధిల్లుతున్నది. మరో ఐదేళ్లలో ఆ విప్లవయోధుని, ఆయన సహచరులు రాజ్‌గురు, సుఖదేవ్‌ల అమరత్వ శతవార్షికోత్సవం వస్తోంది. బ్రిటిష్ వలస పాలకుల నుంచి దేశవిముక్తికై ఆరోజుల్లో సరికొత్త ఆలోచనలతో ముందుకు వచ్చిన పట్టణ యువతలో భగత్‌సింగ్ అగ్రగణ్యుడు. ఆయన తన సహచరులతో కలిసి తొలుత హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మార్క్సిజం ప్రభావం కింద 'ఆర్మీ' పదం స్థానంలో 'అసోసియేషన్' చేర్చారు. తమ కేసు విచారణ కోర్టులో భగత్‌సింగ్ ఇలా చెప్పారు. 'విప్లవం మానవాళి అవిభాజ్యమైన హక్కు, స్వేచ్ఛ ప్రతి ఒక్కరి జన్మహక్కు. శ్రమజీవి సమాజ మనుగడకు మూలాధారం.. అటువంటి అద్భుత లక్ష్యాల కన్నా మిన్న అయిన త్యాగం మరొకటి లేదు...' విప్లవం అంటే తనకు బాంబు లేదా పిస్టల్ ఆరాధన కాదని వివరణ యిచ్చారు. 'విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారీతనాన్ని కూలదోసి, కార్మికవర్గ నియంతృత్వాన్ని స్థాపించే విధంగా సమాజంలో మార్పు తీసుకురావటమే విప్లవం' అని అన్నారు. అప్పుడు అతని వయస్సు 23 సంవత్సరాలు. కోర్టు విధించిన ఉరిశిక్ష అమలుకోసం వేచిచూస్తూ, సమయం వృథా చేయకుండా మార్క్సిజం అధ్యయనంలో నిమగ్నమైనారు. ఒకే మార్గం, ఒకే సూత్రాలు అనుసరిస్తున్న భగత్‌సింగ్, ఆయన మిత్రులు తమపై కోర్టులో కేసు విచారణ జరుగుతున్న సమయంలో, జైల్లో తోటి రాజకీయ ఖైదీలు జీవిస్తున్న దుర్భర పరిస్థితుల మెరుగుదల కోరుతూ పోరాటాలు చేశారు. దేశం లోపల కూడా ఆశావాదం చాలా బలంగా ఉంది. బొంబాయి జౌళి కార్మికులు ఆరుమాసాల పాటు బ్రహ్మాండమైన సమ్మె కొనసాగించారు. కలకత్తా, కాన్పూర్‌ల్లోని కార్మికులు కూడా బొంబాయి కార్మికులతో చేరారు. 1926లో భగత్‌సింగ్, అతని మిత్రులు భారత్ నవజవాన్ సభ ఏర్పాటు చేశారు. అది త్వరలోనే బలమైన సంస్థగా ఆవిర్భవించింది. పంజాబ్‌లో యువతను అతివాద భావాల వైపు మరల్చటంలో అది ప్రధానమైన పాత్ర వహించింది. భగత్‌సింగ్ కొంత కాలం 'కీర్తి' పత్రిక సంపాదక విభాగంలో పనిచేశారు. అది సోహన్ సింగ్ జోష్ ప్రచురించిన సోషలిస్టు పత్రిక. హెచ్ఎస్ఆర్ఎ త్వరలోనే పునర్నిర్మాణం చెందింది. స్వేచ్ఛాయుతమైన సోషలిస్టు రాజ్యంగా దేశాన్ని విముక్తి చేయటం ప్రధాన ధ్యేయంగా అది ప్రకటించింది. స్వేచ్ఛ, సోషలిజం కోసం పోరాటం చేయటం ఎలా అన్నది ప్రధాన సమస్య. సోషలిజం ఆదర్శంగా ఉంది. ఈ లక్ష్యం కోసం ఆ సంస్థలో చేరినవారిలో చాలా మంది అటు తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వారిలో అజయ్‌ఘోష్ ఒకరు. అటు తర్వాత ఆయన సిపిఐ ప్రధాన కార్యదర్శి అయినారు.

దేశంలో నిరాశ తగ్గుతున్నది. ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. యువజన సంఘాలు ఏర్పడుతున్నాయి. కార్మికవర్గం పెద్ద ఎత్తున అసమ్మతి వ్యక్తీకరణ మొదలుపెట్టింది. కమ్యూనిస్టులు, ట్రేడ్‌యూనియన్ నాయకుల అరెస్టుకు త్వరలోనే అరెస్టు ఉత్తర్వులు జారీ అయినాయి. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి, యువజన సంఘం నాయకుడు పి.సి.జోషీని అరెస్టు చేశారు. పర్యవసానంగా విద్యార్థులు మూకుమ్మడిగా లేచారు. దేశమంతటా ప్రదర్శనలు తీశారు. కమ్యూనిస్టులతో తాము కలిసి పని చేయాలని, వారితో కార్యాచరణ ఐక్యత ఏర్పరుచుకోవచ్చునని భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్ గుర్తించిన సమయం రానే వచ్చింది. భేదాభిప్రాయాలున్నా సారూప్యతలను వారు గుర్తించారు. ఇరువురూ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్నారు.సోషలిజం దిశగా ప్రయాణించటం వారి అంతిమ లక్ష్యం. ఈ విషయంలో హెచ్ఎస్ఆర్ఎ, కమ్యూనిస్టుల అభిప్రాయం ఒక్కటే. కమ్యూనిస్టులను అరెస్టు చేయటం తమకు కూడా ముప్పు అని ఆ విప్లవ నాయకులు భావించారు. ప్రజలను అణచివేసే సామ్రాజ్యవాదుల విధానాన్ని మొత్తంగా వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేయాలని తీర్మానించారు. ప్రభుత్వం ఆమోదించిన వ్యాపార వివాదాల బిల్లును వ్యతిరేకిస్తూ కరపత్రాలు పంచారు. మొత్తం దేశం దృష్టిని ఆకర్షించేందుకు అసెంబ్లీలో బాంబు పేల్చాలని నిర్ణయించారు. ఎవర్నీ చంపటం వారి ఉద్దేశం కాదు, భగత్ సింగ్ రచించిన కరపత్రాన్ని సభ్యులందరికీ పంచాలనుకున్నారు. ఈ మొత్తం చర్యకు బటుకేశ్వర్ దత్ బాధ్యత తీసుకున్నారు. అయితే బాంబు పేలగానే అంతా గందరగోళం, అరుపులు, ఉరుకులు, పరుగులు, కరపత్రాలు చెల్లా చెదురుగా పడ్డాయి. భగత్‌సింగ్ ప్రకటనతో కూడిన ఆ కరపత్రంలో వారు తను బాధ్యతను ఒప్పుకున్నారు. భగత్‌సింగ్, దత్‌లను అక్కడికక్కడే అరెస్టు చేశారు. 1929లో లాహోర్ కుట్ర కేసు ప్రారంభమైంది. విచారణను విప్లవం కోసం వినియోగించుకోవాలని భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్స్ నిర్ణయించుకున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. నూత న నాయకత్వం వృద్ధిలోకి రావటానికి తమ తరం ఆదర్శం నెలకొల్పుతున్నట్లు విప్లవకారులు విశ్వసించారు. సోషలిజం వారికి ఆదర్శం, దేశవిముక్తి తర్వా త సోషలిజం నిర్మాణానికి నడిపించే సూత్రంగా వారు భావించారు. భగత్‌సింగ్ విపరీతంగా పుస్తకా లు చదువుతారు. అందులో సోషలిస్టు సాహిత్యం ఎక్కువగా చదువుతారు. సోషలిజం దిశగా ఆ గ్రూపులో ఆకర్షితులయ్యే వారిలో బహుశా ఆయనే ప్రథముడు. జైలు బయట జరుగుతున్న ఘటనలన్నీ – షోలాపూర్ తిరుగుబాటు, పెషావర్ తిరుగుబాటు, చంద్రసింగ్ గర్వాలీ నాయకత్వంలో గర్వాలీ సైనిక పటాలం వీరోచిత ధిక్కారం వగైరా అన్నింటి గూర్చి తెలుసుకునేవారు. తమ పోరాటం పిస్టల్, బాంబులపై ఆధారపడిందికాదని, ప్రజల ప్రాథమికావసరాలు తీర్చే దిశగా అనగా సోషలిజం దిశగా సమాజ పరివర్తన తమ పోరాట లక్ష్యమని భగత్‌సింగ్ కోర్టుకు చెప్పారు. జైలులో వారి అధ్యయనం వారి దార్శనికతను విశాలమొనర్చింది. వారు ఎల్లప్పుడు సోవియట్ యూనియన్‌ను అభిమానించారు. 1930లో నవంబర్ విప్లవ (అక్టోబర్ విప్లవం) వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్ష లు పంపారు. సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ కరాచీ సెషన్ ప్రారంభంకానుండగా 1931 మార్చి 23న లాహోర్ జైల్లో భగత్‌సింగ్, ఆయన అనుచరులరు సుఖ్‌దేవ్ థాపర్, శివరాం రాజ్‌గురుల ఉరిశిక్ష అమలు జరిపారు. భగత్‌సింగ్‌కు అప్పటికి 24 సంవత్సరాలు పూర్తి కాలేదు. ఆ అమర జీవులకు జోహార్లు. యువతకు నేటికీ ఆయన జీవితం స్ఫూర్తిదాయకం. ●

(న్యూఏజ్ సంపాదకీయం)

# ఉన్నది అంతా బ్రాహ్మణవాదమే!



డాక్టర్ దేవరాజు మహారాజు

> ఆలోచన, ముఖ్యంగా సొంత ఆలోచన ఒక విప్లవాత్మకమైన గుణం. అంతేకాదు, తప్పనిసరిగా ఉండాల్సిన గుణం. నేను ఒక మానవుణ్ణి, మానవుడే కేంద్రంగా మానవత్వం కోసమే పనిచేస్తాను.
>
> –షాహిద్ భగత్ సింగ్.

ఒక దర్జీ చొక్కా కుట్టడానికి ఒక కొత్త కత్తెర తెచ్చుకున్నాడు. కొత్త గుడ్డను కావాల్సిన రీతిలో ముక్కలు కత్తిరించా డు. కత్తెరను కాళ్ల దగ్గర పెట్టుకుని, సూదితో గుడ్డ ముక్కల్ని కలిపి కుట్టడం ప్రారంభించాడు. టైలర్ కూతురు వచ్చి అడిగింది, నాన్నా కత్తెర కొత్తది కదా! దాన్ని అలా కాళ్ల దగ్గర పడేశావు, విలువలేని ఆ పాత సూదిని మాత్రం తలమీద తలపాగాకు కుచ్చుకున్నావు అని అడిగింది. దర్జీ లోలోన నవ్వుకున్నాడు. 'నిజమే నమ్మా, కత్తెర కొత్తదే కానీ అది గుడ్డను ముక్కలు చేసింది, ఆ గుడ్డ ముక్కలకు విలువలేదు, పాతదైనా సరే, ఖరీదైంది కాకపోయినా సరే సూది ఏం చేసింది? ఆ గుడ్డ ముక్కల్ని కలిపికుట్టి ఒక మంచి చొక్కా తయారు చేసింది. అప్పుడే కదా చొక్కాకు విలువ పెరిగేది? చొక్కా కుట్టక ముందు గుడ్డ ముక్కలకు విలువలేదు. వస్తువు కొత్తదా? పాతదా? అని కాదు– అది చేసే పనిని బట్టి మనం దాన్ని ఉపయోగించుకోవాలి. కత్తెర ఎక్కడ వేసినా ఉంటుంది, గుడ్డ ముక్కల్ని కలిపికుట్టే సూదిని ఎక్కడ బడితే అక్కడ పడేయలేం– దాని విలువ ఎక్కువ. అది సున్నితం, అపురూపం. జాగ్రత్తగా చూసుకోవాలి కదమ్మా– అందుకే దాన్ని నా తలమీద జాగ్రత్తగా తలపాగాకు గుచ్చుకుని భద్రపరుచుకుంటాను. "అయినా ఇది చెప్పు? పరపరమని కోసి విడదీసేది గొప్పదా? లేక విడిపోయిన గుడ్డముక్కల్ని కలిపి కుట్టేది గొప్పదా?" అని ప్రశ్నిస్తూ ప్రేమగా కూతురు కళ్లలోకి చూశాడు దర్జీ.'కలిపి కుట్టేదే నాన్నా' అంది కూతురు మెరిసే కళ్లతో. సమాజంలో కూడా కొందరు మనుషుల్ని విభజించి పైశాచికానందం పొందుతుంటారు. ఈ దేశ పౌరులమైన మనం చాలా చిన్నవాళ్లమే కావొచ్చు, అయినా కూడా మనుషుల మధ్య సౌహార్దాన్ని పెంపొందించి కలుపుకు పోవాల్సినవాళ్లం. అందరం సమైక్యంగా ఉంటేనే దేశం విలువ పెరిగేది' అన్నాడు తండ్రి. సూదిని తలపాగాకు గుచ్చుకుంటూ.


'మనం చిన్నవాళ్లమే, గుడ్డ ముక్కల్ని కలిపికుట్టే సూది చిన్నదే– అయితే మాత్రమేం? చేస్తున్నది గొప్ప పని కదా నాన్నా!. 'అవునా తల్లీ బాగా చెప్పావ్! భారత్ జోడో అంటూ ఆసేతు హిమాచలం కాలినడకన వెళుతూ జనాన్ని కలుపుకుపోయేవారూ, న్యాయ యాత్ర పేరుతో అణగారిన వర్గాలకు న్యాయం కావాలని కోరుకునేవారు కావాలా? లేక మతం, గుళ్లు, విగ్రహాలు, ప్రాణప్రతిష్ఠ అంటూ పరిపాలనను గాలికి వదిలేసేవారు కావాలా?' 'ఓ నాన్నా! నాకు దేశరాజకీయాలన్నీ సులభంగా అర్థమవుతున్నాయి. రామాలయ నిర్మాణం పేరుతో అయోధ్యలో వేలవేల ఇండ్లూ, దుకాణాలు, పురాతన కట్టడాలు అన్నింటికి అన్నీ ధ్వంసం చేశారు. దౌర్జన్యంగా జనాన్ని నిరాశ్రయుల్ని చేశారు, వారిని ఆదుకోకుండా గాలికి వదిలేస్తే ఎలా? పాపం!' 'దేశ ప్రధాని తాను హిందూ దేశానికి రాజునయ్యాననీ, తనకిక తిరుగులేదనీ భావిస్తున్నాడు' 'ఆ.. ఆ.. జనం తలుచుకుంటే క్షణం పట్టదు– మట్టికరిపించడానికి! వివేకంలేని వారు అని అనుకుంటున్నాడే మో' అంది కూతురు సీరియస్‌గా. 'అయ్య బాబోయ్ ఏమో అనుకున్నా..నీకు చాలా విషయాలు తెలుసే తల్లీ' 'తెలుసు నాన్నా! పుస్తకాలు చదివి చాలా విషయాలు తెలుసుకుంటున్నా, హిందూ హిందూ అని చచ్చే ఈ కాషాయ మూకలు విషయాలు తెలుసుకోరు. 12వ శతాబ్దం దాకా దేశంలో మనవారికి 'హిందూ' అనే మాటే తెలియదట నాన్నా ఎక్కడో చదివాను. పర్షియా వాళ్లు మనదేశానికి సింధూ నది దాటి వచ్చారట. వారు సింధూ అని పలకలేక హిందూనది దాటి వచ్చాం అని చెప్పుకున్నారు. హిందూ నదికి ఆవల ఉన్నవాళ్లను హిందువులు అని అన్నారు. అప్పుడు అది మతానికి సంబంధించిన పదమేకాదు.' 'అవునమ్మా నిజమే..నాకు ఓ మాస్టారుగారు చెప్పారు. దేవుణ్ణి, మతాన్ని కలిపి రాజకీయం చేస్తున్నవారిని వదిలిపెట్టగూడదు. బుద్ధి చెప్పాల్సిందే. పౌరులుగా రాజ్యాంగబద్ధంగా మనం చేయాల్సింది మనం చేస్తూ ఉండాల్సిందే' 'కత్తెర్లు ముక్కలు చేస్తుంటే మనం కలిపి కుట్టుకుంటూ ఉండాల్సిందే, అంతే కదూ నాన్నా' అంటూ పెద్దగా నవ్వింది కూతురు. ఆమె నవ్వులో నవ్వుకలిపాడు తండ్రి.. సూదీ దారం పైకెత్తి ఆ తండ్రీ కూతుర్ల సంభాషణని అలా ఉండనిచ్చి, మనం మరో ముఖ్యమైన విషయంలోకి వెళదాం!.

సైన్సును నమ్మడం కూడా ఒక మతమే! హేతువాదం కూడా ఒక మతమే అని అనేవారున్నారు. అలాంటివారిని ఒప్పించాలని ప్రయత్నించడం కూడా వృథా! కాస్త ఇంగిత జ్ఞానం ఉన్నవాడికి ఇంకొన్ని విషయాలు అర్థం చేయించి ఆలోచించమని చెప్పొచ్చు. అసలు మొత్తానికి మొత్తంగా మెదడే మూసుకున్నవారిని ఏం చేయగలం? మానసిక వికలాంగులుగా పరిగణించాలి. కారణం ఏమంటే, హేతువాదానికీ, సైన్సుకు మతగ్రంథాలు లేవు. లేని ఆ పవిత్ర గ్రంథాల్లోంచి విషయాలు తీసి, ప్రవచించేవారూ లేరు. తమకు తామే ఏదో ఓ మతానికి పేటెంట్ హక్కులు సాధించినట్టు పిచ్చివాగుడు వాగే బాబాలు, స్వాములు, ప్రవచనకారులు, లేదా ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలకు పుట్టిన రాజకీయ నాయకులు ఎవరూ లేరు. మత బుల్డోజర్లు వేసుకుని తిరిగే యోగులు, బైరాగుల భరతం పట్టడమే సైన్స్ కార్యకర్తలు, హేతువాదులు, ప్రశ్నను బతికించుకుంటున్న రచయితలూ చేస్తుంటారు. మరి వీరిది కూడా ఓ మతమే– అని అనేవారికి బుద్ధీ జ్ఞానం లేదని అనుకోవాలి!. సృష్టి ఆదిలో భగవంతుడే వచ్చి హేతువాదులకు, శాస్త్రవేత్తలకు ఏవైనా గ్రంథాలు ఇచ్చి వెళ్లాడా? అంటే లేదు కదా? పూజలు, హారతులు, భజనలు, ప్రేయర్లు, నమాజులు, ఉపవాసాలు, ముడుపులు, మొక్కులు, ఏవంటే ఏవీ లేవు కదా?. ఊరికే అవీ మతాలే అని నోరు పారేసుకుంటే అయిపోయిందా? ఎలా మతాలయ్యాయో చెప్పాలి కదా?. హేతువాదులైనా, వైజ్ఞానికులైనా విశ్వాసంలోంచే ముందుకు పోతారు. ఆ విశ్వాసం రుజువులతో పెరిగే ఆత్మవిశ్వాసం! ఒక అవివేకి సంప్రదాయవాదిగా మనగలుగుతాడేమో గానీ వివేకవంతుడుగా మనలేడు. పైగా అతను వైజ్ఞానికుడో, హేతువాదో తప్పక అవుతాడు. జవాబులు బట్టీయం వేసి పరీక్షలో మార్కులు సంపాదించినవాడు జ్ఞానవంతుడు అవుతాడన్న నమ్మకం లేదు. విషయం అర్థం చేసుకుని, కొత్త ప్రశ్నలు లేవనెత్తేవాడే జ్ఞాని!. అందువల్ల పరిజ్ఞానం వేరు, వివేకం వేరు. ఏదో కొద్దిపాటి పరిజ్ఞానం సంపాదించి, దానితో మనుగడ సాగించేవాడికన్నా నిరంతర అధ్యయనంలో వివేచనతో కొత్తగా ఆలోచిస్తూ, కొత్తగా ప్రశ్నించేవాడే మనకు అవసరం. సమాజానికి అవసరం. ప్రపంచానికి అవసరం. ప్రపంచం 21వ శతాబ్దంలోకి వచ్చింది ఇలాంటి వారితోనే తెల్లవారుజామునే లేచి.. వేదాలు, ఉపనిషత్తులు, ఖురాన్, బైబిల్ వల్లెవేసిన వారితో సమాజం ఇక్కడి దాకా రాలేదు ఈ ఒక్క విషయం గమనిస్తే చాలు!. దేశ కాల పరిస్థితుల్ని గమనించి బాలీవుడ్ గీత రచయిత, హేతువాది జావేద్ అక్తర్ " ఏక్ హమారీ, ఔర్ ఏక్ ఉన్ కీ / ముల్క్ మే హై ఆవాజ్ దో (ఒకటి మాది మరొకటి వారిది/ దేశంలో గొంతులు రెండు) హం కహతే హై ఇన్సానో మె ఇన్సానో సె ప్యార్ రహే/ ఓ కహతే హై హాతో మె త్రిశూల్ రహే–తల్వార్ రహే (మేమంటాం మనుషుల్లో మనుషుల్లాంటి ప్రేముండాలని!/ వారంటారు చేతుల్లో త్రిశూలమో, ఖడ్గమో ఉండాలని!) హం కహతే హై బే ఘర్ బే దర్ లోగోంకో ఆబాద్ కరో/ ఓ కహతే హై భూలే బిస్రే మందిర్ మజ్జిద్, రామ్ సేతూ కో యాద్ కరో( మేమంటాం ఇల్లూ వాకిలీ లేని దీనుల్ని ఆదుకోండని/ వారంటారు మరిచిపోయిన మందిర్, మసీదు, రామసేతులను గుర్తుచేసుకోండని). కేవలం నాలుగు కవితా పంక్తుల్లో జావేద్ అక్తర్ దేశం ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉందో వివరించారు. ఇక మన సనాతన మనువాదులు చెప్పే విషయాలు ఎలా ఉంటాయో చూడండి.

'భూమి శేషనాగుపై ఉంది. శేషనాగు సముద్రంలో ఉన్నాడు. సముద్రం భూమిపై ఉంది". ఇలాంటి తలతిక్క రాతలు చదివితే మనకు ఏమనిపిస్తుంది? 'ఎవడ్రా ఈ స్క్రిప్టు రాసింది? ఏం రాస్తున్నామన్నది చూసుకోపనిలేదా?' అని ఒళ్లు మండుతుందా మండదా? మతం మత్తు మందులాంటిదని అన్నది అందుకేనేమో, మత్తెక్కితే ఏముంది? ఒళ్లు తెలియకుండా ప్రవర్తిస్తారు కదా?. మహాభారతం గొప్ప కావ్యం కదా? అందులో జరిగింది ధర్మయుద్ధమా? కృష్ణుడు ఏం చేశాడో ఆలోచించండి! తన సైన్యాన్ని మొత్తం ధుర్యోధనుడికి ఇచ్చి, తను ఒంటరిగా అర్జునుడికి రథసారథి అయ్యాడు. అంటే ఏమిటీ? అర్జునుడితో తన సైన్యాన్ని తనే దగ్గరుండి చంపించాడన్నమాట! ఇలాంటి తలతిక్క నిర్ణయాలే తర్వాత తరాల మీద ప్రభావం చూపాయి. ఇలాంటి విషయాల్ని ఆదర్శంగా తీసుకోవడం వల్లే, దేశం బానిసత్వంలోకి పోయింది. మొఘలులు గత జన్మలో బ్రాహ్మణులని అబద్దపు రాతలు రాసి ప్రచారం చేశారు కదా? అన్యాయంగా దేశ ప్రజల్ని విడదీయడం కోసం, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడం కోసం ఎన్ని తప్పుడు రాతలైనా రాస్తూపోయారు. ఈ దేశ ప్రజల్ని సంఘటిత పరుస్తూ, సమైక్యంగా ఉంచే మాటలు, రాతలు ఏ మత గ్రంథంలోనైనా ఉన్నాయా?. లేవన్నది గ్రహించాలి! మరి ఆ పని వేటివల్ల జరుగుతోంది? సైన్సువల్ల జరుగుతోంది. మానవ జాతి అంతా ఒకటే అని నిరూపించిన జన్యుశాస్త్రం వల్ల జరుగుతోంది. ప్రతిదాన్నీ తర్కబద్ధంగా ఆలోచించమని చెపుతున్న హేతువాదం వల్ల జరుగుతోంది. ఈ దేశ ప్రజలు పూజారులను కాకుండా, పరిపాలన మీద ధ్యాస పెట్టే విద్యావంతులైన దేశ నాయకుల్ని, నిజాయితీపరుల్ని ఎన్నుకుంటే బాగుపడుతారు.

– సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త, మెల్బోర్న్ నుంచి

# ముళ్ళబాటలో బడ్జెట్ సాహసయాత్ర




ఆర్థిక మంత్రిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శాసనసభలో నాలుగవ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాబోయే ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2026–7 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3.24 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ బడ్జెట్‌కు ముందు కొన్ని ఊహాగానాలు వెల్లడయ్యాయి. ఆరు గ్యారెంటీలలో మెజారిటీ పూర్తి చేసినప్పటికీ, కొన్ని ఉప గ్యారెంటీలను అమలు చేయాల్సి ఉంది. వాటిలో ప్రధానంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలలో ప్రధానంగా ఆకట్టుకున్న మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వృద్ధులకు చేయూత పెన్షన్ రూ.4వేలకు పెంపు గ్యారెంటీలను ఈ బడ్జెట్‌లో పొందుపరుస్తారేమోని చాలా మంది ఎదురు చూసారు. ఆశించినవి నెరవేరనప్పటికీ, ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో పేద, మధ్యతరగతి అనే తేడా లేకుండా 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ బీమా' పథకాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ పథకం వచ్చిన కారణంగా రైతు బీమా పథకానికి నిధులు కేటాయించాల్సిన అవసరం రాలేదు.

అయితే ఆరు గ్యారెంటీల కింద ఉప గ్యారెంటీలను కలిపి 12 హామీలను కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించారు. వాటిల్లో 9 ఆచరణలోకి వచ్చాయి. విద్యార్థులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విద్యా భరోసా కార్డు, తెలంగాణ ఉద్యమ కారులకు ఇళ్ళ జాగాలు, మహిళలకు నెలకు రూ.2,500 అమలు కాలేదు. 57 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ చేయూత కింద పెన్షన్‌లు ఇస్తామని, అలాగే దానిని రెట్టింపు చేస్తామనే హామీ నెరవేరనప్పటికీ, కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్‌లు ఇస్తామనే పేర్కొనడం ఊరట. అయితే, బడ్జెట్‌లో గతంలో లాగే పెన్షన్‌లకు రూ.14,861 కోట్లే కేటాయించటం ద్వారా, ఇప్పటి వరకు మరణించిన లేదా అనర్హుల తొలగింపు ద్వారా ఏర్పడిన ఖాళీలలోనే కొత్త పెన్షన్‌లు వస్తున్నాయి. పెండింగ్ దరఖాస్తుల సంఖ్య లక్షల్లోనే ఉంది. మరో హామీ యువతకు ఉపాధి కోసం రుణాలిచ్చే 'రాజీవ్ యువ వికాసాని'కి గత బడ్జెట్‌లోనే రూ.6వేల కోట్లు కేటాయించినా, మంజూరు కాలేదు. ఈసారి అంతే మొత్తాన్ని ఆ పథకానికి కేటాయించారు. మరో పథకం వ్యవసాయ కార్మికులకు ఏటా రూ.12వేల ఆర్థిక సహాయం పథకాన్ని గతంలో ప్రకటించినా అమలు కాకపోగా, ఈ సారి నిధులూ కేటాయించబడలేదు. వేతన సవరణ హామీని పక్కన బెట్టినప్పటికీ ఉద్యోగులకు ఆరోగ్యభద్రతా పథకాన్ని, జీవిత బీమా పథకాన్ని ప్రకటించి ప్రభుత్వం వారిని కొంత శాంతపరిచింది. ఇక నిధుల విషయానికి వస్తే అత్యంత కఠిన పరిస్థితులు నెలకొన్నాయి. ఘనంగా అంకెలు ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో వాస్తవ రూపం దాల్చడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి పూర్తిస్థాయి బడ్జెట్ (2024–25)ను రూ.2.91 లక్షల కోట్లుతో ప్రతిపాదించగా, అది ఆ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే సరికి రూ.2.36 లక్షల కోట్లకు మాత్రమే పరిమితమైంది. అంటే అసలు కంటే సుమారు రూ.55 వేల కోట్లు తక్కువ. ఆ తరువాత రూ.3.04 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను, రూ.2.81 లక్షల కోట్లకు సవరించబడింది. సుమారు రూ.24వేల కోట్లు తగ్గింది. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి మరింత తగ్గే అవకాశం ఉంది. తాజాగా రూ.3.24 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌కు, సవరించిన 2025–26 బడ్జెట్‌కు మధ్య సుమారు రూ.43వేల కోట్ల అంతరం ఉంది. మూడు బడ్జెట్‌లలో ఆ మేరకు కోత పడేది సంక్షేమ, అభివృద్ధి పథకాలపైనే. ఇదేమి కొత్తగా జరుగుతున్న వ్యవహారమేమి కాదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి సాగుతున్న తతంగమే. వృద్ధి రేటు 10 – 12 శాతం ఉంటున్నప్పుడు, బడ్జెట్‌లను మాత్రం వాస్తవ వృద్ధి రేటు కంటే రెట్టింపు శాతంతో పెంచి చూపిస్తున్నారు.



ప్రతిపాదిత బడ్జెట్ కంటే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి బడ్జెట్ పరిణామం తగ్గుతుండటానికి ప్రధాన కారణం రాష్ట్ర సొంత పన్ను వనరుల నుంచి అంచనా వేసిన రాబడి రాకపోవడమే. ఆచరణలో ఎలా ఉన్నప్పటికీ తమ వాగ్దానాలకు నిధులను వార్చి పెట్టడం, అలాగే బడ్జెట్‌ను పెంచి చూపడం ద్వారా అధిక రుణాలను సాధించవచ్చని పాలకులు ఆశించటమే ఇందుకు కారణం. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన చిక్కేమిటంటే బిఆర్ఎస్ నుంచి రూ.8లక్షల కోట్లకు పైగా వారసత్వంగా వచ్చిన అప్పులు, కాంట్రాక్టర్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బిల్లుల చెల్లింపు తదితర బకాయిలతోనే అసలు సమస్య. బిఆర్ఎస్ ప్రభుత్వానికి తొలినాళ్ళలో రుణాలను వెంటనే తిరిగి చెల్లించాల్సిన అవసరం రాలేదు. ఫలితంగా, వరుసగా బడ్జెట్, బడ్జెటేతర అప్పులను పెద్ద ఎత్తున చేసుకుంటూ పోయింది. ఆ ప్రభుత్వ హయాంలోని ఆఖరు సంవత్సరాల నుంచే అప్పుల కిస్తీలు, వడ్డీలు పెద్ద ఎత్తున చెల్లించాల్సి రావడంతో పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోయాయి. నిజానికి బిఆర్ఎస్ పార్టీ మూడవసారి అధికారంలోకి వచ్చినా ఇంతకు మించి చేసేదేమీ లేదు. ఈనేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం వెసులుబాటు లేకపోవడంతో పాటు, ఎన్నికల హామీలు తరుముతున్నాయి. జాగ్రత్తగా వాటిని అమలు చేస్తూ ముందుకు సాగుతున్నప్పటికీ, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలను అమలు చేస్తామన్న వాగ్దానం ఫలితంగా ప్రజల నుంచి ఆశలు, ఆకాంక్షలు పెరిగాయి. ఆర్థిక వనరులు తరిగిపోయాయి. అయినప్పటికీ అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, ఆర్థికంగా గడ్డుకాలంలో తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ బండిని ముళ్లబాటలో సాహసయాత్ర సాగిస్తున్నారు.

## పత్తి చేనులో పసికందు



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం వల్ల గొండ గ్రామపంచాయతీ సీతానగర్ శివారులో పత్తి చేనులో పసికందును వదిలివెళ్లిన ఘటన శనివారం కలకలం రేపింది. స్థానికులు ఉదయం పత్తి చేను వైపు వెళ్లగా శిశువు అరుపులు వినిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంచిలో చుట్టి ఉన్న ఆడ శిశువును సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం శిశువును కాగజ్ నగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న బాల సంరక్షణ అధికారి మహేశ్ తన సిబ్బందితో కలిసి ఆసుపత్రికి చేరుకున్నారు. ఒక రోజు వయసున్న ఆ పసికందును మెరుగైన సంరక్షణ కోసం బాల సంరక్షణ కేంద్రానికి తరలించారు. కన్నపేగు బంధాన్ని తెంచుకుని పసికందును అడవి పాలు చేసిన వారిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## రోగులకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



ప్రజాపక్షం / గజ్వేల్ : పేద వర్గాలకు సిఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. శనివారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ కృషి ఫలితంగా పేద రోగులను ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు తెలిపారు. అయితే కార్పొరేట్ వైద్యం పొందే క్రమంలో ఖర్చు అధికంగా ఉంటుండగా, ప్రభుత్వం నామమాత్రపు డబ్బు మంజూరి చేస్తున్నట్లు చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కనీసం సగం ఖర్చు నైనా మంజూరు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు మంగలి పద్మ, షబానా బేగం, పుణ్యావతి, విజయ్ కుమార్, యాదయ్య, ఆలేటి హనుమంత్ రెడ్డి, నేతలు రమేష్, కృష్ణ, రాజు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ ఉత్తమ అధికారిగా నజీర్ ఖాన్

ప్రజాపక్షం/సారంగాపూర్ : ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ''రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అటవీ అధికారిగా'' సారంగాపూర్ ఉప అటవీ క్షేత్రాధికారి ఎండి నజీర్ ఖాన్ ఎన్నికయ్యారు.మార్చ్ 23న తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ దూలపల్లి,హైదరాబాద్ యందు నిర్వహించబడుతున్న కార్యక్రమంలో గౌరవ అటవీ శాఖ మాత్యులు కొండ సురేఖ,అహ్మద్ నదీమ్ ఐఏఎస్,ప్రిన్సిపల్ సెక్రెటరీ,సి.సువర్ణ ఐఎఫ్ఎస్ ప్రధాన అటవీ సంరక్షణ అధికారి(పీసీఎఫ్) చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేయనున్నారు.అటవీ సంరక్షణ,వన్యప్రాణుల సంరక్షణ,అటవీ అభివృద్ధి కార్యక్రమాలు,అనేక అవగాహన కార్యక్రమాలు తద్వారా ప్రజలలో చైతన్యం కలిగించడం,ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026 పక్కడ్బందీగా నిర్వహించడం ఇటీసీ వివిధ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఈ అవార్డు వరించింది.దీంతో అవార్డు స్వీకరించబోతున్న నజీర్ ఖాన్‌కు జిల్లాతో పాటు మండలంలోని అధికారులు ఆయా శాఖ అధికారులు,ప్రజా ప్రతినిధుల అభినందనలు వెల్లువెత్తాయి.

## శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రజాపక్షం/నిజాంసాగర్ : జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, డోంగ్లి మండల కేంద్రాల్లో మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు శనగల కొనుగోలుకేంద్రాలను ప్రారంభించారు. రైతుల నుండి సరైన మద్దతు ధరతో శనగలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు తమ పంటను కొనుగోలుకేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## డిసిసి ఉపాధ్యక్షుడిగా మన్నె విజయభాస్కర్

ప్రజాపక్షం/రేగోడు: మెదక్ జిల్లా రేగోడు మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ మన్నె విజయభస్కర్ కు మెదక్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఉత్తర్వులు జారీచేశారు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అలాగే 1995 నుంచి 2000 వరకు రేగోడ్ సర్పంచ్‌గా సేవలు అందించారు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు గౌడ్ తనపై నమ్మకంతో జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడుగా నియచించడంతో వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు అదృష్టంగా భావించి పార్టీ నాయకులకు అంకితభావంలతో పనిచేస్తానని తెలిపారు.

## పేదల సంక్షేమానికి పెద్దపీట

మాజీ జెడ్‌పిటిసి గోక గణేష్ రెడ్డి



ప్రజాపక్షం/ తలమడుగు : అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలు, విద్యార్థులు, రైతులకు వరం లాంటిదని తలమడుగు మాజీ జెడ్‌పిటిసి గోక గణేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఉండం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్ సామాన్య ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా కల్పించేలా నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. సంక్షేమ రంగంతో పాటు విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించిందని కొనియాడారు. అంతకుముందు ఆయన ఉండం, సుంకిడి గ్రామాల్లోని ముస్లిం సోదరుల నివాసాలకు వెళ్లి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉడుగు రాకేష్, బోస్లే మహేందర్, ఉపసర్పంచ్ రఫీక్, నాయకులు రాంచందర్ దేశముఖ్, గంగారెడ్డి, గంగాధర్, ప్రవీణ్ రెడ్డి, సాంబశివ్, శ్రీనివాస్ రెడ్డి, గంగారం, విలాస్ యాదవ్, నడిపి లింగన్న, అప్సర్, అంజాద్ పాల్గొన్నారు.

# భక్తి ముసుగులో 'చందా' దందా!

నిర్మల్ పట్టణంలో మితిమీరుతున్న వసూళ్ల వేధింపులు



ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ పట్టణం ఒకప్పుడు సాంస్కృతిక వైభవానికి, ప్రశాంతమైన వేడుకలకు నిలయం. కానీ రానురాను ఇక్కడ పండుగ వస్తుందంటే చాలు,సామాన్యుడిలో సంతోషం కంటే 'చందా' భయమే ఎక్కువగా కనిపిస్తోంది. వివిధ సంఘాలు,ఉత్సవ కమిటీల పేరుతో వీధుల్లోకి వస్తున్న కొందరు వ్యక్తులు భక్తిని ఒక వ్యాపారంగా మార్చేస్తున్నారు. ఈ వసూళ్ల పర్వం ఇప్పుడు ఏ స్థాయికి చేరిందంటే, ప్రభుత్వ అధికారుల నుండి మొదలుకొని సామాన్య చిరు వ్యాపారుల వరకు ప్రతి ఒక్కరూ వీరి వేధింపులకు బాధితులుగా మారుతున్నారు. పండుగలు సమీపిస్తున్నాయంటే చాలు, పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారవేత్తలు బయటకు రావాలంటేనే జంకుతున్న పరిస్థితి నెలకొంది.ఈ వసూళ్ల దందాను గమనిస్తే,ఇందులో ఒక పద్ధతి ప్రకారం సాగే బ్లాక్ మెయిల్ రాజకీయం కనిపిస్తోంది.ఉత్సవాల పేరుతో రశీదు బుక్కులు పట్టుకుని తిరిగే వ్యక్తులు, తాము అడిగినంత మొత్తం ఇవ్వకపోతే వెంటనే తమ అసలు స్వరూపాన్ని బయటపెడుతున్నారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు, కార్పొరేట్ విద్యాసంస్థలు, ప్రైవేటు ఆసుపత్రులను టార్గెట్ చేస్తూ భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ ఎవరైనా తమ ఆర్థిక పరిస్థితిని వివరించి తక్కువ ఇస్తామంటే,వారిని నలుగురిలో అవమానించడం లేదా వారి సంస్థలకు సంబంధించిన అనుమతులపై రకరకాల ఆరోపణలు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు.''పక్కవారు ఇంత ఇచ్చారు...మీరు అంతకంటే ఎక్కువే ఇవ్వాలి'' అంటూ సాగే ఈ బలవంతపు వసూళ్లు సామాన్య వ్యాపారుల నుండి విరుస్తున్నాయి.

కేవలం ప్రైవేటు వ్యక్తులే కాకుండా,ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులను కూడా ఈ వసూళ్ల రాయుళ్లు వదలడం లేదు.విధి నిర్వహణలో భారీగా సహకరించాలని ఒత్తిడి తెస్తున్నారు.అధికారుల హోదాను బట్టి రేట్లు నిర్ణయించి,ఆ మొత్తం ఇచ్చే వరకు అక్కడి నుండి కదలకపోవడం, ఫోన్ల ద్వారా నిరంతరం వేధించడం పట్టణంలో నిత్యకృత్యంగా మారింది. విరాళం ఇవ్వడం అనేది ఒక వ్యక్తి ఇష్టపూర్వకంగా చేసే పని కావాలి, కానీ నిర్మల్ పట్టణంలో అది ఒక అలిఖిత చట్టంలా, కట్టక తప్పని పన్నులా మారిపోవడం విచారకరం.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పండుగలు కేవలం వసూళ్ల కోసమే నిర్వహిస్తున్నారనే అపవాదు వచ్చే ప్రమాదం ఉంది.ఇప్పటికే పలువురు బాధితులు లోలోపల మదనపడుతున్నా, స్థానికంగా ఉండే ఇబ్బందుల దృష్ట్యా బయటకు వచ్చి ఫిర్యాదు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఈ అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అటు పోలీస్ యంత్రాంగంపై ఇటు జిల్లా యంత్రాంగంపై ఉంది. అనుమతి లేని సంఘాలపై నిఘా ఉంచి, బలవంతంగా చందాలు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే నిర్మల్ పట్టణంలో పండుగలు మళ్లీ పాత వైభవాన్ని సంతరించుకుంటాయి.


## ఘనంగా రంజాన్ వేడుకలు

పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు



ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడలో శనివారం ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ముస్లి సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదిలాబాద్ మండల కార్యదర్శి మహబూబ్ ఖాన్ నివాసానికి వెళ్లి, వారికి రంజాన్ ముబారక్ తెలిపారు. అనంతరం సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ సలీం, చోటు మహబూబ్ ఖాన్, ఇతరులకు పండుగ శుభాంకాక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 30 రోజులు పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి, అల్లాహ్‌ను స్మరిస్తూ ముస్లిం సోదరులు ఈ పవిత్ర పండుగను జరుపుకోవడం అభినందనీయమన్నారు. కేవలం ముస్లింలకే కాకుండా ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని వారు కోరుకోవడం ఈ పండుగ విశిష్టత అని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా సమితి తరపున ముస్లిం మైనారిటీ సోదర సోదరీమణులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు అర్దాంగి రమేష్, కామిలే రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం / కెరమెరి : కెరమెరి మండలంలోని సుర్దాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం కెరమెరి నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న టిఎస్ 01 యుబి 1561 నెంబర్ గల బొలెరో వాహనంపై అనుమానం కలగడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాహనంలో సుమారు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. గ్రామాల్లో ప్రభుత్వ రేషన్ లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేందుకు అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై వాహనం డ్రైవర్ గుర్నులే మధుకర్, యజమాని మహమ్మద్ రియాజ్ ఖాన్ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. రేషన్ బియ్యాన్ని విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, ప్రజలు సహకరించి సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీ మహిళలపై దాడులు, హత్యలు అరికట్టాలి

గోండ్వానా కోయ సంక్షేమ సంఘం


జిల్లా ప్రధాన కార్యదర్శి తలండి మధుకర్



ప్రజాపక్షం / పెంచికలపేట్ : కులహత్యకు గురైన ఆత్రం సమ్మక్కకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పెంచికలపేట్ మండల కేంద్రంలోని ఎస్‌సి కమ్యూనిటీ హాల్ లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తలండి మధుకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఆత్రం సమ్మక్క హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ మహిళలపై వరుస అత్యాచారాలు, అక్రమ రవాణా కేసులు పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేస్తూ ఈ నెల 23న జిల్లా కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ప్రధానంగా నిందితుడు కేర్కరి జలపతితో పాటు అతనికి సహకరించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి 25 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితురాలి తల్లిదండ్రులు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, కొలాం వార్ సేవా సమితి, మన్నెవార్ సేవా సమితి, రాజ్ గోండు సేవా సమితి, తెలంగాణ జన సమితి, అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు, సర్పంచులు, తెగ పెద్దలు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగానికి తగినన్ని నిధులు కేటాయించలేదు

వేల్పూర్ భూమయ్య



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఉగాది ఉత్సవాల సందర్భంగా ఇది రైతునామ సంవత్సరంగా రైతుని రాజుగా చేయడమే మా లక్ష్యమని సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సంతోషమని, రాష్ట్రం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తగినన్ని నిధులు కేటాయించలేదని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అధికార పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు, పిసిసి ప్రెసిడెంట్ జిల్లా వారే ఉన్నా జిల్లాలో కనీసం ఎలాంటి ఆర్థిక కేటాయింపులు లేవన్నారు. జిల్లాలో రెండు చక్కెర ఫ్యాక్టరీలు తెరిపించాలని రైతుల డిమాండ్ చేస్తే దీనిపై అసెంబ్లీలో వేసిన సబ్ కమిటీ తన రిపోర్ట్‌ను ప్రభుత్వానికి అందించిన ఫ్యాక్టరీలను తెలవకపోవటం జిల్లా పట్ల నిర్లక్ష్య వైఖరి తెలియజేస్తుందని, దీంతో పాటు ఆగిపోయిన మంచిప్ప 21 ప్యాకేజీ పునః ప్రారంభించి ఇస్తామని చెప్పిన సిఎం దీనికి ఒక రూపాయి కూడా కేటాయించకపోవటంలో ఏంటని రైతులు అడుగుతున్నారన్నారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థకు ప్రభుత్వం బాకీ పడిన రూ.450 కోట్లు ఇవ్వటంలో రైతు సంవత్సర రైతునామ సంవత్సరానికి అర్థమేమిటని రైతులు అడుగుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని 21 ప్యాకేజీ పనులు ప్రారంభానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రశాంతంగా రంజాన్ పండుగ

వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే రోహిత్ రావు



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లాలో రంజాన్ పండుగను మైనారిటీ సోదరులు భక్తి శ్రద్దలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకొన్నారు. ఉదయం నుంచి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. రంజాన్ పండుగ నేపథ్యంలో చిన్న పిల్లలు పెద్దలు అందరూ ఘనంగా నిర్వహించుకున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, మునిసిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, ముస్లీం మత పెద్దలు, ముస్లీం సోదరులతో కలసి మెదక్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మైనారిటీ సోదరులందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్‌పి డి.వి. శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని నవాబ్‌పేటలోని ఈద్గా వద్ద భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను ఎఎస్‌పి మహేందర్, డిఎస్‌పి ప్రసన్న కుమార్, పట్టణ సిఐ మహేష్ తో కలిసి పరిశీలించారు.

## ముధోల్ నియోజకవర్గానికి నిధులు మంజూరు

సిసిరోడ్లు డ్రైనేజీ కి రూ.17 కోట్ల నిధులు

వివరాలు వెల్లడించిన పవార్ రామరావ్ పటేల్



ప్రజాపక్షం/బైంసా : ముధోల్ నియోజకవర్గంలో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తన కోటాలో రూ.70 కోట్ల నిధులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు.శనివారం బైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు కుంటాల రూ.20 లక్షలు,బుజ్జూర్ రూ.45 లక్షలు, మలేగం రూ.22 లక్షలు,కరెగాం రూ.6 లక్షలు,కనకపూర్ రూ.12 లక్షలు,సుంక్లీ రూ.9లక్షలు,ఓలా రూ.5లక్షలు,చింతల బోరి రూ.1 కోటి, దేగా రూ.15 లక్షలు,మంజీరీ రూ.12 లక్షలు,అంతర్ని రూ.5 లక్షలు ప్రొసీడింగ్ కాపీలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ఆయా గ్రామాల్లో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణానికి 17 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగింది అన్నారు.పొలం బాట ద్వారా 8 కోట్ల రూపాయల నిధులు,మహిళా సమైక్య భవనాలు,గ్రామపంచాయతీ భవనాలకు అంగన్వాడి భవనాలకు 45 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే సమస్యల పరిష్కారం అవుతుందన్నారు.సర్పంచ్‌లు అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.అదే విధంగా పలుమార్లు సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడంతో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు ఇస్తామని ఈ సారి బడ్జెట్లో తెలియజేయడం శుభ సూచకమన్నారు.28 ప్యాకేజీ పనులు పూర్తయితే నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.గత సంవత్సరం గ్రామాల అభివృద్ధికి 100 కోట్ల రూపాయల నిధులు తేవడం జరిగిందని,ఈసారి రూ.70 కోట్ల నిధులు వెచ్చించామన్నారు.మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు,సర్పంచులు సంఘం అధ్యక్షుడు పండితరావు పటేల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.ఎమ్మెల్యే సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని సర్పంచుల సంఘం తరపున కృతజ్ఞతలు చెబుతున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు,మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## మైనార్టీ సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా




ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : మైనార్టీ సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రధాని మోదీ అన్ని మతాల వారికి కేంద్ర పథకాలు అందేవిధంగా చూస్తున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని ఖిల్లా రోడ్డులో గల బిజెపి, మైనార్టీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు ఎండి రషీద్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ సుఖ సంతోషాలు కలగాలని కోరారు. అనంతరం పలువురికి ఈద్ ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మి నారాయణ, కార్పొరేటర్లు మఠం పవన్, చింతకాయల రాజేందర్, బంటు ప్రవీణ్, బళ్ళాల్ శశాంక్, దాంపల్లి శివ, రాంపల్లి మురళి, బిజెపి మైనార్టీ నాయకులు మునీరుద్దీన్, అసద్, మారవార్ కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్‌కు 'పైసల్ లేవ్'

వారం రోజులుగా కదలని జిహెచ్ఎంసి వాహనాలు

ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్త కుప్పలు

అమీన్‌పూర్ సర్కిల్‌లో వింత పరిస్థితి



ప్రజాపక్షం/రాంచంద్రపురం : హైద్రాబాద్ నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంటే అమీన్‌పూర్ మునిసిపల్ సర్కిల్‌లో వింత పరిస్థితులు నెలకొన్నాయి. చెత్త తరలించే వాహనాల్లో డీజిల్ నింపేందుకు పైసలు లేక వారం రోజులుగా మునిసిపల్ కార్యాలయం దాటి బయటకు వెళ్లడం లేదు, వినేందుకు వింతగా ఉన్న ఇదే నిజం, సర్కిల్ పరిధిలో చెత్త తరలించే వాహనాలు రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. వేలల్లో టాక్స్‌లు వసూలు చేస్తున్నా మునిసిపల్ అధికారులకు డీజిల్ పైసలు లేకపోవడం ఏంటంటూ ప్రజలు అవాక్కవుతున్నారు.

**పేరుకుపోయిన చెత్త కుప్పలు..**

అమీన్‌పూర్ మునిసిపల్ సర్కిల్ పరిధిలో గత వారం రోజులుగా చెత్త తరలింపు ప్రక్రియ నిలిచిపోవడం ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తుంది. స్థానిక ప్రజలు శానిటేషన్ సిబ్బందిని చెత్త తరలింపుపై ప్రశ్నించగా వాహనాల్లో డీజిల్ లేక బయటకి రావడం లేదని పేర్కొంటున్నట్లు సమాచారం అమీన్‌పూర్ మునిసిపల్ కార్యాలయం వాహనాలకు డీజిల్ పోయించలేనంత దుస్థితిలో ఉందా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటున్నారు.

**చెత్తతో పరేషాన్ : అనురాధ, బీరం గూడ**

రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం, ఇప్పటికి తీవ్ర దోమల బెడద వేధిస్తుంటే పరిసరాల్లో చెత్త కుప్పలు ఉంటే ఆ సమస్య మరింత పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని అనురాధ బీరం గూడ వాస్తవ్యులు అంటున్నారు.

**విగ్రహాలు పెట్టేందుకు పైసలుంటాయి... కనీస అవసరాలకు లేవా? సుధాకర్‌రెడ్డి, అమీన్‌పూర్**

విగ్రహాలు పెట్టేందుకు పైసలుంటాయి... కనీస అవసరాలకు లేవా?అని సుధాకర్‌రెడ్డి అమీన్‌పూర్ వాస్తవ్యులు ప్రశ్నిస్తున్నారు. వేల కోట్లు ఖర్చు పెట్టి విగ్రహాలు పెట్టడానికి ప్రభుత్వం దగ్గర పైసలుంటాయి కానీ, ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించేందుకు లేకపోవడం సిగ్గుచేటు ,చెత్త కుప్పలు లేని నగరంగా తీర్చి దిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తుతుంటే ఇక్కడి పరిస్థితులు మరోలా ఉన్నాయి.

**చెక్‌లు పెండింగ్‌లో ఉన్నాయి..ఒకటిరెండు రోజుల్లో క్లియర్ అవుతాయి: ఉపకమిషనర్ ప్రదీప్**

చెక్‌లు పెండింగ్‌లో ఉన్నాయని ఒకటిరెండు రోజుల్లో క్లియర్ అవుతాయని అమీన్‌పూర్ ఉపకమిషనర్ ప్రదీప్ తెలిపారు. వాహనాలకు చెల్లించాల్సిన బకాయిల చెక్‌లు హెడ్ ఆఫీస్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. ఒకటి రెండు రోజుల్లో క్లియర్ అవుతాయని, త్వరగా చెల్లింపులు జరిపేలా చర్యలు తీసుకుంటున్నామని వివరణ ఇచ్చారు.

## గల్ఫ్ కార్మికులకు బడ్జెట్‌లో అన్యాయం

ప్రజాపక్షం / జన్నారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎటువంటి నిధులు కేటాయించకపోవడంపై గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య, జన్నారం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని, సంక్షేమ నిధి కేటాయిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని పేర్కొన్నారు. వేలాది మంది కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తక్షణమే ప్రత్యేక గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఇంకా అనేక కుటుంబాలకు ఈ సాయం అందాల్సి ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## యువరైతు ఆత్మహత్య....

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**గల్ఫ్‌నుండి వచ్చాక అప్పులభారంతో చేసుకున్న సంఘటన వీర్నపల్లి మండలంలో చోటుచేసుకుంది.తీవ్రమనోవేధనకు గురై శాంతినగర్‌కు చెందిన గుగులోతు గోపాల్ ఆత్మహత్యకు పాల్పడటం విషాదకరమని స్థానికులు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం మధ్యలోనే ఆగింది.అప్పులు చేసి గల్ఫ్‌వెళ్ళి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు.మానసికంగా ఒత్తిడికి గురై తనమరణానికి కారణం కావడం చర్చనీయంశంగా మారింది,గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి,మృతునికి భార్య నిర్మల,ఇద్దరు కుమార్తెలు కుమారుడు చదువుకుంటున్నారు.భాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని ఎవరైన దాతలు ఉంటే ముందుకు రావాలని గ్రామవాసులు అన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బెజ్జంకి:**ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యేడా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.శనివారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కలు,పొద్దుతిరుగుడు విత్తనాల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ మక్కలు క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.2400,కందులు రూ.8000,పొద్దుతిరుగుడు రూ.7721ను నిర్ణయించినట్లు తెలిపారు.రైతులు దళారులను నమ్మి మోసపోకుండా పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధరను పొందాలని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మెన్ పులి కృష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి,పార్టీ నాయకులు,రైతులుపాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ, ప్రభుత్వవిప్ బల్మూరి వెంకట్‌కు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**ప్రభుత్వ విప్‌గా నియామకమైన అనంతరం తొలిసారి హుజురాబాద్‌కు వచ్చిన ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్‌కు కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. వీణవంక కాంగ్రెస్ నాయకులు చింతల శ్యాం సుందర్‌రెడ్డి, హిమ్మత్‌నగర్ సర్పంచ్ జడల శ్రీకాంత్, తదితరులున్నారు.

## పేదలకు అందని ద్రాక్షలా బడ్జెట్..

సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్

**ప్రజాపక్షం/బెజ్జంకి:**శాసనసభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పేదలకు అందని ద్రాక్షల ఉందని సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.విద్యారంగానికి 20 శాతం డిమాండ్ చేస్తుంటే 8 శాతం మాత్రమే కేటాయించారని అన్నారు.బడ్జెట్‌లో ఔట్ సోర్సింగ్,కాంట్రాక్ట్ ఉద్యోగుల,సింగరేణి కార్మికుల సమస్యలపై ఏలాంటి ప్రతిపాధనలు తెలిజేయలేదని అన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ. 5 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బియ్యాని శివ కుమార్ అధికారికంగా ప్రారంభించారు.రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఈ నిధులను ప్రత్యేకంగా మంజూరు చేయడం జరిగింది. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తున్న మంత్రి కి ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పిట్టల రామస్వామి,వార్డు సభ్యులు బియ్యాని పద్మ, రాజబాబు,జక్కుల చంద్రమౌళి,దార శంకర్,రేకుంట్ల దివ్య, రాణి,రాజు,పెద్దమ్మల గట్టు స్వామి,గసిగంటి సాగర్,గ్రామ ముఖ్య నాయకులు పాల్గొని పనులను పర్యవేక్షించారు.

## కొండగట్టులో కేంద్రమంత్రి సంజయ్ పూజలు



**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజ నేయస్వామి ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్ శనివారం దర్శించుకున్నారు. కరీంనగర్ మేయర్ కొలాగాని శ్రీనివాస్ పలువురు కార్పొరేటర్లతో కలిసి ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు.ఆలయానికి చేరుకున్న బండి సంజయ్ కోనేరు వద్ద నుంచి ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదిక్షినలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రికి శాలువా కప్పి, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు.

## 30న మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు జిల్లా వెంకటేశ్వర్లు, ఏలేటి శ్రీనివాస్ రెడ్డి, పుప్పాల భానుమూర్తి. సంయుక్తంగా తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మార్చి 23, 24 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, 25న స్క్రూటిని, 26న ఉపసంహరణ (విత్‌డ్రా), తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. మార్చి 30, సోమవారం రోజున బార్ అసోసియేషన్ గదిలో ఎన్నికలు నిర్వహించి,అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.బార్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించబడతాయని, ఈ ఎన్నికల్లో మొత్తం 159 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

## ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

# తెలంగాణ రాష్ట్రానికి తలమానికం

రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ తెలంగాణ రాష్ట్రానికి తలమాణికం అని.. రాష్ట్ర ప్రజల కష్టం.. తెలంగాణ భవిష్యత్తు.. ప్రజలకష్టంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక తాను తొలి సంతకం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీపై పెట్టానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. 2023 నుండి టెండర్ల ప్రక్రియ ప్రారంభించి.. డిసెంబర్ 2024 వరకు టెండర్లు జరిగినట్లు తెలిపారు. కేవలం 16 నెలల్లో ఈ ఫ్యాక్టరీని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. శనివారం సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్ అధికారులతో బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం నర్మెట్టలో మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలపై తీవ్ర విమర్శలు చేసి చురకలు అంటించారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ..కూలేశ్వరం అయి న తర్వాత ఇప్పటి వరకు అక్కడి నుండి చుక్కనీరు తీసుకురావటం లేదన్నారు.నర్మెట్టలో నిర్మించిన ఆయిల్‌పామ్ శ్రమఫలితం మాది.. శిలాఫలకం మీదని మాజీ మం త్రి హరీష్‌రావు అర్థం,పర్థం లేకుండ మాట్లాడుతున్నారని చురకలు అంటించారు. పచ్చిగా అబద్ధాలు మాట్లాడుతూ ప్రజల్లో పరువు తీసుకోవద్దని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాజీ మంత్రి హరీష్ రావుకు హితవుపలికారు. రాష్ట్రంలో తెలంగాణ 31 జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఎక్కడ ఆయిల్‌పామ్‌సాగుచేసిన ఆయిల్ ఉత్పత్తి ఇక్కడ నుండి జరుగుతుందన్నారు. ఉత్తర తెలంగాణ మొత్తం ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగుచేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. తెలంగాణ నడిగడ్డ సిద్దిపేట అని రాష్ట్రానికి నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ముఖ్య కేంద్రంగా ఉంటుందన్నారు.ఇక్కడే విజయ్‌బ్రాండ్ ద్వారా ఆయిల్ తయారు చేయటం జరుగుతుందన్నారు. తెలంగాణకే కాకుండ దేశంలో ఏరాష్ట్రానికైన ఇక్కడి నుండి ఆయిల్ పంపిణీ చేయటం జరగుతుందన్నారు. ఆయిల్ గెలలు విక్రయించిన మూడురోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బుల జమచేయటం జరుగుతుందన్నారు. 30 టన్నుల నుండి 120 టన్నుల వరకు క్రషింగ్ సామర్థ్యం కలిగి ఉందన్నారు. పదవులు, అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదన్నారు.పదవు పోయిందని అక్కసు, అసూయతో హరీష్‌రావు నోటికి వచ్చినంత మాట్లాడటం తగదన్నారు. 25 లక్షల రైతులకు ఒకే రోజు 2లక్షల లోపు రూ.21వేల 670 కోట్లు రుణ మాఫీ చేసిన ఘనత దేశ చరిత్రలో సిఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సిఎం రైతులకు రుణమాఫీ చేసిన కనీస జ్ఞానం లేకుండ రుణమాఫీ కాలేదని హరీష్‌రావు మాట్లాడటం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టును,అభివృద్ధి పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వానిదే మంత్రి తుమ్మల అన్నారు. ఈనెల 22న సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్‌పామ్‌ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, సిఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి, సిద్దిపేట నియోజక వర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ,పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు కొండల్ రెడ్డి, డిసిసి అంక్షారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాజకీయ నాయకులకు నిబంధనలు వర్తించవా?

**ప్రజాపక్షం/కోరుట్ల :**ప్లాస్టిక్ ఫ్లెక్సీల (పివిసి) వాడకం పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తోంది. ఇవి పాలివినైల్ క్లోరైడ్ (పివిసి)తో తయారవుతాయి,వీటిలో క్యాడ్మియం, సీసం వంటి విషపూరిత రసాయనాలు ఉంటాయి. ఇవి భూమిలో కలవక, కాల్చితే విష వాయువులు విడుదలవుతాయి. వీటి వల్ల జంతువులకు, పర్యావరణానికి ముప్పు కలుగుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఫ్లెక్సీల వాడకంపై చర్యలు :** ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు నిషేధిత ప్లాస్టిక్ కవర్లపై, ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై దాడులు చేస్తూ, ప్రజల్లో అవగాహన పెంచుతున్నాయి.అయినా కూడా, కొన్ని చోట్ల యథేచ్ఛగా వీటి వాడకం కొనసాగుతోంది.దీనిని నియంత్రించడంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణ నిపుణులు, సామాజిక కార్యకర్తలు,ప్రజలు కోరుతున్నారు.

**ఇష్టానుసారంగా ఫ్లెక్సీల ఏర్పాటు:** రాజకీయ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలో యదేచ్చగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కోరుట్ల మున్సిపల్ అధికారులకు కంటికి కనిపించిన అధికార నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సామాన్య ప్రజలను ప్లాస్టిక్ కవర్లు వాడిన వారిపై జరిమానాలు విధిస్తున్నారు. రాజకీయ నాయకులకు, మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్ లపై ఎంత జరిమానా విధిస్తారో వేచి చూడాల్సి ఉంది.మున్సిపాలిటీలు ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించినా, ఆ చర్యలు అమలు చేయడం లేదు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఫ్లెక్సీల ఏర్పాటులో ఒత్తిళ్లను తీవ్రంగా ఉపయోగిస్తున్నారు.




## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయడమే లక్ష్యమని, సెక్యులర్ పార్టీ ఆయన కాంగ్రెస్ పార్టీకి మైనార్టీలంతా అండగా నిలవాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పిలుపునిచ్చారు. రంజాన్ సందర్భంగా శనివారం జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మసీదులు, ఈద్గాల వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. పేద మైనార్టీలకు ప్రభుత్వం ద్వారా అందించే రుణాలు ఇప్పించడానికి తనవంతుగా సహకరిస్తానని మంత్రి తెలిపారు. ముస్లిం యువతకు ఉపాధి కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.మసీదులు ఈద్గాల వద్ద మౌలిక వసతుల కల్పనకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ హామీ ఇచ్చారు. ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి , వైస్ చైర్మన్ ఇందారపు రామన్న తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగనభట్ల దినేష్,ఉపాధ్యక్షులు వేముల రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

## విద్యారంగానికి అరకొర నిధులు

ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మల్యాల రాకేష్ విమర్శ




**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :**తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించి విద్యను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మల్యాల రాకేష్ ఆరోపించారు. 2026–27 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో శనివారం ఎబివిపిఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మల్యాల రాకేష్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 26,734 కోట్లు కేటాయించడం అనేది కేవలం 7.9 శాతం మాత్రమేనని ఇది సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి కేవలం ప్రగల్భాలు పలుకుతున్నారే తప్పా ఆరచణలో మాత్రం పెట్టడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకుండా పేద విద్యార్థుల భవిష్యత్‌ను అన్యాయానికి గురి చేస్తున్నారన్నారు. గురకులాల పరిస్థితి మరి అధ్వాన్నంగా మారిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సునీల్, నగర కార్యదర్శి నిఖిల్, నాయకులు రాహుల్, కిరణ్, విశాల్, శివ, భాను, రాజు, శశాంక్, చందు ఉన్నారు.

## భారత సైన్యంలో నియామకానికి ఆన్‌లైన్ దరఖాస్తులు

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** భారత సైన్యంలో వివిధ కేటగిరీల్లో నియామకానికి సంబంధించి అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఆన్‌లైన్ నమోదు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని అగ్నివీర్ కేటగిరీల్లో అవివాహిత యువత కోసం నియామక నోటిఫికేషన్ 13 ఫిబ్రవరి 2026న www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో విడుదలైంది. సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ పరిధిలోని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నివాసితుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.నియామకం క్రింది కేటగిరీల లో జరుగుతుందని అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అ గ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నిక ల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (10వ తరగతి), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (8వ తరగతి). అభ్యర్థులు తమ అర్హత ల ఆధారంగా ఏ రెండు కేటగిరీలకు దరఖాస్తు చే సుకోవచ్చు. అగ్నివీర్ కేటగిరీలకు 21 సం నుండి 22 సం పెంచబడిందని ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (సిఈఈ) 13 భాషల్లో తెలుగు సహా నిర్వహించబడుతుంది. ఐటీఐ, డిప్లొమా, ఎన్.సీ.సీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఉంటాయి. దరఖాస్తులు కేవలం www.j oini nd ianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాలి. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 01 ఏప్రిల్ 2026 అని వారు తెలిపారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (సిఈఈ) తాత్కాలికంగా 01 జూన్ 2026 నుండి 15 జూన్ 2026 వరకు నిర్వహించబడుతుంది. అడ్మిట్ కార్డులు అదే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తాజా సమాచారం కోసం www.join indian army.nic.in వెబ్‌సైట్‌ను తరచూ పరిశీలించాలి. తమ నమోదు చేసిన ఈమెయిల్ ఐడీలను చెక్ చేయాలి. మరిన్ని వివరాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్‌ను 04027740059 నంబర్ ద్వారా సం ప్రదించవచ్చు.ఎవరైనా మధ్యవర్తులు లేదా మోసగాళ్లు ఉద్యోగం కల్పిస్తామని చెప్పినా నమ్మవద్దు అధికారులు స్పష్టం చేశారు. కేవలం కష్టపడి సిద్ధమవడం ద్వారా మాత్రమే మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. మధ్యవర్తులు లేదా ఏజెంట్లకు ఇందులో ఎలాంటి పాత్ర లేదు.

## పిఎం జనఔషధి కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**రాష్ట్రంలో మెడిసిన్స్ కొనుగోలు సామాన్య ప్రజలకు భారంగా మారిన నేపథ్యంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ ప్రజలంతా పిఎం జన ఔషధి కేంద్రాలో దొరికే చౌక మందులను వినియోగించుకోవాలని కోరారు. కరీంనగర్‌లోని ముకరంపుర డాక్టర్ స్ట్రీట్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించారు. పేద ప్రజలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. దీంతోపాటు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మెడిసిన్స్ కొనుగోలు చేయాలంటే అత్యంత ఖరీదైన వ్యవహారమైందన్నారు. మెడిసిన్ కొనుగోలు చేసే స్థోమత లేక ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడుతున్న సంధర్బాలు ఎన్నో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల బాధలు, ఆర్థిక కష్టాలు తెలుసు కాబట్టే నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రధానమంత్రి జన ఔషధ కేంద్రాలు తెరిచి చౌక ధరకే మెడిసిన్స్ అందిస్తున్నారని తెలిపారు. తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ మందులు అందించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక మెడికల్ స్టోర్లు అన్నారు. ప్రజలను జనరిక్ మెడిసిన్ వాడకాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం ఈ జన ఔషదీ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు.

## కమిషనరేట్ పరిధిలో బందోబస్తు పర్యవేక్షించిన సిపి



**ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ :**రంజాన్ పండుగ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించినట్టు నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. శనివారం నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని ఈద్గాలు, ప్రధాన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు క్షేత్రస్థాయి నుంచి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత చర్యలను ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ దృష్ట్యా మార్కెట్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో షీ టీములు ద్వారా నిఘా ఉంచడంతోపాటు, సిసి కెమెరాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో శాంతినగర్ ఈద్గాల మదిన ఈద్గాల బోధన్‌లోని నర్సిరోడ్డు ఈద్గాలను పోలీసు కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసిపి ప్రకాష్, బోధన్ ఏసిపి శ్రీనివాస్ రెడ్డి, ఆర్మూర్ ఏసిపి వెంకట రెడ్డి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## శ్రమ మాది.. శిలాఫలకం రేవంత్ రెడ్డిదా?

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు


**ప్రజాపక్షం/సిద్దిపేట:**నేడు సిద్దిపేట జిల్లా లో ప్రారంభించే కార్యక్రమాన్ని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసి,నిధులు కేటాయించి,నిర్మాణాలు పూర్తి చేసినవేనని మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా పర్యాటన నేపథ్యంలో శనివారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఈ రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో సిద్దిపేట నియోజకవర్గానికి కొత్తగా మంజూరైనా కార్యక్రమం ఒక్కటి లేదని నేడు సిద్దిపేటలో ప్రారంభించే కార్యక్రమాలన్నీ బిఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేసి నిర్మించినవేనని అన్నారు.ఆరోగ్య శాఖ మంత్రిగా నాడు నేను మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలకు ముఖ్యమంత్రి నేడు రిబ్బన్ కటింగ్ చేస్తున్నారని అన్నారు.దేవాలయాలు,విద్యాలయాలతో పాటు 78 కోట్లతో 30 ఎకరాల స్థలంలో జిల్లా జైలును నిర్మించింది కూడా మేమేనని అన్నారు.కేవలం రాజకీయ కక్షతో రద్దు చేసిన పనులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## అడవులే జీవానికి ఆధారం...

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**అడవులే భూమిపై ఉన్న అన్ని జీవాలకి ఆధారం అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ అటవీ దినోత్సవ కార్యక్రమాకి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అడవులను కాపాడుకుంటేనే మానవ జాతికి మనుగడ ఉంటుందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా అడవులను సంరక్షించుకోవాలని కోరారు. అడవులను అంతం చేయడం ద్వారా వన్యప్రాణులు కనుమరుగు అవుతాయని, పర్యావరణ కాలుష్యంతో అనారోగ్యాల భారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. వేసవి కాలంలో ఏవరైన అడవులకు నిప్పు అంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో కలిసి కేక్ కట్ చేసి వారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జక్కుల నరేష్, వార్డు సభ్యులు పద్మయ్య, సంజీవ్, దేవలక్ష్మి, నారాయణ, లావణ్య, నాగరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కిరణ్, సతీష్, శ్రీకాంత్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

## పాలసీ లేని ప్రజా పాలన

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



**ప్రజాపక్షం/కోరుట్ల:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన అత్యవసర పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ప్రజలకు కనీస పెన్షన్లు సకాలంలో అందించలేని ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేస్తామని చెప్పడం పూర్తిగా అవాస్తవమని ఆయన విమర్శించారు. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు నిలిపివేసి, ఇప్పుడు వాటినే రాజీవ్ వికాస్ యోజన పేరుతో బ్రేక్‌ఫాస్ట్ పథకం, భీమా పథకాలు వంటి వాటిని కొత్తగా ప్రవేశపెట్టినట్లు చూపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నరని ఆరోపించారు.ఈ పథకాల కోసం రూ.6000 కోట్ల బడ్జెట్ కేటాయించినప్పటికీ ప్రజలకు లాభం ఏమీ జరగలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ డిక్లరేషన్ల గురించి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు . ప్రభుత్వానికి స్పష్టమైన పాలసీ లేకుండా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అనే పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. రైతులు, ఉద్యోగులు,బిసిలు, జర్నలిస్టులుఏ వర్గానికీ ప్రస్తుత పరిస్థితుల్లో ఉపశమనం లేకుండా అన్ని రంగాలు కుదేలయ్యాయని తెలిపారు. తెలంగాణ అప్పులపై కూడా ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించిన ప్రకారం 2023 నాటికి రాష్ట్ర అప్పు సుమారు రూ. 3.4 లక్షల కోట్లు మాత్రమేనని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6–7 లక్షల కోట్లు అంటూ అబద్ధాలు చెబుతోందని విమర్శించారు. "నిజం బూట్లు వేసుకునేలోపే అబద్ధం ప్రపంచం చుట్టేస్తోంది" అన్నట్లుగా పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.ప్రభుత్వం నెలకు సుమారు రూ. 7 వేల కోట్లు అప్పులు చెల్లిస్తున్నట్లు ప్రచారం చేయడం పూర్తిగా అబద్ధమని,వాస్తవానికి కేవలం రూ. 1500 కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారని ఆయన అన్నారు. ఇక భారీ ప్రాజెక్టుల పేరుతో కూడా ప్రజలను మభ్యపెడుతున్నారని, గతంలో ప్రతిపాదించిన ఫార్మా సిటీ వంటి ప్రాజెక్టులను ఇప్పుడు "ఫ్యూచర్ సిటీ" పేరుతో మళ్లీ ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పనపై స్పష్టత లేదని తెలిపారు.ఇటీవల రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ, జీవన్ రెడ్డి మంచి నాయకుడని, అటువంటి నాయకుడు తమ పార్టీలోకి రావాలనుకుంటే ఘనంగా స్వాగతిస్తామని కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దారిశెట్టి రాజేష్,జాల వినోద్, మొహమ్మద్ సజ్జు,బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఈ సీజన్ మరింత కఠినం : విరాట్ కోహ్లీ



పదైనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత ఐపిఎల్ ట్రోఫీ అందుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అదే ఉత్సాహంతో రెండో ట్రోఫీపై కన్నేసింది. పంతొమ్మిదో సీజన్ సన్నాహకాలను ఇప్పటికే ప్రారంభించిన ఆర్‌సిబి. డిఫెండింగ్ ఛాంపియన్ గా అడుగుపెట్టనుంది. ఇంకేముంది.. నిరుడు లెక్కన్లే చెలరేగిపోవాలని బెంగళూరు ఫ్రాంచైజీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ సహచరులను ఉద్దేశించి కీలక హెచ్చరికలు చేశాడు. ఐపిఎల్ 19వ సీజన్ మినీ వేలంలో ఆర్‌సిబి కొన్న ఆటగాళ్లంతా స్క్వాడ్‌లో చేరారు. ఈ సందర్భంగా యాజమాన్యం, కోచ్ ఆండీ ఫ్లవర్ విరాట్‌ను స్వాగతం పలికారు. అనంతరం మాజీ కెప్టెన్ విరాట్‌కోహ్లీ వారితో మాట్లాడా.. ఎప్పటిలానే తన స్టయిల్లో స్ఫూర్తి రగిలించాడు. ఆర్‌సిబి సన్నద్ధత గురించి మాట్లాడిన విరాట్ ఈసారి తమకు ఎదురయ్యే సవాళ్లను వివరించాడు. ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్నందున ఈసారి కఠిన సవాళ్లు ఎదురవుతాయని.. మరింతగా కష్టపడాల్సిందేనని విరాట్ అన్నాడు. 'గత రెండు మూడు సీజన్‌లుగా మేము ఎంతో శ్రమించాం. ఆకష్టానికి ఫలితంగా నిరుడు ఐపిఎల్ ట్రోఫీని సాధించాం. పంతొమ్మిదో సీజన్ మనకు చాలా కఠినంగా ఉండనుంది. ఎందుకంటే.. డిఫెండింగ్ ఛాంపియన్‌షిప్‌మైన మనల్ని ఓడించేందుకు అన్ని జట్లు తమవైన వ్యూహాలతో సిద్ధంగా ఉన్నాయి. సో.. మనం ఈ కీలకమైన రోజులను వృథా చేయొద్దు. మనం అందరికంటే ముందుండాలి కాబట్టి.. అందరూ సిద్ధంగా ఉండాలి. ఈ రెండున్నర నెలలు మనం 120శాతం కష్టపడాలి. ఛాలెంజర్స్‌గా మనం గర్వపడుతున్నామనేది ప్రతిఒక్కరి ముఖంలో స్పష్టంగా కనిపించాలి' అని కోహ్లీ సహచరులను చైతన్యం చేసిన వీడియోను ఫ్రాంచైజీ ఎక్స్‌లో పెట్టింది. ఐపిఎల్ ఆరంభం నుంచి ఆర్‌సిబికి మాత్రమే ఆడుతున్న కోహ్లీ నిరుడు తనకలను సాకారం చేసుకున్నాడు. సారథిగా తనవల్ల కానిన్నా.. రజత్ పాటిదార్ నేతృత్వంలో చెలరేగి ఆడిన విరాట్ 18ఏళ్లుగా ఊరిస్తున్న ఐపిఎల్ ట్రోఫీని అందుకున్నాడు. తొలి సీజన్ నుంచి నిలకడగా రాణిస్తున్న అతడు 8 శతకాలతో, 63 అర్ధ శతకాలతో ఐపిఎల్ కింగ్‌గా అవతరించాడు. ఇప్పటివరకూ 267మ్యాచుల్లో 8,661 పరుగులు చేసిన విరాట్..9వేల పరుగులకు చేరువలో ఉన్నాడు. మార్చి 28న జరుగనున్న ఆరంభ పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బెంగళూరు తలపడనుంది.

## కోల్‌కత్తాకు వరుసగా షాకిస్తున్న పేసర్లు



పంతొమ్మిదో సీజన్ ఐపిఎల్ ఆరంభానికి ముందే కోల్‌కత్తా నైట్ రైడర్స్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ జట్టు ఫాస్ట్ బౌలర్లు ఒక్కొక్కరుగా గాయాల పాలవుతున్నారు. ఇప్పటికే హర్షిత్ రానా, మథీశ పథిరనలు టోర్నీకి దూరమవ్వగా.. ఆకాశ్ దీప్ సైతం గాయం కారణంగా మెగా టోర్నీ నుంచి వైదొలిగాడు. దాంతో.. కోల్‌కత్తా పేస్ దళం దాదాపుగా ఖాళీ అయింది. ఇప్పటికే రానా, పథిరన స్థానంలో ఎవరిని తీసుకోవాలి? అని మల్లగుల్లాలు పడుతున్న ఫ్రాంచైజీకి ఇప్పుడు ఆకాశ్‌కు ప్రత్యామ్నాయం వెతకడం పెద్ద తలనొప్పిగా మారింది. ఐపిఎల్ పండుగకు ముందే ఫ్రాంచైజీలను గాయాలు వెంటాడుతున్నాయి. ఫలితంగా పలు జట్లు ప్రధాన పేసర్ల సేవలను కోల్పోతున్నాయి. అన్నిటికంటే ఎక్కువగా కోల్‌కత్తా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీని ఆటగాళ్ల గాయాలు కలవరపరుస్తున్నాయి. గత మూడు సీజన్లలో పేస్ భారం మోస్తున్న హర్షిత్ రానా మోకాలి గాయంతో దూరమవ్వగా.. వేలంలో రూ.కోట్లు కొల్లగొట్టిన మథీశ పథిరన ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆకాశ్ దీప్ ఉన్నాడులే అనుకున్న యాజమాన్యానికి పెద్ద షాకే తగిలింది. ఈమధ్య కాలంలో మైదానంలో కంటే రిహాబిలిటేషన్ సెంటర్లోనే ఎక్కువగా గడుపుతున్న ఆకాశ్ దీప్ ఐపిఎల్ ఆరంభానికి ముందే మరోసారి గాయపడ్డాడు. నిరుడు అబుధాబీలో జరిగిన మినీ వేలంలో రూ.1 కోటి పలికిన ఈ పేసర్ సైతం గాయంతో ఐపిఎల్ నుంచి నిష్క్రమించాడు. ఈ విషయాన్ని 'క్రిక్‌బజ్'తో కోల్‌కత్తా ఫ్రాంచైజీ అధికారి ఒకరు ధ్రువీకరించారు. 'దురదృష్టవశాత్తూ ఐపిఎల్ నుంచి ఆకాశ్ దీప్ వైదొలిగాడు' అని ఆయన చెప్పారు. దాంతో.. ఇప్పుడు కోల్‌కత్తా పేస్ దళంలో కొత్తగా వచ్చిన బ్లెస్సింగ్ ముజరబానీపై బౌలింగ్ భారం పడనుంది. 19వ సీజన్ తొలి పోరులో మార్చి 29న ముంబై ఇండియన్స్‌తో కోల్‌కత్తా తలపడనుంది.

## తొలి మ్యాచ్‌లోనే రికార్డు సెంచరీ

### చరిత్రను తిరగరాసిన పదిహేనేళ్ల అమ్మాయి!



పొట్టి క్రికెట్‌లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు తమ తడాఖా చూపిస్తున్నారు. తమదైన పవర్ హిట్టింగ్‌తో ఈతరం మహిళా క్రికెటర్లు తొలి మ్యాచ్‌లోనే రికార్డులు బద్ధలు కొడుతున్నారు. అరంగేట్రంలో అదిరే ఆటతో శతకంతో చరిత్ర సృష్టించింది పదిహేనేళ్ల అమ్మాయి. రువాండా జట్టు తరఫున మెరుపు ఇన్నింగ్స్‌లో సెంచరీ బాదిన ఫాన్నీ ఉతగ్నీమనిండే నయా రికార్డు నెలకొల్పింది. 'గల్లీ చిన్నది గరీబోళ్ల కథ పెద్దది' అన్నది అన్నట్టు.. చిన్న దేశానికి చెందిన ఫాన్నీ ఉతగ్నీమనిండే చరిత్రను లిఖించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో తన ఆగమనాన్ని ఘనంగా చాటుతూ తొలి మ్యాచ్‌లోనే వంద కొట్టేసింది. శనివారం ఘనా జట్టుపై సునామీ ఇన్నింగ్స్ ఆడిన ఫాన్నీ.. 65 బంతుల్లో 111 పరుగులతో అజేయంగా నిలిచింది. టి–20ల్లో మొట్టమొదటి మ్యాచ్‌లోనే వంద కొట్టిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచిన తను.. మహిళల టి–20ల్లో మూడంకెల స్కోర్ కొట్టిన చిన్న వయస్కురాలిగా మరో రికార్డు తన పేరిట రాసుకుంది. తూర్పు ఆఫ్రికాలోని రువాండా క్రికెట్‌లో కొత్త తార పుట్టుకొచ్చింది. ఫాన్నీ ఉతగ్నీమనిండే విధ్వంసక ఆటతో అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో శతకంతో రెచ్చిపోయింది. 15 ఏళ్ల 223 రోజుల వయసులో పొట్టి క్రికెట్‌లో అరంగేట్రం చేసిన తను.. ఆకాశమే హద్దుగా చెలరేగి సెంచరీతో కదం తొక్కింది. ఫానీ ధాటికి గతంలో అత్యధిక స్కోర్ (96 నాటౌట్)తో రికార్డు నెలకొల్పిన కరెన్ రోల్టన్(ఇంగ్లండ్) రెండో స్థానానికి పడిపోయింది. అరంగేట్రంలోనే 90 పరుగులు చేసిన స్టెఫానీ మూడో స్థానంలో కొనసాగుతోంది.

# బిజినెస్

## పోర్ట్‌ఫోలియోల సర్దుబాటు..

ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున (మార్చి 31), మార్కెట్లలో ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. ఈ కాలంలో సాధారణంగా సంస్థాగత పెట్టుబడిదారులు తమ పోర్ట్‌ఫోలియోలను సర్దుబాటు చేసుకుంటారు. లాభనష్టాలను బేరీజు వేసుకుంటా రు. దీనివల్ల మార్కెట్‌లో అసాధారణ చలనం ఉండొచ్చు, కానీ అది తప్పనిసరిగా దీర్ఘకాల దిశను సూచించదు. వచ్చే వారం మార్కెట్‌పై అంచనా వేయాలంటే, మూడు కీలక అంశాలు పరిశీలించాలి. మొదట, గ్లోబల్ పరిణామాలు. ఇరాన్ యుద్ధం మరింత విస్తరించుతుందా లేదా నియంత్రణలోకి వస్తుందా? అన్నది ప్రధానంగా ప్రభావితం చేస్తుంది. రెండవది, చమురు ధరల దిశ. బ్రెంట్ క్రూడ్ మళ్లీ 110–120 డాలర్ల స్థాయికి చేరితే, భారత మార్కెట్లు ఒత్తిడికి గురవుతాయి. ఒకవేళ, 90–100 డాలర్ల మధ్య స్థిరపడితే, మార్కెట్‌కు మద్దతు లభిస్తుంది. మూడవది, దేశీయ పోర్టిఫోలియోల కొనుగోళ్లు కొనసాగితే, మార్కెట్ పడిపోవడం పరిమితమవుతుంది. ఈ ఆధారంగా చూస్తే, వచ్చే వారం మార్కెట్ పూర్తిగా కూలిపోవడం కంటే, ఒక పరిమిత పరిధిలో ముందుకు కదిలే అవకాశం ఎక్కువ. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు స్వల్ప లాభనష్టాలతో ఊగిసలాటలో ఉండవచ్చు. అయితే నెలాఖరు కారణంగా కొన్ని రోజుల పాటు అకస్మాత్తుగా పెరుగుదల లేదా పతనం కనిపించే అవకాశం ఉంది. దీనిని 'విండో డ్రెస్సింగ్' లేదా 'పోర్ట్‌ఫోలియో బాలెన్సింగ్' ప్రభావంగా చూడాలే తప్ప దీర్ఘకాల ట్రెండ్‌గా కాదు. మొత్తానికి, భారత మార్కెట్లు ప్రస్తుతం గ్లోబల్ ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని చూపుతున్నాయి, కానీ ఇది పూర్తిస్థాయి భద్రత కాదు. పరిస్థితులు వేగంగా మారే అవకాశాన్ని ఎప్పటికప్పుడు గుర్తుంచుకోవాలి.



### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 74,582.96 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 74,532.92 పాయింట్లు. నష్టం 30.96 పాయింట్లు).

జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ/ క్లోజింగ్): నిఫ్టీ 23,114.50 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 23,151.10 పాయింట్లు. నష్టం 36.60 పాయింట్లు).

## కోలుకున్న స్టాక్ మార్కెట్లు

### స్వల్ప నష్టంతో బయటపడిన వైనం



**ముంబయి :** గత వారం భారీగా నష్టపోయిన భారత స్టాక్ మార్కెట్లు ఈ వారం కోలుకున్నాయి. గత వారం సెన్సెక్ 4,354.98 పాయింట్లు, నిఫ్టీ 1,299.35 పాయింట్లు చొప్పున నష్టాలను చవిచూసిన విషయం తెలిసిందే. అయితే ఈవారం అంతటి నష్టాలను ఎదుర్కోకుండా, స్వల్ప పతనంతో బయటపడింది. గతవారం భారత మార్కెట్లు, ప్రపంచ వ్యాప్తం గా అనిశ్చితి, ముఖ్యంగా ఇరాన్ యుద్ధం, చమురు ధరల పెరుగుదల, గ్లోబల్ మార్కెట్లలో వచ్చిన కుదుపుల ప్రభావాన్ని ప్రతిబింబించాయి. అయి తే ఈవారం అదే మార్కెట్లు స్వల్ప నష్టంతో ముగియడం, భారత మార్కెట్లలో ఒక రకమైన స్థిరత్వాన్ని సూచిస్తుంది. ఇది యాదృచ్ఛికం కాదు. దీని వెనుక పలు నిర్మాణాత్మక కారణాలు ఉన్నాయి. మొదటగా, గత వారం జరిగిన భారీ పతనం ఇప్పటికే షాక్ అబ్జార్షన్ పాత్ర పోషించింది. అంటే, పెట్టుబడిదారులు గ్లోబల్ రిస్క్‌ను ముందుగానే ధరల్లో ప్రతిబింబించడంతో, ఈవారం కొత్తగా పెద్ద గా ప్రతికూల ప్రభావం చూపలేదు. రెండవది, భారత ఆర్థిక వ్యవస్థలో అంతర్గత డిమాండ్ బలంగా ఉండటం. అమెరికా, యూరప్ మార్కెట్లు బాహ్య పరిస్థితులపై ఎక్కువగా ఆధారపడితే, భారత్‌లో వినియోగం, బ్యాం కింగ్, సేవల రంగా లు అంతర్గతంగా నడుస్తాయి. అందువల్ల గ్లోబ ల్ షాక్ వచ్చినా, అది పూర్తిగా మార్కెట్‌ను కూలదోసే స్థాయికి చేరడం కష్టమవుతుంది. మూడవది, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు కొంతవరకు విక్రయా లు చేసినప్పటికీ, దేశీయ సంస్థాగత మదుపరు లు మార్కెట్‌ను సపోర్ట్ చేశారు. ఇది భారత మార్కెట్ నిర్మాణంలో వచ్చిన ఒక కీలకమార్పు. ముందుగా మార్కెట్లు పూర్తిగా విదేశీ పెట్టుబడులపై ఆధారపడి ఉండేవి. ఇప్పుడు దేశీయ నిధులు సమతుల్యతను కల్పిస్తున్నాయి. నాలుగవది, చమురు ధరలు మొదట భారీగా పెరిగినా, తరువాత కొంత తగ్గడం వల్ల భయాందోళనలు తగ్గాయి. భారత్ చమురు దిగుమతులపై ఆధారపడే దేశం కావడంతో, ధరలు స్థిరపడటం మార్కెట్‌కు ఊరటనిచ్చింది. అయితే ఇక్కడ ఒక సాధారణ అభిప్రాయాన్ని పరిశీలించాలి: మార్కెట్ పడిపోలేదంటే పరిస్థితి సురక్షితంగా ఉంది అని భావించడం సరైందికాదు. వాస్తవానికి, ఈ స్థిరత్వం ఒక తాత్కాలిక సమతుల్యత మాత్రమే కావచ్చు.

## కలవరపెడుతున్న రూపాయి పతనం



ఫోరెక్స్ మార్కెట్‌లో డాలర్‌కు రూపాయి మారకపు విలువ ఈశుక్రవారం (మార్చి 20) గతంలో ఎన్నడూ లేనంతగా 64 పైసలు కోల్పోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. డాలర్‌కు రూపాయి మారకడం 93.53గా ఉంది. ఫోరెక్స్ చరిత్రలోనే ఇది కనిష్ఠ స్థాయి. పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు గణనీయంగా పెరగడం, అలాగే విదేశీ నిధుల నిరంతర నిష్క్రమణ రూపాయి పతనానికి కారణమయ్యాయి. ట్రేడర్ల ప్రకారం, చమురు ధరల పెరుగుదల, పెట్టుబడిదారులు రక్షణాత్మక విధానాలను అనుసరించడం వల్ల రూపాయి తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అదనంగా, భౌగోళిక అనిశ్చితి కారణంగా ఇంధన వ్యయాలు పెరుగుతూ ఉండటం వాణిజ్య లోటును విస్తరించడమే కాకుండా ద్రవ్యోల్బణ ఒత్తిడులను పెంచవచ్చని నిపుణులు అంటున్నారు. ఇంటర్ బ్యాంక్ విదేశీ మారక మార్కెట్లో రూపాయి 92.92 వద్ద ప్రారంభమై, తొలిసారిగా 93మార్క్‌ను దాటి, రోజంతా క్షీణిస్తూ చివరకు 93.53 వద్ద ముగిసింది. ఇది గత ముగింపుతో పోలిస్తే 64పైసల నష్టం. అం తకుముందు బుధవారం (మార్చి18) కూడా రూపాయి 49 పైసలు పడిపోయి 92.89 వద్ద ముగిసింది.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలని

## సింగరేణి పోరు జాతా


### ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో మార్చి 18 నుంచి 30 వరకు గోలేటి నుండి కొత్తగూడెం వరకు జరిగే సేవ్ సింగరేణి పేరుతో ఏర్పాటు చేసిన పోరు జాతా మార్చి 22 న గోదావరిఖనికి చేరుకుంటుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ తెలిపారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర నాయకత్వం సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించిందని, అందులో భాగంగా మార్చి 17 న గనులు డిపార్ట్మెంట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. మార్చి 18 నుంచి 30 వరకు సేవ్ సింగరేణి పోరు జాత సింగరేణి వ్యాప్తంగా నిర్వహించి హెడ్ ఆఫీస్ ముందు వంట వార్పు కార్యక్రమం జరుగుతుందన్నా రు. సమావేశంలో ఎఐటియుసి కేంద్రకార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్ మాట్లాడగా, సంకె అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో అన్ని విభాగాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## 31న కొండిగారి రాములు సంతాపసభ

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఈనెల 31న ఇబ్రహీంపట్నంలో సిపిఐ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సంతాప సభ జరుగుతుందని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ కొండిగారి రాములు సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోని సిపిఐ శ్రేణులు ఉద్యమించాలన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించే సంతాప సభకు సిపిఐ కార్యకర్తలు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. క్యార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహ్మా, ఓరుగంటి యాదయ్యగౌడ్, పి.శివకుమార్, కావలి సురేష్, పి.నీలమ్మ, కాటంరాజు, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువులు దూరం చేసేలా రాష్ట్ర బడ్జెట్

### ఎఐఎస్ఎఫ్ నిరసన... బడ్జెట్ ప్రతులు దహనం



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** విద్యారంగ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని, ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమేనని ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక గీతాభవన్ చౌరస్తాలో ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22 శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందని తెలిసిందన్నారు. 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సరానికి 8.22 శాతం మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల ఫీజు బకాయిలుంటే కేవలం నాలుగు వేల మూడువందల కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నునావత్ శ్రీనివాస్ నాయక్, నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, నగర సహాయ కార్యదర్శి బోయిని విష్ణువర్ధన్, సంపత్, సాయికృష్ణ, అశోక్, అభి తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగంపై నిర్లక్ష్యం..

**నిర్మల్ టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపడాన్ని నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాష్ మాట్లాడుతూ బడ్జెట్ పేద విద్యార్థులను చదువులకు దూరం చేసేలా ఉందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అస్లాం, గణేష్, పవన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### బడ్జెట్‌లో విద్యకు మొండిచెయ్యి

**భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించి బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించకుండా మొండి చెయ్యి చూపిందని ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి వరక అజీత్ ఆరోపించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ ప్రకటించిన బడ్జెట్‌లో విద్యారంగా కేవలం 8.22 శాతం మాత్రమే కేటాయింపులు చేశారని, ఎన్నికల సమయంలో 15 శాతం నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలకోట్ల స్కాలర్‌షిప్‌ల బకాయిలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి సరైన నిధులు కేటాయించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కొన్ని విశ్వవిద్యాలయాలకు భారీగా నిధులు కేటాయిస్తూ మరికొన్నింటిని విస్మరించడం సరైంది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్భాగాంధీ పాఠశాలలు, డిగ్రీ కళాశాలలకు నిధులు లేకపోవడం ఆందోళనకరమన్నారు. విద్యారంగానికి కనీసం 30 శాతం నిధుల కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, నాయకులు కళ్యాణ్, మహేష్, నవీన్, ప్రణయ్, దలీప్, రాజు, సుదీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** విద్యార్థులకు చదువులను దూరం చేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాంనాయక్ అన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా పుస్తకాలు పట్టుకుని చెవుల్లో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రఘురాంనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్యానికి నిధులు కేటాయించకుండా రాష్ట్ర అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ బడులలో సంక్షేమ హాస్టల్లో జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీ స్థాయిలలో అభివృద్ధికి ఈ నిధులు ఏమాత్రం సరిపోదని ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేసేలా ఈ ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి మాత్రం పెట్టడం లేదన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుభోధ్, ఉపాధ్యక్షులు కుశాల్‌దేవ్, నాయకులు రంజిత్, శివ, కమల్, ఈశ్వర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## పేదల ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం 22ఎ జాబితాలో చేర్చిన పేదల ఇళ్ల స్థలాలను ఆ జాబితా నుంచి తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం వేములకొండ మత్యాద్రి ఫంక్షన్ హాల్‌లో నరిగె యాదయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని యానాల దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 17 మండలాలలో, ఆరు మున్సిపాలిటీలలో అదే విధంగా 422 గ్రామపంచాయతీలలో నిషేధిత జాబితాను ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఇందులో మొత్తం వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చట్టం 1908 ప్రకారంలోని సెక్షన్ 22ఎ పిఒటి చట్టంలో చేర్చారన్నారు. ఆ నెంబర్లను భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. ఈ ఇంటి స్థలాల భూములు నిషేధితజాబితాలో చేర్చడాన్ని రద్దు చేయాలన్నారు. ఈ భూముల్లో వెనకబడిన వర్గాలకు చెందినవారు ఇండ్లు నిర్మించుకొని నివసిస్తున్నారని, వాటికి ఇంటి పన్ను, విద్యుత్, తాగు నీటి కనెక్షన్లు ఉన్నాయని బిల్లులు క్రమంగా చెల్లిస్తున్న వారిని క్రయ విక్రయాలు జరగకుండా ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చడంతో వారు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ భూములలో గుడిసెలు నిర్మించుకున్న వారికి తక్షణమే పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఎలగందుల అంజయ్య, ఎల్లంకి మహేష్, బొడిగ సుదర్శన్, యాస జనార్దన్‌రెడ్డి, కట్ల యాదగిరి, బత్తుల బిక్షపతి, మారోజు నరసింహ చారి, సలిగంజి కృష్ణ కుమార్, పోషనబోయిన బొందయ్య పాల్గొన్నారు.

## కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మె విరమణ

### ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ ఉపేందర్



**ప్రజాపక్షం /రెబ్బెన :** సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో గత నాలుగు రోజులుగా ఎఐటియుసి ఆధ్వర్యంలో కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె విరమించారు. హక్కుల సాధన కోసం డ్రైవర్లు, క్లీనర్లు చేస్తున్న ఈ సమ్మెను విరమిస్తున్నట్లు ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ శనివారం గోలేటిలో వెల్లడించారు. యాజమాన్యంతో జరిగిన చర్చల్లో డ్రైవర్లకు 22,000 రూపాయలు, క్లీనర్లకు 11,000 రూపాయలు చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు. వేతన పెంపుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి అంగీకారం కుదరడంతో సమ్మె విరమించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నూతన ఒప్పందం ఏప్రిల్ 1, 2026 నుండి మార్చి 31, 2028 వరకు రెండు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని వివరించారు. సమ్మె విజయవంతానికి సహకరించిన సింగరేణి, టిటిసి యాజమాన్యాలకు, పోలీసు విభాగంతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# నయా మట్టి దందా..

కొత్త ఎత్తుగడలతో అక్రమ తవ్వకాలు, డంపింగ్‌లు

ఆర్టీఏ పత్రాలు ముగిసిన రోడ్లపైనే లారీలు

కస్నాతండాలో తవ్వకం వరంగల్‌హైవే పక్కన డంపింగ్

చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలో మట్టి దందా కొత్త రూపం దాల్చింది. ఎటువంటి అనుమతులు లేకుండా రైతుల బీడుల్లో అక్రమంగా తవ్వి, అడ్డగోలు డంపింగ్‌లు చేసుకుంటున్నారు. అక్కడి నుంచి యథేచ్ఛగా పెద్ద పెద్ద మాన్ల ద్వారా గృహాలు, వెంచర్లకు తోలుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాలో అధికారుల అనుమతుల మాటను కాసేపు పక్కన పెడితే. అంతకంటే ప్రమాదకరమైన ఓ అంశం వెలుగులోకి వస్తుంది. రోడ్లపై తిరుగుతున్న వాహనాల్లో చాలా వాటికి బ్రేక్, ఇన్సూరెన్స్, ఇలా సరైన పత్రాలు లేకపోయినా ఇష్టానుసారంగా సంచరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఒక వేళ జరగరాని ఘటన సంభవిస్తే, ప్రమాదానికి గురైన వారికి ఎలాంటి సహాయం అందక ఏకాకులుగా మారే పరస్థితులు ఏర్పడే అవకాశముందని, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని కట్టడి చేసేందుకు మైనింగ్ శాఖ ఉన్నప్పటికీ మామూలుగా తీసుకుంటూ మిన్నకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దందాకు కొందరు అధికారుల ప్రమేయం ఉన్నట్లుగా గుసగుసల వినిపిస్తున్నాయి.

**ఆర్టీఏ నిబంధనలకు చెల్లు చీటీ...**

మట్టి రవాణాలో ఉపయోగిస్తున్న అనేక వాహనాలు ఆర్టీఏ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానమైన ఇన్సూరేన్స్‌తో పాటు బ్రేక్, ఫిట్‌నెస్, పర్మిట్ వంటి తప్పనిసరి పత్రాలు గడువు ముగిసినప్పటికీ యథేచ్ఛగా తిరుగుతున్నాయి. సంబంధిత అధికారులు తనిఖీలు చేయకపోవడంతో ఇష్టానుసారంగా రయ్‌రయ్‌మంటూ రోడ్లుపై చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా రాత్రివేళ్లలో పెద్ద సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరస్థితి నెలకొన్నదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇలానే కొనసాగితే ప్రమాదాలు సంభవిస్తే బాధితులకు సరైన పరిహారం అందక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తంమవుతోంది.

**అక్రమ డంపింగ్‌లు...**

మట్టి తవ్వకాల్లో కొత్త దందాకు తెరలేపిన మట్టి వ్యాపారులు. అదే స్థాయిలో మట్టిని దాయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల కళ్లు కప్పాలనే లక్ష్యంతో ఇతర ప్రాంతాల నుంచి మట్టి తెచ్చి అక్రమ డంపింగులకు పాల్పడుతున్నారు. అధికారులు ఎవరైనా ఇదేమిటని అడిగితే తాము మట్టి తవ్వలేదని, చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా కస్నాతండాలో తవ్వి ఏదులాపురం మున్సిపాలిటీ క్రాస్‌రోడ్ సమీపంలోని వరంగల్ హైవే పక్కన ఓ స్థలంలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి యథేచ్ఛగా గృహ అవసరాలు, వెంచర్లకు తరలిస్తున్నారు. అలా ఆటోనగర్‌రోడ్డు గుండా మద్దులపల్లి రెవిన్యూలోని ఓ వెంచర్‌లోకి పగలు, రాత్రి మాన్ల ద్వారా మట్టిని నింపుతున్నారు. ఇందుకు గాను ఒక్కో ట్రిప్‌కి రూ.5వేలు తీసుకుంటుండగా 120 వరకు ట్రిప్పులు తోలినట్లు యజమాని తెలిపాడు. అంటే అక్షరాల ఆరు లక్షల రూపాయల మట్టిని అందులో పోశారు. ఇంకా సుమారు అంతటి స్థాయిలో మట్టి అవసరమవుతుండగా ఈ డంపింగ్ ద్వారా తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాయల్టీ కోల్పోతుందనేది స్పష్టంగా కనిపిస్తోంది.

**మామూళ్ల మత్తులో మైనింగ్ శాఖ...**

అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాల్సిన మైనింగ్ శాఖలోని కొందరు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. దీంతో తవ్వకాలు పగలు, రాత్రి యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సబంధిత మైనింగ్ శాఖ స్పందన లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, డంపింగ్‌లు, రవాణా కొనసాగుతున్నప్పటికీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. తరచూ ఫిర్యాదులు వచ్చినప్పటికీ తనిఖీలు పేరుకే నిర్వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆ తనిఖీల సమయంలోనూ వాహనాలను పట్టుకుని అక్కడే బేరమాడుకుంటున్నట్లు మట్టి వ్యాపారులే గుసగుసలాడుతున్నారు. కాబట్టి ఈ నేపథ్యంలో అక్రమ మట్టి తవ్వకాలపై మైనింగ్ శాఖ నుంచి చర్యలు తీసుకునే అవకాశం లేదనేది తెలుస్తోంది. కాబట్టి జిల్లా కలెక్టర్ స్పందించి మైనింగ్ శాఖను మందలించి మొట్టికాయలు వేస్తే తప్ప తీరు మార్చుకునే పరిస్థితి కనిపించడం లేదు.

## కాంగ్రెస్ కమిటీ నియామకం పట్ల కృతజ్ఞతలు

మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన నూతి సత్యనారాయణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీని ప్రకటించినందుకు టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను నూతి సత్యనారాయణ గౌడ్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా కీలకమైన జిల్లా కాంగ్రెస్ కమిటీని విస్తరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కమిటీలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పించడం హర్షణీయమన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపిలు, ఎంఎల్‌ఎల సలహాలు, సూచనలతో రెండవ జాబితాను తయారు చేసి టిపిసిసికి పంపుతామని అందులో యువకులకు, మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. జిల్లా కమిటీకి సహకరించిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు, ఎంపి, ఎంఎల్‌ఎలకు సత్యనారాయణ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రయాణికులకు వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు శనివారం ఖమ్మం నూతన బస్టాండ్‌లో షాపులను డిపో మేనేజర్ శివప్రసాద్ తనిఖీ చేశారు. బస్టాండ్‌లో ఉన్న కొన్ని షాపుల్లో వాటర్ బాటిల్స్‌ను నిర్ణీత ధర కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ ఎంఆర్‌పి కంటే ఎక్కువ ధరలకు విక్రయించకూడదని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ప్రయాణికులు కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని తెలిపారు.

## సబ్ స్టేషన్ స్థల పరిశీలన



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ స్థలాన్ని శనివారం సర్పంచ్ తుళ్లూరి నిర్మలకుమారి, ఖమ్మం ఎఫ్‌డివో కృష్ణప్రసాద్‌లు పరిశీలించారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించి ఎఫ్‌డివోకు సర్పంచ్ పలు అంశాలను వివరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో జమలాపురానికి 33కెవి విద్యుత్ ఉప కేంద్రం మంజూరైందని సర్పంచ్ తెలిపారు. ఉప కేంద్రాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఏకో టూరిజం పార్కు పక్కన స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించాలని పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. అటవీశాఖ తరుపున ఆ స్థలంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించేందుకు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా చూడాలని సర్పంచ్ నిర్మల కుమారి ఫారెస్ట్ అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో సురేష్‌కుమార్, ఎఫ్‌బివో సత్యకృష్ణ, లింగేశ్వర్, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

## వడగండ్ల వాన

అకాల వర్షం - మొక్క జొన్న రైతులకు నష్టం

కళ్లాల్లో మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతుల హైరానా

ఈదురు గాలులకు అల్లాడిన ప్రజలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. పాల్వంచ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలు లక్ష్మీ దేవిపల్లి మండలంలో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం పడటంతో రైతులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ అకాల వర్షం రైతున్నలకు శాపంగా మారింది. మొక్కజొన్న రైతులతో పాటు మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని పాల్వంచ, లక్ష్మీ దేవిపల్లి మండలాల్లో మొక్కజొన్న పెద్దఎత్తున నేలరాలడంతో రైతాంగానికి నష్ట వాటిల్లింది. పాల్వంచ పట్టణంతో పాటు మండల పరిధిలోని కోడిపుంజుల వాగు పంచాయితీ పూసలతండ, పునుకుల, కరకవాగు, కిన్నెరసాని, లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని ఉమ్మడి రేగళ్ల, బంగారు చెలక పంచాయితీల్లో వడగండ్ల వాన పడటంతో పంటలపై తీవ్ర ప్రభావం పడింది. మరో ప్రక్క జిల్లాలోని పలు చోట్ల రైతులు మర్చి కోసి కళ్లాల్లో ఆరబెట్టారు. అనుకోని వర్షం పడటంతో రైతులు కళ్లాల వద్ద హైరానా పడ్డారు. మర్చిపై బరకాలు కప్పుకుని పంట తవడవ కుండా రక్షించుకునేందుకు ఒత్తిడికి లోనయ్యారు. అకాల వడగండ్ల వాన, ఈదురు గాలులతో నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు

## 265 ఎకరాల్లో పంటనష్టం

అధికారుల నివేదిక



**ప్రజాపక్షం/భద్రాచలం:** జిల్లాలో కులిసిన వండగండ్ల వానతో 7 గ్రామాలకు చెందిన 19 మంది రైతులకు చెందిన 265ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించిన వ్యవసాయశాఖ అధికారులు నివేదికలు అందించారు. పాల్వంచ మండలం పాయకారి యానంబైలు, రాజాపురం గ్రామాల్లో మొ క్కజొన్న పంటను సందర్శించి నష్ట స్థాయినా అంచనా వేశారు. ఈమేరకు ప్రభుత్వానికి నష్ట నివేదికలు పంపించి రైతాంగానికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు తెలిపారు.

## పండుగలు మనుషుల మధ్య ఐఖ్యత పెంచుతాయ్

గంగా-జమునా తెహాజీబ్ సంస్కృతి కాపాడుకుందాం

నిరుపేద ముస్లీం కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత

రంజాన్ ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** రంజాన్ పర్వదినం క్రమ శిక్షణకు, సోదరభావానికి ప్రతీకని, ఈ పండుగ సమాజంలో శాంతిని వెల్లవిరియజేస్తుందని, రంజాన్ కేవలం ముస్లీం సోదరుల పండుగే కాకుండా సమస్త మానవాళికి ఒక సందేశమని కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు మసీదులు, ఈద్గాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొని వారికి పర్వదిన శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని గడపడం గొప్పవిషయం అన్నారు. రంజాన్ మాసం నేర్పిన త్యాగనిరతి, ధాతృత్వం ఏడాది పొడవునా కొనసాగించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని మసీదులు, ఈద్గాలు అదేవిధంగా ఖబరిస్తన్ల అభివృద్ధిపై తనకు ప్రత్యేక దృష్టి ఉందని, వాటి పునః నిర్మాణానికి అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లీం మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ప్రభుత్వం పరంగా అందాల్సిన ఫలాలు ప్రతీ ఒక్క పేదకుటుంబానికి చేరేలా చూస్తామని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో అన్ని మతాల వారు సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, నాయకులు ముత్యాలవిశ్వనాథం, పూర్ణ చంద్రరావు, సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, మైనార్టీ నాయకులు నయూమ్ ఖురేషీ, అబీద్ హుస్సేన్ ఉమర్ ఫరూక్, జహంగీర్, అమీర్ ఖాద్రి, అబుద్ల్ కరీమ్, జుబేర్, జావెద్, కార్పొరేటర్లు సాయిబాబా, విశ్వేశ్వరరావు, బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, జ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

**అసెంబ్లీ సమావేశాల్లో పంట నష్టంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : ఎంఎల్‌ఎ కూనంనేని**

వడగండ్లవాన, ఈదురు గాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని, పంట నష్టంపై తక్షణమే సహాయం అందేలా కృషి చేస్తానని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు రైతాంగానికి హామీ ఇచ్చారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా మొక్కజొన్న పంటకు జరిగిన భారీ నష్టంపై ఆయన శనివారం స్పందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వడగండ్ల వాన, ఈదురు గాలులకు మండలంలో పంట తీవ్రంగా దెబ్బతిన్నదని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుసప్పులు చేసి సాగు చేసిన పంటలు చేతికందే సమయానికి ప్రకృతి కన్నెర్రతో పాడైపోయాయని పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో శాస్త్రీయపద్ధతిలో సర్వే చేపట్టి నివేదికలు ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. రైతులు ఎదుర్కొన్న ఈ సమస్యపై అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖా, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. అన్నదాతలు ఎవ్వరూ అధైర్యపడొద్దని, అండగా ఉంటామన్నారు.



## పంట నష్ట పరిహారం చెల్లించాలి

రైతాంగాన్ని ఆదుకోవాలి : ఎఐకెఎస్

**ప్రజాపక్షం/పాల్వంచ :** అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50 వేయిలు చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధి కోడిపుంజులవాగు పూసలతండా గ్రామంలో శుక్రవారం కురిసిన వడగండ్ల వర్షానికి ధ్వంసమైన మొక్కజొన్న చేలను క్షేత్రస్థాయిలో సిపిఐ నాయకులు, రైతుసంఘం నాయకులు, రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ.. చేతికి వచ్చిన పంట వర్షానికి దెబ్బతినటంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాల్వంచ మండలం ఉల్వనూర్, చంద్రాలగూడెం, రేగులగూడెం, మల్లారం, కోడిపుంజులవాగు, పేటచెరువు తదితర గ్రామాలలో అకాల వర్షం కారణంతో సుమారు 160 ఎకరాల మొక్కజొన్న పంట నేలమట్టం అయిందని తెలిపారు. ములకలపల్లి మండలం, లక్ష్మిదేవిపల్లి మండలం ఉమ్మడి రేగళ్ళ పంచాయితీలో సైతం చేతికొచ్చిన దెబ్బతిన్నదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వైఎస్.గిరి, మండల అద్యక్షులు కొంగర అప్పారావు, అజ్మీరా శ్రీనివాస్, ఆంగోత్ బాలాజీ, జాటోత్ రమేష్, లక్ష్మణ్, గుగులోత్ మోహన్, ఆంగోత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## విషపూరిత సీడ్ మొక్కజొన్న తిని పశువులు మృతి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** తాళ్లపాయి పంచాయితీ పరిధిలోని రింగిరెడ్డిపల్లి, తాళ్లపాయి, బూర్గుకోయ గుంపు గ్రామాలలో విషపూరితంగా మారిన సీడ్ మొక్కజొన్న పంట తిని పలు పశువులు మృతి చెందాయి. గ్రామస్తుల సమాచారం ప్రకారం సుమారు ఐదు పశువులు, నాలుగు గేదెలు, రెండు దూడలు మృత్యువాత పడ్డాయి. సీడ్ మొక్కజొన్న కంకులు విరిచిన తర్వాత వారం రోజులుగా పొలాల్లోనే ఉండగా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అవి విషపూరితంగా మారినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ మొక్కజొన్నను తిన్న పశువులు ఒక్కసారిగా అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో గ్రామాలలో పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఘటనపై విచారణ జరిపి రైతులకు, పశుపోషకులకు అవసరమైన సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ట్రంప్ వలన ప్రపంచానికి ముప్పు

ట్రంప్‌తో అంట కాగుతున్న మోదీ

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శింగు నరసింహారావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** అమెరికా అధ్యక్షుడు ట్రంపు వ్యవహార శైలి, యుద్ధోన్మాదం ప్రపంచానికి ముప్పుగా ఏర్పడిందని ట్రంపును అంటకాగుతున్న మోడీ విదేశాంగ విధానాలు మన దేశ ప్రజలకు శాపంగా మారాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహారావు అన్నారు. సిపిఐ సత్తుపల్లి టౌన్ ముఖ్యుల సమావేశం విశ్వశాంతి స్కూల్లో దారా భీమయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని కొనసాగించడం కోసం, గల్ఫ్‌లో ఆయిల్ నిక్షేపాలు దొంగిలించడం కోసం, అణ్వాయుధాలు పేరుతో అంతర్జాతీయ సూత్రాలను ఉల్లంగించి ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై దురాక్రమణ యుద్ధానికి పాల్పడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంపు విధానాలు ఈ ప్రపంచానికి పెనుముప్పుగా ఉన్నాయన్నారు. అమెరికాకు మోకరిల్లుతున్న మోదీ విధానాల ఫలితంగా ఈ దేశంలో 140కోట్ల మంది ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారని, వంటగ్యాసు, డీజిల్, పెట్రోల్ కొరత ఏర్పడి సామాన్యులు బ్రతకటం ఇప్పటికే భారంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, టౌన్ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, టౌన్ కమిటీ సభ్యులు రాజశేఖర్, భీమయ్య, సుధాకర్, నరసింహారావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సూర్య ప్రకాష్, ప్రసాద్, సురేష్, చైతన్య, సత్యప్రసాద్, వెంకటేష్, రాము, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## చలివేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని జెడ్పిసెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. శనివారం జెడ్పి సెంటర్‌లో ఆటో రెగ్జిన్ వర్క్ ప్రో.యాసిన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరితో కలిసి తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, డిసిసి సెక్రటరీ ముక్రంఅలీఖాన్, జాని తదితరులు పాల్గొన్నారు.

## కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం

సాయిబాలాజీలోనే మరోసారి.. ఆందోళనలో రైతులు

**ప్రజాపక్షం/మధిర :** మధిర మండలం దెందుకూరులో సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో శనివారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా కోల్డ్‌స్టోరేజీ నిర్వహకులు, రైతులు ఆందోళన చెందారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి కోల్డ్ స్టోరేజీలో దాచుకున్న రైతులు మిర్చి కాలిపోవడంతో ఆందోళన చెందారు. గతంలోనూ కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం జరగడం, ఇన్సూరెన్స్ నిర్వహకులు వచ్చి కోల్డ్ స్టోరేజీ యాజమాన్యానికి, రైతులకు నగదు చెల్లించడం జరిగింది. గతేడాది కాలంలో కోల్డ్ స్టోరేజీలో నీళ్లు వచ్చాయని, మిర్చి తడిసిపోయిందని రైతులకు నష్టం కలుగకూడదని కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం ఇన్సూరెన్స్ కంపెనీ యాజమాన్యం నుంచి సుమారు రూ.6కోట్ల వరకు రైతు పేరు మీద తీసుకున్నట్లు సమాచారం. శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోతున్న రైతులు ఎవరు బ్యాంకు లోన్లు ఎంత ఉన్నాయి, కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యం ఎంత మిర్చిని నిల్వ ఉంచింది అనేది తెలియాల్సి ఉంది. సాయి బాలాజీ కోల్డ్‌స్టోరేజీకి అసలు ఇన్సూరెన్స్ ఉందా, రెన్యూవల్ చేశారా, ఎంత మేరకు ఇన్సూరెన్స్ చేశారు అనేది తేలియాల్సి ఉంది. కోల్డ్ స్టోరేజీలో అసలు అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం అన్ని ఉన్నాయా లేదా అనేది కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు ప్రమాదం ఏవిధంగా జరిగింది, తరచూ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి అన్నది ఇప్పుడు రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు మంచి ధర కోసం పండించిన పంటను కోల్డ్‌స్టోరేజీలో దాచుకుంటే చివరకు కన్నీరే మిగులుతుంది తప్ప న్యాయం జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. కోల్డ్ స్టోరేజీ నిర్వాహకులు వారి సొంత ప్రయోజనాల కోసం రైతులను మోసం చేస్తున్నారా అసలు షార్ట్‌సర్క్యూట్ నిజంగానే జరిగిందా లేదా నిర్వహకుల ప్రమేయం ఉన్నదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా సాయిబాలాజీ కోల్డ్ స్టోరేజీలో ప్రమాదం జరిగి రైతులను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలు లేకపోలేదు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే ప్రమాదామా లేదా మోసపూరితమా అనేది తేలియాల్సి ఉంది.

## నష్టపోయిన మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** వడగండ్ల వాన, ఈదురు గాలులతో నష్టపోయిన మొక్క జొన్న రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలో అకాల వర్షం, ఈదురు గాలుల కారణంగా మొక్కజొన్న పంటలు దెబ్బతిని రైతులు నష్టాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం కారణంగా మొక్కజొన్న భారీగా దెబ్బతిన్నదన్నారు. అప్పులు చేసి సాగు చేసినరైతులు తీవ్రంగా నష్టపోయారని, దిక్కుతోచని పరిస్థితిల్లో గుండెనిబ్బరం కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే వ్యవసాయాధికారులు పంట నష్టంపై సర్వే చేపట్టి సరైన నివేదికలు తయారు చేయాలని, ప్రభుత్వం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సిపిఐ ఆదేశాల మేరకు లక్ష్మీ దేవిపల్లి మండల కార్యదర్శి ధీటి లక్ష్మీ పతి, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పరుమర్తి రాజు, దారా శ్రీనివాస్, కంటెం సత్యనారాయణ, శేఖర్, లక్ష్మణ్, మౌనిక, రాంబాబు, ఉమా మహేశ్వరి, తదితరులు క్షేత్రస్థాయిలో మొక్కజొన్న చేలను సందర్శించి జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు.



## పరిశ సీతారత్నం ట్రస్ట్ సేవలు భేష్

టిజివో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ట్రస్ట్ తరుపున ఎంఫార్మసీ విద్యార్థినికి చేయూత

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పరమత సహనం, నిరుపేదలకు సాయం రంజాన్ పర్వదిన సందేశమని అట్టి రంజాన్ పండుగ నాడు ఎంఫార్మసీ విద్యార్థినికి చేయూతనందించిన పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం టిఎన్‌జీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఫార్మసీ విద్యార్థిని కందిమళ్ల వైష్ణవికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చేయూతగా అందించిన రూ.20వేల చెక్కును ఏలూరి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలన్నారు. ముదిగొండ మండలం కమలాపురం గ్రామానికి చెందిన కందిమళ్ల వీరస్వామి, ఉషారాణి దంపతుల కుమార్తె వైష్ణవి ఉన్నత విద్యకు చేయూతనందించాలని తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు రూ.20వేలు ఆర్థిక సాయం అందించినట్లు ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, టిజివో జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, టిఎన్‌జీవో జిల్లా నాయకులు సూరంపల్లి రాంబాబు, తాళ్లూరి శ్రీకాంత్, కోటగిరి రుక్మారావు, వైష్ణవి తల్లి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో రైతు ఉత్సవాలు: కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ ద్వారా నిర్వహిస్తున్న రైతు ఉత్సవాలలో భాగంగా ఈనెల 22న సిద్దిపేట జిల్లా నంగనూరు మండలానికి చెందిన నర్మెట గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ సందర్శన, రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమానికి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 22న సీఎం సమక్షంలో రైతు భరోసా నిధుల విడుదల కూడా జరుగుతున్న సందర్భంగా మన జిల్లా నుండి కూడా రైతులు ఉత్సాహంగా పాల్గొనాలని అందుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. జిల్లాలోని 12 మండలాల నుంచి 39 ప్రత్యేక ఆర్టీసీ బస్సులలో రైతులు ఈ కార్యక్రమంలో హాజరవడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ రైతులు, మహిళా రైతులు, యువ రైతులు, అభ్యుదయ రైతులు పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

## రానున్న ఎన్నికల్లో హుజురాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



ప్రజాపక్షం/కమలాపూర్: హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నాయకుల వద్ద విభేదాలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్నటువంటి ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసమే పని చేస్తున్నారని, రాబోయే ఎన్నికలలో హుజురాబాద్ గడ్డ పై అధిష్టానం టికెట్ కేటాయించిన కాంగ్రెస్ గెలుపు ఖాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ప్రభుత్వ విప్ గా నియామకం అయినా వెంకట్ మొట్టమొదటిసారిగా కమలాపూర్ మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి సముద్రాల రమేష్ కుమార్తె సారీ ఫంక్షన్ కు హజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కమలాపూర్ నుంచి దేశరాజుపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్, టిపిసిసి ఉపాధ్యక్షులు, ఎమ్మెల్సీ వెంకట్ కు శాలువాలు కప్పి పూలమాలతో సన్మానించి కోలాట బృందాలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమాలకి హాజరైన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... కౌశిక్ రెడ్డి హుజురాబాద్ ప్రాంత సమస్యలను పట్టించుకోకుండా కేవలం కల్వకుంట్ల కుటుంబానికి బానిసలాగా వ్యవహరిస్తూ పనిచేస్తున్నారని ఆరోపించారు. హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కోసం నియోజకవర్గ ఇంచార్జీ ప్రణవ్ తో కలిసి పనులు పరిష్కరిస్తూ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తూ చచ్చే వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటామని విప్ వెంకట్ అన్నారు. ఈ కార్యక్రమంలో దేశరాజుపల్లి గ్రామ సర్పంచ్ మిట్టపల్లి మహేశ్వరి కుమారస్వామి, కమలాపూర్ మార్కెట్ కమిటి చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, మార్కెట్ కమిటి డైరెక్టర్ సముద్రాల కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చరణ్ పటేల్, రవీందర్, ఇస్తారీ, రమేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు హాజరయ్యారు.

## కాంగ్రెస్ అభివృద్ధికి నిదర్శనం... ఇందిరమ్మ ఇల్లు: ప్రణవ్



ప్రజాపక్షం/కమలాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని, దాంట్లో భాగంగా శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి నిధులు కేటాయించామని, ఈ నిధుల ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరిన్ని ఇళ్ళు కేటాయిస్తుందని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం కమలాపూర్ మండల పరిధిలోని భీంపెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ నూతన గృహ ప్రవేశానికి ముఖ్య అతిధిగా ప్రణవ్ హజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామని, దీని ద్వారా లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో ఉంటుందన్నారు. ఏప్రిల్, మే నెలలోనే రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ళు కేటాస్తున్నామని అన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన వారికి విడతలుగా ఇళ్ళను కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీంపల్లి సర్పంచ్ వాసాల శ్రీనివాస్, వార్డు సభ్యులు, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, నాయకులు మౌటం కుమారస్వామి, తడక శ్రీకాంత్, మాట్ల రమేష్, సమ్మక్క సారలమ్మ జాతర కమిటి చైర్మన్ చేరాల రోహిత్, డైరెక్టర్లు బిక్షపతి, పార్టీ సీనియర్ నాయకులు కుమారస్వామి, రవి, గణేష్, తిరుపతి, పుల్ల శోభన్, యూత్ కాంగ్రెస్ నాయకులు ధర్మలు శ్రీకాంత్, ఆసిఫ్, గాలిబ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలపై బిసి వర్గాల్లో అసంతృప్తి: శంకర్ నాయక్

ప్రజాపక్షం/గూడూరు: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని మాజీ ఓమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆరోపించారు.గూడూరు మండల కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకర్ నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు సహా అనేక హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదని ఆయన విమర్శించారు.బీసి వర్గానికీ నిధులు కేటాయింపులో అన్యాయం జరిగిందని 42 శాతం హామీ ఇచ్చినప్పటికీ ఆదిశగా చర్యలు కనిపించడం లేదని పెర్కోన్నారు. రైతులకు రూ 15000 కౌలు రైతులకు ఆర్థిక సాయం రూ 2 లక్షల రుణమాఫీ వంటి హామీలు ఇంకా అమలులోకి రాలేదని అన్నారు. అలాగే మహిళలకు రూ 2500 ఆర్థిక సహాయం చదువుకున్న మహిళలకు స్కూటీలు కొత్తగా వివాహమైన వారికి ఆర్థిక పథకాలు యువతకు రెండు లక్షల ఉద్యోగాలు వంటి హామీలు నిలిచిపోయాయని విమర్శించారు.పెన్షన్ల పెంపు విషయమై కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీలనునిలబెట్టుకోలేకపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈకార్యక్రమంలో నాయకలు వీరన్న కటార్‌సింగ్ సంపత్‌రావు శ్రీనువాస్ సురేష్‌నాయక్ రమేష్ వెంకన్న చిదురు వెంకన్న చెందర్ తదితరులు పాల్గోన్నారు.

## ఆధునిక సదుపాయాలతో రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యం

మోడల్ బస్టాండ్ పనులను పరిశీలించిన మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగు: ములుగు జిల్లా కేంద్రంలో రూ.4.80 కోట్ల వ్యయంతో నిర్మించబడుతున్న నూతన ఆర్‌టిసి బస్టాండ్ నిర్మాణ పనులను గౌరవ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బస్టాండ్ నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఆధునిక సదుపాయాలతో కూడిన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం త్రాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు వంటి మౌళిక వసతులు సమకూర్చబడతాయని పేర్కొన్నారు. ములుగు జిల్లా అభివృద్ధిలో భాగంగా ఈ బస్టాండ్ కీలక పాత్ర పోషిస్తుందని, నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, ప్రజా ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రూ.29.70 లక్షలతో బిటి ఫ్లోరింగ్ పనులను ప్రరంభించిన మంత్రి

ప్రజాపక్షం/వరంగల్: నగరంలోని బల్దియా పరిధి 19వ డివిజన్‌లో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో బల్దియా సాధారణ నిధులతో రూ. 29.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న బిటి ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, స్థానిక ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి



ప్రజాపక్షం/నర్సంపేట : ఆశలకు కనీస వేతనం ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టనంలోని అమరవీరుల స్థూపంవద్ద ఆశ కార్యకర్తలతో రాస్తారోకో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా, మేనిఫెస్టోలో పెట్టిన రూ.18 వేల రూపాయల వేతనం ఫిక్స్‌డ్ గా ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. ఆశ వర్కర్లు రెండు సంవత్సరాలుగా వేచి చూసి మూడు బడ్జెట్లో ప్రవేశపెట్టాక ప్రభుత్వం మీద నమ్మకం పోయి రోడ్ల మీదికి వచ్చారని, ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశాల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి నిధులు కేటాయింపు చేయాలని, పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని పారితోషికంలో లేనటువంటి పనులను ఆశాలతో వైద్య అధికారులు చేపిస్తున్నారని, జాబ్ చార్ట్ ప్రకారం పనులు చేపించాలని లేదంటే ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని మంగళవారం రోజున కలెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తామని, అయిన స్పందించకపోతే అసెంబ్లీ ముట్టడి చేసి నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా కార్యదర్శి సంధ్య, నాయకులు సాలమ్మ, సంధ్య, అనిత, వసుమతి, రామ, సునీత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఈద్‌గాలను సందర్శించిన సిపి

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం హన్మకొండలోని బొక్కల గడ్డ, పోతన నగర్ ఈద్గాలను ను సందర్శించి రంజాన్ ప్రార్ధనలను సజావుగా జరిగేందుకు పోలీస్ అధికారుల చేపట్టిన భద్రత ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ స్థానిక ఏ.ఎస్పీ శుభం,ఏసీపీ నర్సింహా రావు, ఇన్స్ ఇతర పోలీస్ అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

## అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ: అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం అని, అభివృద్ధి కార్యక్రమాల వల్ల నష్టపోయే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో భద్రకాళీ ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మాడ వీధుల నిర్మాణం కారణంగా ఇళ్లను కోల్పోతున్న భూ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ఎమ్మెల్యే డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలను అందజేశారు.భద్రకాళీ ఆలయ అభివృద్ధి అనేది చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన అంశమని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెంటనే నిధులు కేటాయించి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మాడ వీధుల నిర్మాణం చేపట్టడంతో కొన్ని కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోతున్న నేపథ్యంలో వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా సుమారు 17 కుటుంబాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ స్థలాలను అప్పగించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలు ముందుకు వస్తే ప్రభుత్వం కూడా వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని తెలిపారు.17 మంది కుటుంబాలకు ఇళ్ల పట్టాలను అందజేశారు.ఇళ్లను కోల్పోతున్న ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించడం మాత్రమే కాకుండా ఔట్ సోర్సింగ్ ద్వారా ఉపాధి అవకాశాలను కూడా కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.ఎటువంటి రాజకీయ దురుద్దేశ్యాలు లేకుండా ప్రజలకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజల ప్రయోజనాల దృష్ట్యా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా కొనసాగిస్తూ, ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

పర్యావరణ సంరక్షణకై కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపు




ప్రజాపక్షం/హనుమకొండ:తెలంగాణ ప్రభుత్వం అటవీ శాఖ, హనుమకొండ జిల్లా, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీ శాఖాధికారి బి. లావణ్య, ఫారెస్ట్ కాంప్లెక్స్, సుబేదారి నుంచి కాకతీయ జూలాజికల్ పార్క్ వరకు నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పర్యావరణ పరిరక్షణపై ప్రాధాన్యతను వివరించారు. అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాని కోసం అడవులకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మట్టి పాత్రల్లో నీరు, ఆహారం ఉంచడం ద్వారా పక్షులు, జీవజాలానికి సహాయపడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ బి. మయూరి, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు ఇందారం నాగేశ్వర్ రావు, చెలుపూరి శ్యామ్ సుందర్, పిట్టల రవి బాబు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిప్పని రాధిక, జిల్లా అటవీ శాఖ సిబ్బంది, జూ పార్క్ సెక్షన్ ఆఫీసర్లు సురిదాస్, శివ కుమార్, బీట్ ఆఫీసర్లు శారద, శ్వేత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పంటనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ప్రజాపక్షం/వరంగల్: రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పంటలకు మద్దతు ధరలను చట్టబద్ధత కల్పించాలి రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. వరంగల్ నగరంలో అబ్బనికుంట తెలంగాణ రైతు సంఘ భవనంలో సంఘ కమిటీ సమావేశం ఉపాధ్యక్షులు ఊరటి అంశాలరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర సదస్సు ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం అప్పులలో ఉండకుండా చూడాలంటే ప్రభుత్వ రంగ సంస్థలు ద్వారా రైతులు పండించిన పంటను కొనుగోలు చేస్తూ 100 రూపాయల పెట్టుబడి అయితే మరో 50 రూపాయలు కలిపి మొత్తంగా రూపాయలు 150 రూపాయలకు ప్రభుత్వమే రైతాంగానికి అందించాలని వ్యవసాయ శాస్త్రవేత్త సామినాథన్ కమిటీ నివేదికలో పేర్కొనడం జరిగిందని, కానీ ఈ నివేదికను ఈరోజు వరకు కూడా అమలు చేయకుండా ప్రభుత్వాలు ఓట్ల సమయంలో మాత్రమే సామినాథన్ సిఫారసులను అమలు చేస్తామని చెప్తూ వస్తున్నారన్నారు. అమెరికాలో వ్యవసాయ రంగానికి అక్కడ ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇస్తుందని, మన దేశంలో వ్యవసాయ రంగానికి 3 శాతం మాత్రమే ఇస్తుందన్నారు. దేశీయ వ్యవసాయ రంగం ఈ పోటీని ఎలా తట్టుకోగలదని, ఇలాంటి విధానాల వలన భారతదేశంలో రైతాంగానికి పంటలకు సరిపడేంత యూరియాను అందించలేకపోయిందని, అలాగే రైతులకు సరైన సమయంలో పంటలకు యూరియాను ప్రభుత్వాలు అందించకపోవడం వలన పంటలు దిగుబడి తగ్గిందన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ రైతుల సమస్యలపై రైతు సంఘాలు ఐక్యంగా ముందుకు పోవడానికి రా ష్ట్ర సదస్సును ఈనెల 31న వరంగల్ నగరం అబ్బని కుంట రైతు సంఘ భవనంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీలకు అతీతంగా ఉన్నటువంటి రైతు సంఘాలతో సదస్సును నిర్మించడం జరుగుతుందని, రాష్ట్ర రైతులు, రైతు కూలీలను శ్రేయోభిలాషులను కోరడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోకిడ పీరయ్య, జంగ జనార్దన్ రెడ్డి, లాడే మోహన్ రావు, రేముడాల దామోదర్ రెడ్డి, గుండెకారి రాజేశ్వర రావు, బొల్లు ఎల్లయ్య, నల్ల విజయేందర్, సముద్రాల రాజమౌళి, సాంబయ్య, రాజేందర్, బిక్షపతి, రవీందర్ ఇంకా ఇతరులు పాల్గొన్నారు.

## మైనారిటీల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం: ఎమ్మెల్యే




ప్రజాపక్షం/వర్ధన్నపేట : పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా వర్ధన్నపేట పట్టణంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన ఈద్-ఉల్‌ఫితర్ ప్రత్యేక ప్రార్థనల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు పలుగురికి ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా తో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, క్రమశిక్షణ, దానగుణం, సోదరభావానికి రంజాన్ పండుగ ప్రతీక అని కొనియాడారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి రంజాన్ పండుగ చివరి రోజు పండుగను జరుపుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందంగా గడుపడం సంతోషకరంగా ఉందన్నారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యమని, రంజాన్ పర్వదినాన ఆ కుటుంబాన్ని కొత్త ఇంటిలోకి పంపడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు కుడా చైర్మన్ ఇనగాల ఈద్ ముబారక్

ప్రజాపక్షం/పరకాల : పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, వరంగల్ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పరకాల పట్టణంలోని ముస్లిం సోదరులకు హృదయపూర్వక ఈద్ ముబారక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మానవాళికి శాంతి, ప్రేమ మరియు త్యాగ నిరతిని చాటిచెబుతుందని కొనియాడారు. ముస్లిం సోదరులు నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆచరించిన ఉపవాస దీక్షలు సమాజంలో క్రమశిక్షణను, పేదలకు చేసే దానధర్మాలు సామాజిక సమానత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వంలో తెలంగాణలో మత సామరస్యం వెల్లివిరుస్తోందని, నియోజకవర్గ ప్రజలందరూ ఐక్యంగా పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. సమాజంలో శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్, కౌన్సెలర్లు, మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం సహాయ నిధి: ఎమ్మెల్యే గండ్ర



ప్రజాపక్షం/భూపాలపల్లి: సీఎం సహాయ అనేది పేద ప్రజలకు వరం లాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గాండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం మంజూరు నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి టౌన్, రూరల్ మండలం 63 మంది లబ్ధిదారులకు రూ. 17,45,000 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. గణపురం మండలంలోని 58 మంది లబ్ధిదారులకు రూ.23,96,000 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, రేగొండ మరియు కొత్తపల్లి గోరి మండలాల్లో 88 మంది లబ్ధిదారులకు రూ.28,44,000 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ నిధి ఎంతో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు,ఇతర అత్యవసర అవసరాల సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలని,ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఇళ్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటూ ఇళ్లు కట్టిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



'బ్యాండ్ మేళం' మార్చి 26న రిలీజ్ అవుతోన్న ఈ సినిమా ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే లవ్‌స్టోరీగా దీన్ని రూపొందించారు. హీరో హీరోయిన్ మధ్య ఉండే ప్రేమ, గిల్లికజ్జాలను హత్తుకునేలా రూపొందించారు.

# రీల్

## చిరంజీవి చేతుల మీదుగా
# బ్యాండ్‌మేళం ట్రైలర్ రిలీజ్



మాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ రూపొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. మార్చి 26న రిలీజ్ అవుతోన్న ఈ సినిమా ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే లవ్‌స్టోరీగా దీన్ని రూపొందించారు. హీరో, హీరోయిన్ మధ్య ఉండే ప్రేమ, గిల్లికజ్జాలను హత్తుకునేలా రూపొందించారు. హీరో హర్ష్ రోషన్ తన మరదలైన హీరోయిన్ ప్రేమను గెలవటానికి ఏం చేశాడు? తనకు ఎదురైన ఇబ్బందులేంటి? వాటిని ఎలా అధిగమించాడు? అనే అంశాలతో బ్యాండ్ మేళం సినిమా రూపొంది నట్లు తెలుస్తోంది. శివ రాజు ప్రణవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ సినిమాకు సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫీ అందించారు. శివ ముప్పరాజు స్క్రీన్ ప్లే, ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహించారు. ఈ చిత్రంలోని పాటలు ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్ర బోస్ రాశారు.

# రివార్డ్స్, అవార్డ్స్ రావడం ఆనందం

### నిర్మాత : బన్నివాస్



అవార్డ్ విన్నింగ్ చిత్రాలు, కమర్షియల్ మూవీస్..ఈ రెండూ భిన్నమైనవి. పురస్కారాలు గెల్చుకునే సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ దక్కదు అలాగే కమర్షియల్ మూవీస్‌కు అవార్డ్స్ వచ్చే అవకాశాలు తక్కువ. కానీ నిర్మాతగా మంచి వ్యాల్యూస్, కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రాలను నిర్మిస్తూ, డిస్ట్రిబ్యూట్ చేస్తూ ప్రేక్షకుల రివార్డ్స్, అవార్డ్స్ సొంతం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని నిర్మాత బన్నివాస్ అన్నారు.

బన్నివాస్ ఇటీవల నిర్మించిన, డిస్ట్రిబ్యూట్ చేసిన సినిమాలు అంబాజీపేట మ్యారేజి బ్యాండు, ఆయ్, తండేల్, లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాలు కమర్షియల్‌గా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడమే కాదు పలు ప్రతిష్టాత్మక అవార్డ్స్ గెల్చుకోవడం విశేషం. బన్నీ వాస్ నిర్మించిన ఆయ్ సినిమా హోల్ సమ్ ఎంటర్‌టైనర్‌గా గతేడాది గద్దర్ అవార్డ్‌ను గెల్చుకుంది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రానికి బెస్ట్ సపోర్టింగ్ నటిగా శరణ్యకు గద్దర్ అవార్డ్ దక్కింది. ఈ ఏడాది తండేల్ సినిమా బెస్ట్ యాక్టర్, ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రంగా రెండు గద్దర్ అవార్డ్స్ సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడిగా నాగచైతన్య గద్దర్ అవార్డ్ గెల్చుకున్నారు. బన్నివాస్ డిస్ట్రిబ్యూట్ చేసిన లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాలు ఇటీవలి గద్దర్ అవార్డ్స్‌లో సత్తాచాటాయి. ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్‌తో పాటు ఈ అవార్డ్స్ అందించే ప్రోత్సాహంతో మరిన్ని మంచి ప్రాజెక్ట్ చేస్తున్నానని నిర్మాత బన్నివాస్ అంటున్నారు

# 'దేత్తడి' గ్లింప్స్ మార్చి 24న రిలీజ్



రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన ఆశిష్ హీరోగా, నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్‌తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా గ్లింప్స్ మార్చి 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ చేసిన గ్లింప్స్ పోస్టర్‌లో బ్లాక్, రెడ్ షేడ్స్‌తో రా ఎనర్జీ కనిపిస్తోంది. దేత్తడి సినిమాలో హై ఎమోషన్‌తో పాటు కొత్తగా చూపించే కల్చరర్ బ్యాక్‌డ్రాప్ స్టోరీ ఉండబోతోంది. మెయిన్ స్ట్రీమ్‌లో ఎక్కువగా చూడని అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఆశిష్ పూర్తిగా మాస్ లుక్‌లో కనిపించడమే కాకుండా, ఒరిజినల్ హైదరాబాద్ స్లాంగ్‌లో డైలాగ్స్ చెప్పబోతున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ జునైద్ కుమార్ అందిస్తున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో పాటు క్రియేటివ్ హెడ్‌గా కూడా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది.

# సందీప్ కిషన్‌తో సోషియో ఫాంటసీ చిత్రం




శంబాల బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు మళ్లీ ఓ అద్భుతాన్ని సృష్టించేందుకు రెడీ అయ్యారు. సందీప్ కిషన్‌తో ఓ భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీ మూవీని మేకర్స్ ప్లాన్ చేశారు.

ఈ సినిమాలో ఓ క్రేజీ కాన్సెప్ట్ పోస్టర్‌ను వదిలారు. ఈ పోస్టర్‌లో ఒక సింహం, తోడేలు కనిపిస్తున్నాయి. యుద్ధభూమి బ్యాక్‌గ్రౌండ్‌లో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ అలా నిటారుగా నిల్చుని ఉంది. 'కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు' అనే క్యాప్షన్ చూస్తే ఈ చిత్రం ఏ రేంజ్‌లో ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇది సందీప్ కిషన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. ఒక గొప్ప సినిమా అనుభూతిని అందించడానికి, నిర్మాతలు ప్రొడక్షన్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్ కథనం విషయంలో అన్ని విధాలా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక బృందం గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాల్ని త్వరలో ప్రకటిస్తామని, నిర్మాతలు తెలిపారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుందని నిర్మాతలు ప్రకటించారు.

## విజయ్ ఆంటోని
# తాజా చిత్రం వంద దేవుళ్లు

మల్టీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో వచ్చిన 'బిచ్చగాడు' చిత్రం ఎన్ని రికార్డుల్ని క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఈ కాంబో కలిసి వచ్చింది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో 'వంద దేవుళ్లు' అనే చిత్రం రాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ, శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. తాజాగా డైనమిక్ స్టార్ విష్ణు మంచు ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతో ఇంటెన్స్‌గా కనిపిస్తోంది. చెరుకు తోటలో విజయ్ ఆంటోనీ కత్తి పట్టుకున్న తీరు, వెనకాలే స్వాసిక మాసీ లుక్ అదిరిపోయింది. విజయ్ ఆంటోని ఇందులో రా అండ్ రస్టిక్ పాత్రని పోషిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తూ చిత్రయూనిట్‌కు విష్ణు మంచు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఇక ఈ మూవీకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్యశ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేస్తున్నారు.



# 'కామాఖ్య' పవర్ ఫుల్ థ్రిల్లర్ : నటుడు సముద్రఖని

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు.

డైరెక్టర్ అభినయ కృష్ణ మాట్లాడుతూ కామాఖ్య నేను దర్శకత్వం వహించిన రెండో చిత్రం. మొదటి చిత్రం చిరంజీవా. ఆ చిత్రంలో యమధర్మరాజుకి ఒక గుడి ఉందని, అది తెలంగాణలోనే ఉందని చెప్పడం జరిగింది. కామాఖ్య అమ్మవారి నేపథ్యంలో ఈ చిత్రాన్ని ఒక ఉత్కంఠ భరితంగా ప్రజెంట్ చేస్తూ మీ ముందుకు తీసుకువస్తున్నాం. సముద్రఖని, అభిరామి సమైరా గారు ఇలా అద్భుతమైన నటీనటులందరూ కూడా వాళ్ల కోసమే ఈ పాత్రలు సృష్టించామా అన్నంత సహజంగా వారి వారి పాత్రల్లో ఒదిగిపోయారు. నా స్నేహితుడు రిశాంక్ అలాగే బాహుబలికి పనిచేస్తున్నప్పుడు సెంథిల్ దగ్గర పరిచయమైన రమేష్.. మేము ముగ్గురం కలిసి ఈ కథను ముందుకు తీసుకెళ్ళాం. అనుకున్న సమయంలో అనుకున్న బడ్జెట్లో ఈ సినిమాని తీయగలిగాం. దీనికి మా టీమ్ అందరూ ఎంతగానో సపోర్ట్ చేశారు. దృశ్యం సినిమా తరహాలో ఉండే మంచి థ్రిల్లర్ ఇది. త్వరలో ఈ సినిమా మీ ముందుకు రాబోతోంది. ఒక నటుడిగా నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. అలాగే ఇప్పుడు దర్శకుడుగా కూడా ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను. అభిరామి మాట్లాడుతూ ఇప్పటి వరకు నేను ఇలాంటి క్యారెక్టర్ చేయలేదు. నన్ను ఇంత కొత్తగా చూపించిన డైరెక్టర్ అభిగారికి థాంక్యూ సో మచ్. ఈ సినిమాలో పనిచేస్తున్న యాక్టర్స్ టెక్నీషియన్స్ అందరు కూడా చాలా ప్రతిభావంతులు. ఒక చిన్న సినిమా వెనకాల చాలా హార్డ్ వర్క్ ఉంటుంది. టీం అందరూ కూడా ఈ సినిమా కోసం కలిసికట్టుగా పనిచేశారు. ఈ సినిమాకి సపోర్ట్ చేస్తూ ఆడియన్స్ వద్దకి తీసుకువెళ్లాలని మీడియా వారిని కోరుతున్నాను. తప్పకుండా అందరూ కూడా ఈ సినిమాని థియేటర్స్ లో చూడాలని ఆశిస్తున్నాను. ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ వాణినాథ్, డిఒపి: రమేష్ కుశేందర్ రెడ్డి, సంగీతం: గ్యాని ఎడిటర్: వరప్రసాద్, ఆర్ట్: భూపతి యాదగిరి, వి ఎఫ్ ఎక్స్ : ఫణి విహారిఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీహరి గౌడ



# బడ్జెట్‌లో గీత వృత్తిదారులకు అన్యాయం

### రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర బడ్జెట్‌లో అరకొరగా నిధుల కేటాయింపుతో గీత వృత్తిదారులకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. గతంలో కేటాయించిన నిధులను కూడా ఈ సారి కేటాయించలేదని విమర్శించారు. గీత కార్మికుల ఆర్థిక కార్పొరేషన్‌కు గత బడ్జెట్‌లో రూ.68 కోట్లు కేటాయించగా, దానిని సగానికి తగ్గించారని తెలిపారు. ఈసారి బడ్జెట్‌లో కూడా రూ.68 కోట్లు కేటాయించారని తెలిపారు. అవి కూడా పూర్తిస్థాయిలో విడుదల అవుతాయో లేదోనని సందేహం వ్యక్తం చేశారు. గత బడ్జెట్‌లో గీత వృత్తిదారుల సంక్షేమానికి కేటాయించిన రూ.10 లక్షలను ఖర్చు చేయలేదని, తాజా బడ్జెట్‌లో ఆ ఊసే లేదన్నారు. ఎక్స్ గ్రేషియా కింద గత బడ్జెట్‌లో రూ.6.10 కోట్లు కేటాయించారని, దానిని రూ.4.61 కోట్లకు తగ్గించారని, తాజా బడ్జెట్‌లో మరోసారి రూ.6.10 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇవి ఏ మాత్రం ఖర్చు చేస్తారో తెలియదని, ఇప్పటికే ఎక్స్ గ్రేషియా బకాయిలు సుమారు రూ.12 కోట్ల వరకు ఉన్నాయన్నారు. ఎక్సైజ్ పద్దులపై ఆమోదం సందర్భంగానైనా బడ్జెట్‌ను సవరించి గీత కార్మికుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు కేటాయించాలని, ఎక్స్ గ్రేషియా, కొత్త పెన్షన్‌లు, సేఫ్టీ కిట్స్, భూముల కేటాయింపు గురించి నిధులు ఇవ్వాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గీత వృత్తిదారుల సహకార ఆర్థిక కార్పొరేషన్‌కు తక్షణమే చైర్మన్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## రూ. 3,200 కోట్ల విలువైన
# ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

### టిఎన్‌జిఒ కాలనీలో భూమికి ఫెన్సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరి లింగంపల్లి మండలం పరిధిలోని టిఎన్‌జిఓ కాలనీలో సుమారు 16 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ దాదాపు రూ. 3200 కోట్లు ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

**ఆక్రమణల వెనుక అసలు కథ**

గతంలో ప్రభుత్వం టిఎన్‌జిఒ ఉద్యోగుల నివాసాల కోసం ఇక్కడ కొంత భూమిని కేటాయించింది. అయితే, 2007లో రూపొందించిన హెచ్ఎండిఎ లే అవుట్ ప్రకారం, ఇందులో 10 ఎకరాలు, ముసాయికుంట (చెరువు ప్రాంతం), 4 ఎకరాలు గ్రీన్ బెల్ట్ (హరిత ప్రాంతం), 2 ఎకరాలు ప్రభుత్వ పాఠశాల కోసం కేటాయించారు. ఇంతటి విలువైన భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ వ్యవహారంలో కొందరు ఉద్యోగ సంఘం ప్రతినిధుల ప్రోత్సాహం కూడా ఉందంటూ హైడ్రా 'ప్రజావాణి'లో ఫిర్యాదులు అందాయి.

**క్షేత్రస్థాయిలో హైడ్రా మెరుపు చర్యలు**

ఫిర్యాదులపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు జిహెచ్ఎంసి, రెవెన్యూ విభాగాలతో కలిసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించుకున్న వెంటనే, ఆ 16 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 'ఇది ప్రభుత్వ భూమి అతిక్రమించిన వారు కఠిన చర్యలకు గురవుతారు' అని హెచ్చరిస్తూ బోర్డులను కూడా ఏర్పాటు చేశారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

ముసాయికుంటను, పర్యావరణానికి కీలకమైన గ్రీన్ బెల్ట్‌ను, భావి తరాల చదువు కోసం కేటాయించిన పాఠశాల భూమిని కాపాడటంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి, భూమాఫియా నుంచి భూములను విడిపించిన హైడ్రా అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు.



# పట్టణ ప్రగతికి సర్కార్ పెద్ద పీట



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు పెద్ద పీట వేసింది. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సుమారు రూ. 17,907 కోట్లను కేటాయించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ. 723 కోట్ల నుంచి రూ. 763 కోట్ల వరకు అధికం కావడం విశేషం. ప్రభుత్వం తన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన మూసీ రివర్ ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి భారీగా నిధులను ప్రతిపాదించింది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ. 1,500 కోట్లు కేటాయింపులు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి గత ఏడాది రూ. 100 కోట్లు ఉండగా, ఈసారి దాన్ని రూ. 300 కోట్లకు పెంచారు. తొలిసారిగా మురుగునీటి పునర్వినియోగం కోసం రూ. 100 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారు. హైదరాబాద్‌పై భారం తగ్గించేలా కరీంనగర్, వరంగల్ వంటి నగరాల అభివృద్ధికి కేటాయింపులను దాదాపు రెట్టింపు చేశారు. వరంగల్ స్మార్ట్ సిటీ రూ. 441.37 కోట్లు. కరీంనగర్ స్మార్ట్ సిటీ: రూ. 250.93 కోట్లు. ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలో వీటికి ప్రత్యేకంగా రూ. 55 కోట్లు (వరంగల్ 40, ఖమ్మం 15) గ్రాంట్లుగా ప్రకటించారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు. దీని కోసం రూ. 600 కోట్లు కేటాయించగా, మల్టీ మోడల్ సబర్బన్ రైలు రవాణా వ్యవస్థకు రూ. 5 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ (మున్సిపాలిటీలు) 1,483, మిషన్ భగీరథ (పట్టణ ప్రాంతాలు) 500, నగరపాలక సంస్థలకు గ్రాంట్లు 754.70, మున్సిపల్ మార్కెట్లు 100, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం 30 50, ఘన వ్యర్థాల నిర్వహణ 150, మొత్తం కేటాయింపుల్లో ప్రగతి పద్దు కింద రూ. 10,450 కోట్లు, నిర్వహణ పద్దు, కింద రూ. 7,458 కోట్లు వెచ్చించనున్నారు. గత బడ్జెట్‌లో యాదగిరిగుట్ట, వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీలకు నిధులు కేటాయించినప్పటికీ, ఈసారి వాటికి ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం గమనర్హం.

# నా కుటుంబానికి ఏమైనా జరిగితే ఆయుధం పడతా

### కేంద్ర హోం మంత్రికి రాజాసింగ్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోషామహల్ ఎమ్మెల్యే, బిజెపి బహిష్కృత నేత టి. రాజాసింగ్ తనకు, తన కుటుంబానికి వస్తున్న వరుస మరణ హెచ్చరికలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఆయన ఒక లేఖ రాశారు. స్థానిక యంత్రాంగంపై తనకున్న నమ్మకం పోయిందని, ఇదే తన చివరి విన్నపమని ఆయన లేఖలో పేర్కొన్నారు. గత కొంతకాలంగా తనకు వరుస బెదిరింపుల ఫోన్ కాల్స్, లేఖల ద్వారా నిరంతరం మరణ హెచ్చరికలు వస్తున్నాయని, ఇప్పుడు అవి తన కుటుంబ సభ్యులను కూడా లక్ష్యంగా చేసుకున్నాయని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బెదిరింపులపై స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. కేవలం రసీదు మాత్రమే ఇవ్వడం తప్ప, తదుపరి విచారణ జరపడం లేదని తెలిపారు. 'నేను ఇకపై భద్రత కోసం ఎవరినీ బ్రతిమలాడను. ఒకవేళ నా కుటుంబానికి ఏదైనా హాని జరిగితే, నేను మళ్లీ పోలీసుల దగ్గరకు వెళ్లను. నేనే స్వయంగా ఆయుధం పట్టి బాధ్యులను అంతం చేస్తాను' అని లేఖలో రాజాసింగ్ పేర్కొనడం గమనర్హం. ఈ బెదిరింపుల వెనుక ఉన్న మూలాలను కనిపెట్టడానికి ఉన్నత స్థాయి విచారణ జరపాలని, దోషులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన కేంద్ర హోంమంత్రిని కోరారు. ఇకపై జరిగే పరిణామాలకు తన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేసిన అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# రూ.3.13 లక్షల కోట్లకు చేరిన ఐటి ఎగుమతులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ బడ్జెట్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఐటి ఎగుమతులు రూ .3.13 లక్షల కోట్లకు చేరి, 9.39 లక్షల మందికి ఉపాధి కల్పించాయి. హైదరాబాద్ జిసిసిలకు 20 శాతం దేశీయ హబ్‌గా గూగుల్ సేఫ్టీ సెంటర్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర రావడం గర్వకారణం. కమ్యూనికేషన్స్ శాఖకు రూ.875 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం రూ.774 కోట్ల నుంచి 1 3 శాతం పెరుగుదల జరిగింది. ఇందులో ముఖ్య కేటాయింపులతో టివైబర్ నెట్‌వర్క్‌ను 50,000 ప్రభుత్వ సంస్థలకు ఉచిత హైస్పీడ ఫైబర్ కనెక్టివిటీ, ప్రస్తుతం 4,800 సంస్థలు కవర్ చేస్తున్నాయి. తెలంగాణ టివైబర్ నెట్‌వర్క్‌తో ప్రభుత్వ ఖర్చులు సగం (50శాతం) వరకు తగ్గుతాయి, ప్రైవేట్ ఐఎస్‌పిలపై ఆధారపడటం ఆగుతుంది.ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలు ఐఎస్‌పిల నుంచి డేటా తీసుకుంటున్నాయి.టివైబర్‌తో ఇది ఆగి లైసెన్స్ ఖర్చు పూర్తిగా కట్ అవుతుంది. హైస్పీడ్ ఫైబర్ డైరెక్ట్‌గా ప్రభుత్వానికి ఉచితం, మధ్య వర్తుల లేకపోవడంతో ఏటా లక్ష కోట్లు ఆదా అవుతుంది. తద్వారా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు లాంగ్ టార్మ్ లాభాలు ఉంటాయి. అలాగే జిఆర్ఐడి పాలసీతో హైదరాబాద్ బయట ఐటి విస్తరించేందుకు టి ఫైబర్‌కు ప్రత్యేక నిధులు కేటాయించారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం

### తెలంగాణ చేనేత కార్మిక సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడెట్‌లో చేనేత రంగానికి తీ వ్ర అన్యాయం చేసిందని రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, అధ్యక్షులు పెం డెం సర్వేశం, ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతను ఆదుకుంటున్నట్లు ప్రకటనల ఆర్భాటమే తప్ప ఆచరణలో గుండు సున్నా అని పేర్కొన్నారు. బడ్జెట్‌లో చేనేత ,జౌళి శాఖకు కలిపి కేవలం రూ.257.56 కోట్లు మాత్రమే ప్రతిపాదించారని, అందులో రూ .203. 67 కోట్లు పవర్ లూమ్స్ కార్మికులకు, ఇన్సూరెన్స్ కోసం రూ.17.7కోట్లు, హైండ్‌లూ మ్స్ అండ్ టెక్స్‌టైల్స్ హెచ్ ఒడి రూ.15.6 కోట్లు ప్రతిపాదించారని వీటన్నిటినీ పరిశీలిస్తే చేనేతల కు కేటాయించింది ఏమీలేదన్నారు. బడెట్‌లో ప్ర తిపాదించిన కేటాయింపులలో టెక్స్‌టైల్స్ రంగానికి కేటాయించినవే ఉన్నాయని చేనేత అని ప్రకటించి మోసం చేయడం దారుణమన్నారు. మిల్లు యజమానులు, బడా పారిశ్రామిక వేత్తల అనుకూల విధానాలను విడనాడి చేనేత రంగాన్ని ర క్షించేందుకు బడ్జెట్ సవరించి ప్రత్యేకంగా చేనేతకే రూ. 2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చే శారు. తద్వారా చేనేత కార్మికులకు చేతినిండా ప ని కలిపించి ,పనికి తగిన ప్రతిఫలం అందేట్టుగా చూసి వారి అభివృద్ధికి సంక్షేమానికి నిర్దిష్టంగా చర్యలు చేపట్టాలని కోరారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com